సమావేశము - III
వాల్యూము - III
నెం. 6

వెల : రూ. 9-00
6 అక్టోబర్, 2015
మంగళవారము,
(శక సం. 1937,
అశ్విన్ - 14)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

### విషయ సూచిక

| | | పేజి నెం. |
|---|---|---|
| I. ప్రశ్నోత్తరాలు | ... | 01 |
| II. ఉపాధ్యక్షుని ఎన్నిక | ... | 20 |
| III. లఘు చర్చ : | ... | 24 |
| 1). విద్యుత్ సరఫరా గురించి (కొనసాగింపు) | | |
| 2). విద్యుత్ సరఫరాపై విద్యుత్ శాఖామాత్యుల సమాధానం | | |

* * *

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (మూడవ సమావేశపు రెండవ విడత సమావేశాల - ఆరవ రోజు)

## మంగళవారం, అక్టోబర్ 6, 2015

**(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది**

**గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)**

### 1. ప్రశ్నోత్తరాలు

మిస్టర్ ఛైర్మన్: అందరికీ నమస్కారం. క్వశ్చన్ అవర్ టేకప్ చేద్దాం. క్వశ్చన్ నెంబర్ 758 ..

**గిరిజన విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనాలు**

ప్రశ్న నెం.758(31) సర్వశ్రీ యం.యస్.ప్రభాకర్ రావు, పొంగులేటి సుధాకర్ రెడ్డి, యం.రంగారెడ్డి, ఎంఎల్‌సిలు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయాలు తెలిపెదరా:

అ) 2014-15 ఆర్థిక సంవత్సరంలో మెట్రిక్ పూర్వ ఉపకారవేతనాల కోసం గిరిజన విద్యార్థులకు విడుదల చేసిన వివరాలు ఏమిటి ;

ఆ) లక్ష్యాలకు అనుగుణంగా వ్యయం లేదన్న విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చిందా;

ఇ) అయినచో, ఆ విషయంలో తీసుకున్న చర్యలు మరియు కేటాయించిన నిధులను ఖర్చు చేయుటకు తీసుకోనున్న చర్యలేమి?

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి తరపున గృహ నిర్మాణం, న్యాయ మరియు దేవాదాయ శాఖమంత్రి ( శ్రీ ఎ. ఇంద్రకరణ్ రెడ్డి)

అ) మెట్రిక్ పూర్వ స్కాలర్‌షిప్‌ల క్రింద నిధుల విడుదలను మూడు కేటగిరీలలో చేయడమవుతుంది. అంటే

1. యస్టీ డే స్కాలర్లకు మెట్రిక్ పూర్వ స్కాలర్‌షిప్‌లు (5వ తరగతి నుండి 8వ తరగతి వరకు)

| | | |
|---|---|---|
| విడుదల చేసిన నిధులు | - | రూ.23.92కోట్లు |
| చేసిన వ్యయం | - | రూ.0.94కోట్లు |

2. మెట్రిక్ పూర్వ స్కాలర్‌షిప్‌లు(రాజీవ్ విద్యా దీవెన) (9వ తరగతి నుండి 10వ తరగతి వరకు)

| | | |
|---|---|---|
| విడుదల చేసిన నిధులు | - | రూ.7.45కోట్లు |
| చేసిన వ్యయం | - | ఏమీ లేదు. |

3. లబ్ధమైన ఉత్తమ పాఠశాలల పథకం క్రింద మెట్రిక్ పూర్వ స్కాలర్‌షిప్‌లు

| | | |
|---|---|---|
| విడుదల చేసిన నిధులు | - | రూ.14.05కోట్లు |
| చేసిన వ్యయం | - | రూ.10.36కోట్లు |

ఆ) అవునండీ.

ఇ) విద్యార్థుల రిజిస్ట్రేషన్, వారం వారీ ప్రాతిపదికన పంపిణీ పురోగతులను పొందడం కోసం జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులతో సమీక్ష, పర్యవేక్షణను చేపడట్టడమవుతున్నది. ఇప్పటి వరకు 29,621 మందిని రిజిస్టర్ చేయడమయింది.

శ్రీ సభావత్ రాములు నాయక్(నామినేటెడ్): అధ్యక్షా, మంత్రిగారు సమాధానం చెబుతూ - యస్టీ డే స్కాలర్లకు మెట్రిక్ పూర్వ స్కాలర్‌షిప్‌ల(5వ తరగతి నుండి 8వ తరగతి వరకు) విడుదల చేసిన నిధులు - రూ.23.92కోట్లు, చేసిన వ్యయం రూ.0.94కోట్లని చెప్పారు. రాజీవ్ విద్యా దీవెన క్రింద రూ.7.45కోట్లు విడుదల చేసినట్లుగా చెప్పారు. అయితే ఏఏ జిల్లాలకు ఎంతెంత ఇచ్చారో సమాధానంలో లేదు. ఎంత మంది బాలురకి, ఎంత మంది బాలికలకు ఇచ్చారో సమాధానంలో చూపించలేదు. మాకు స్కాలర్‌షిప్‌లు రావడం లేదని చాలా మంది గిరిజన విద్యార్థులు నాకు వినతి పత్రాలు ఇచ్చారు.

లబ్ధమైన ఉత్తమ పాఠశాలల పథకం క్రింద మెట్రిక్ పూర్వ స్కాలర్‌షిప్‌లకు విడుదల చేసిన నిధులు రూ.14.05కోట్లు, చేసిన

వ్యయం రూ.10.36కోట్లని చెప్పారు, మిగిలింది ఎప్పటిలోగా వ్యయం చేస్తారో చెప్పాలని కోరుతున్నాను.

విద్యార్థుల రిజిస్ట్రేషన్, వారం వారీ ప్రాతిపదికన పంపిణీ పురోగతులను పొందడం కోసం జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులతో సమీక్ష, పర్యవేక్షణను చేపడట్టడమవుతున్నదని, ఇప్పటి వరకు 29,621 మందిని రిజిస్టర్ చేయడమయిందన్నారు. ఎక్కడెక్కడ ఏయే జిల్లాలలో ఏయే పాఠశాలల్లో ఎంతవరకు ఇచ్చారో వివరంగా తెలియజేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (ఉపాధ్యాయ నియోజకవర్గం-మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్) ః అధ్యక్షా, గిరిజనుల కొరకు ఐటిడిఏ పాఠశాలలు ఏర్పాటు చేశాం, గిరిజన పాఠశాలలు ఏర్పాటు చేశాం, ఇవి గాకుండా ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు ఏర్పాటు చేశాం. అసలు గిరిజన బాలురు ఎంత మంది ఉన్నారు, వీరిలో ఎంత మంది వసతి గృహాలలో ఉంటున్నారు, ఎంత మందికి ఉపకార వేతనాలు ఇస్తున్నాం, ఎంత మంది రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్నారో తెలియజేస్తే బాగుండేది. ఎందుకంటే మన ఎక్కువ నిధులు ఇస్తున్నాం, ఆ నిధులు వినియోగం కావడం లేదు. వినియోగం లేకపోతే ప్రతి బడ్జెటులో నిధులు కేటాయించడం ఎందుకు? ఆ వివరాలు స్పష్టంగా ఉంటే దానికి అనుగుణంగా బడ్జెటులో కేటాయింపులు చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరమూ ఈ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. మురిగిపోయే పరిస్థితి వచ్చింది. ఒకవైపు తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని గిరిజనులు బాధపడుతున్నారు, మరొకవైపు ప్రభుత్వం కేటాయించిన నిధులు మురిగిపోయే పరిస్థితి వచ్చింది. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుని నిధులు కేటాయించినప్పటికీ ఆ నిధులు సక్రమంగా వినియోగంలోకి రావడం లేదంటే దానికి కారణం అధికారుల వైఫల్యం తప్ప మరొకటి కాదు. ఐటిడిఏ లో సమీక్షా సమావేశాలు పెట్టినపుడు నిధులు తక్కువగా ఉన్నాయనే మాట వస్తోంది. మరి ఇన్ని నిధులు పెట్టుకొని ఎందుకు సక్రమంగా వినియోగం కావడంలేదో మంత్రిగారు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరుతున్నాను. ఒకవైపు టీచర్లను నియామకం చేయలేదనే ఆరోపణలున్నాయి, మరొకవైపు పిల్లలకి సరైన సదుపాయాలు లేవనే ఆరోపణలూ వస్తున్నాయి. ప్రత్యేకంగా ఐదు నుండి పదో తరగతి వరకుండే పిల్లలకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదు. ఇన్ని నిధులు పెట్టుకొని ఎందుకు ఇవ్వడం లేదో స్పష్టమైన జవాబు ఇవ్వాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎ. ఇంద్రకరణ్ రెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు రాములు నాయక్ గారు మరియు సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఎంత మంది పిల్లలకి ఈ ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చారో చెప్పాలని అడిగారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు స్కూల్స్ కలిపి ఐదు నుంచి ఎనిమిది తరగతులు చదివే గిరిజన పిల్లలు మొత్తం 193560 మంది ఉన్నారు. 9 నుంచి 10 వరకు 114453 మంది ఉన్నారు, మొత్తం 308013 మంది ఉన్నారు. ఫస్ట్ క్లాసు నుంచి పదో తరగతి వరకు మొత్తం 667000 మంది గిరిజన విద్యార్థులు వివిధ పాఠశాలల్లో చదువుకోవడం జరుగుతోంది. ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, మినీ గురుకులాలలో మొత్తం 159000 మంది గిరిజన విద్యార్థులకు విద్యా బోధన చేయడం జరుగుతోంది. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ఎక్కువ నిబంధనలున్నాయి. వాటిని సడలించడంలో భాగంగా ఆధార్‌కార్డు నిబంధన తీసేయడం జరిగింది. బాల బాలికల పేర్ల మీద బ్యాంకుల్లో ఎకౌంట్లు ఉండాలంటే గ్రామీణ ప్రాంతాలలో కష్టం కాబట్టి, వాళ్ల పేర్ల మీద లేకపోయినా తండ్రి పేరు మీద ఎకౌంటున్నా పేమెంటు చేయాలని తర్వాత నిర్ణయం తీసుకోవడం జరిగింది. వచ్చే జనవరి వరకు తండ్రి పేరు మీద బ్యాంకు ఎకౌంటున్నా డబ్బులు తీసుకోవచ్చు. ఐటిడిఏ ఆఫీసు, డిటిడబ్ల్యుఓ ఆఫీసుల్లో ఫెసిలిటి సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. హాస్టల్స్‌లో వార్డెన్లు ఎప్పటికప్పుడు చెప్పడం జరుగుతోంది.

గౌరవ సభ్యులు చెప్పినట్లు రిజిస్ట్రేషన్ కొంచెం నెమ్మదిగా ఉంది. కేటాయించిన స్కాలర్‌షిప్‌ల నిధులను వచ్చే జనవరి వరకు పూర్తిగా వినియోగించడం జరుగుతుంది. ఎవరైనా పోయిన సంవత్సరం స్కాలర్‌షిప్‌లు తీసుకోకుంటే, ఆ విద్యార్థినీ విద్యార్థులు ఈ సంవత్సరం కూడా ఆమొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. పోయిన సంవత్సరం, ఈసంవత్సరం – రెండు సంవత్సరాలు ఒకేసారి క్లెయిమ్ చేసుకోవచ్చు, ఆమేరకు మేము అధికారులకు ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగింది. రాజీవ్ విద్యా దీవెన క్రింద తొమ్మిది, పదో తరగతి పిల్లలకి నెలకి రూ.350ల చొప్పున పది మాసాలకి మొత్తం రూ.3500లు,పుస్తకాలకు మరో వెయ్యి రూపాయలు, మొత్తం రూ.4500లు ఇవ్వడం జరిగింది. బాలురకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నెలకి రూ.100ల చొప్పున పది మాసాలకి రూ.1000లు, బాలికలకు రూ.150 ల చొప్పున పది మాసాలకి రూ.1500లు ఇవ్వడం జరిగింది. రాజీవ్ విద్యా దీవెన క్రింద రాష్ట్రప్రభుత్వం ఇచ్చే మొత్తాన్ని పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపడం జరిగింది, అది వంద నుంచి నూట యాభైకి పెరిగే అవకాశం ఉంటుంది. జిల్లాల వారీగా ఎలాట్‌మెంటు గురించి గౌరవ సభ్యులకు రాతపూర్వకంగా తెలియజేస్తాం.

శ్రీ సబావత్ రాములు నాయక్: సార్, ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనులకు అన్యాయం జరిగింది. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత మొన్న నేను ఆదిలాబాదు జిల్లాకి పోయాను. ఆసిఫాబాదు, నార్నూర్, ఇందర్వెల్లి, ఖానాపూర్ మండలాలలో పర్యటించాను. సంబంధిత అధికారులను అక్కడికి పంపించి కొంచెం స్పీడుగా పని చేయాలి. ఆసిఫాబాదు, ఆదిలాబాదు నియోజకవర్గాలలోని ఏడు మండలాలలో నాలుగువేల మంది టైఫాయిడ్తో ఇబ్బంది పడుతున్నారు. మొన్న ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఛత్తీస్ఘడ్ నుంచి కిట్స్ తెప్పించి ఆ గిరిజనులకు ట్రీట్మెంటు ఇప్పించారు. మాజిల్లాకి చెందిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిగారు ఇక్కడే ఉన్నారు. వారి దృష్టికి తీసుకొస్తున్నాను. ఆ మండలాలలో గిరిజనులు డయేరియా, మలేరియా వ్యాధులతో బాధపడుతుంటే, వాళ్లని ట్రీట్ చేయడానికి డాక్టర్లను డెప్యుటేషన్ మీద వేస్తే ఆ డాక్టర్స్ వెళ్లడం లేదు. డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఐటిడిఏ పి.ఓ, డాక్టర్లు అక్కడ ఉండి పని చేసేలా ఆదేశాలు ఇవ్వాలి. జ్వరాలతో బాధ పడుతున్నారు గిరిజనులు. మండలంలో 20, 25 ఏళ్ల లోపు వాళ్లు ఐదు, పది మంది చనిపోతున్నారు. సంబంధిత అధికారులందరితో జిల్లాలో ఒక సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: రాజీవ్ విద్యా దీవెన పథకం క్రింద తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు స్కాలర్షిప్లు ఇస్తారు. నామమాత్రంగా అప్లికేషన్ ఫార్మ్ని డిఇఓలకు పంపిస్తారు, ఆ డిఇఓలు తిరిగి ఎంఇఓలకి, డెప్యూటీ డిఇఓలకి పంపితే, వాళ్లెవ్వరికీ కూడా ప్రొఫార్మా నింపి తీసుకెళ్లాలనే ఆలోచన ఉండదు. ఇప్పటి వరకు దానికి సంబంధించిన ఫాలో అప్ కార్యక్రమం లేదు. prescribed date వరకు ఎన్ని అప్లికేషన్స్ వచ్చాయో చెప్పిన ఉదంతం లేదు. ఆ ఫాలో అప్ కార్యక్రమం లేకపోవడం వల్ల స్కాలర్షిప్ల వినియోగం జరగడం లేదు. కనీసం గిరిజన శాఖ పక్షాన ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి వాళ్లద్వారా ఆ వివరాలు సేకరించి, ఆ స్కాలర్షిప్లు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి: అధ్యక్షా, ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు మొత్తం 102131 మంది బాలురున్నారు. బాలికలు 91429 మంది ఉన్నారు, అంటే మొత్తం 23.92శాతం మంది ఈ ఐదు నుంచి ఎనిమిది వరకు చదువుతున్నారు. గౌరవ సభ్యులు రాములు నాయక్గారు చెప్పినట్లుగా ఆదిలాబాదు జిల్లాలో గిరిజన ప్రాంతం, ఏజన్సీ ఏరియా ఎక్కువగా ఉంది. ఉట్నూరులో ఐటిడిఏ ఉంది. అక్కడ ఉన్న సబ్కలెక్టర్ డైనమిక్గా తిరుగుతున్నారు. మండల సమావేశాలు, జనరల్ బాడీ మీటింగుల్లో ఈ స్కాలర్షిప్ల గురించి, రాజీవ్ విద్యా దీవెన క్రింద వచ్చే స్కాలర్షిప్ల గురించి ప్రతి ఒక్కరికీ తెలిసేలా, ఎంఇఓలు, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ద్వారా అన్ని పాఠశాలలకి ఈ విషయాన్ని తెలిపి ప్రతి రూపాయి ఖర్చు పెట్టే విధంగా, గిరిజనులకు చేరే విధంగా తప్పకుండా ప్రయత్నం చేస్తాం. జిల్లా పరిషత్ మీటింగుల్లో దీని గురించి మాట్లాడుతున్నాం. వివిధ ఫోరమ్స్లో వాళ్లను ఎడ్యుకేట్ చేసి, స్కాలర్షిప్పుల తీసుకోండి, అది మీ హక్కు అని చెప్పడానికి మేమందరమూ ప్రయత్నం చేస్తున్నాం.

ఈ విషజ్వరాల గురించి పత్రికలలో వచ్చిన తెల్లారే గౌరవ ముఖ్యమంత్రిగారు – మహబూబ్నగర్లో ఉన్న హెల్త్ మినిస్టర్ లక్ష్మారెడ్డి గారికి ఫోను చేసి పిలిపించి హుటాహుటిన ఆదిలాబాదుకి పంపించడం జరిగింది. జోగు రామన్న గారు, నేను, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పీ.ఓ. , డియంహెచ్ఓ అందరమూ కలిసి ఒక టీముగా ఏర్పడి మీటింగు ఏర్పాటు చేసుకుని, ఏఏ ప్రాంతంలో విషజ్వరాలున్నాయో ఆ ప్రాంతాలను సందర్శించడం జరిగింది. లక్ష్మారెడ్డిగారు రెండు రోజులు జిల్లాలో తిరిగి హైదరాబాదులోని నిమ్స్ నుంచి, ఉస్మానియా ఆసుపత్రి నుంచి, గాంధీ హాస్పిటల్ నుంచి దాదాపుగా 15మంది డాక్టర్లతో కూడిన వైద్య బృందాన్ని పిలిపించి, బాధ పడుతున్న గిరిజనులకు ట్రీట్మెంటు ఇప్పించి విషజ్వరాలను కంట్రోల్ చేయడం జరిగింది. జోగు రామన్న గారు నార్నూర్ మండలంలో, నేను సిర్పూర్ మండలంలో, నగేష్ గారు జైనూర్ మండలంలో – ఈవిధంగా మండలాలను డిస్ట్రిబ్యూట్ చేసుకుని అన్ని హాస్పిటల్స్ని పర్యవేక్షిస్తూ, డాక్టర్లు, పారా మెడికల్ స్టాఫ్ని తీసుకొచ్చి ఎవరికీ ఇబ్బంది లేకుండా మరణాలు ఆపడం జరిగింది. గిరిజనులు ఎలా ఉంటారంటే – వారికి విషజ్వరం వచ్చినా, ఏది వచ్చినా ఇంట్లోనే ఉండిపోతారు, హాస్పిటల్కి వెళ్లరు. వాళ్లని ఎడ్యుకేట్ చేయాలి. గ్రామాలలో ఉండే పారా మెడికల్ స్టాఫ్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్స్ని గ్రామ జ్యోతి కార్యక్రమంలో అప్రమత్తం చేసి, ఇంటింటికీ వెళ్లి ఎవరింట్లోనైనా విషజ్వరాలతో బాధ పడుతుంటే వారిని గుర్తించి, ఆదిలాబాదులోని రిమ్స్లో ప్రత్యేకంగా ఒక బ్లాకుని ఏర్పాటు చేసి అంబులెన్స్లో అక్కడికి తరలించడం జరిగింది. అక్కడ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక ఐఏయస్ అధికారిని పెట్టి, రిమ్స్కి వచ్చే రోగులకు టిఫిన్లు, భోజనం ఏర్పాటు చేసి వారికి బస్సు ఛార్జీలు కూడా ఇవ్వడం జరిగింది. విషజ్వరాలు కంట్రోల్ అయ్యాయి. ఇప్పుడు ఎక్కడా ఇబ్బంది లేదు. ఈ సంవత్సరం మరణాలను బాగా తగ్గించగలిగాము. జైనూరులో 30 పడకల ఆసుపత్రి కావాలని, ఉట్నూరులో ఉన్న ఆసుపత్రి అప్గ్రేడ్ చేస్తూ ఏరియా హాస్పిటల్గా చేయాలని కోరుతున్నారు. తప్పకుండా

ఆ కార్యక్రమం జరుగుతుంది. మిగతా విషయాలను గౌరవ సభ్యులకు రాతపూర్వకంగా తెలియజేస్తానని మనవి చేస్తున్నాను.

## రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి

10.20 ఉ. ప్రశ్న నెం.878 (32) శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి., గౌరవనీయులైన గృహనిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ) కరీంనగర్ జిల్లా, వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించడమయిందా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి; ఈ విషయంలో చేసిన ఏదేని బడ్జెట్ కేటాయింపు ఎంత?

గౌరవనీయులైన గృహనిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి (శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి) :

అ) అవునండీ.

ఆ) అవసరమైన బడ్జెట్ కేటాయింపుతో కరీంనగర్ జిల్లా, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం, పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం తగిన సంస్థను ఏర్పాటు చేసే విషయం ప్రభుత్వ క్రియాశీలక పరిశీలనలో ఉంది. ఉత్తరువులను త్వరలో జారీ చేయడమవుతుంది.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, ఈమధ్యకాలంలో వేములవాడ శాసనసభ్యులైన శ్రీ రమేష్‌బాబు గారి నేతృత్వంలో గౌరవ ముఖ్యమంత్రి గారు శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని పర్యటించడం జరిగింది. ఆ పర్యటన సందర్భంగా వేములవాడ అభివృద్ధి కొరకు, శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కొరకు రూ.100కోట్లు విడదల చేయడం జరిగింది. దానిలో ఒక యాక్షన్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, అంతే కాకుండా కంచి కామకోటి పీఠాధిపతులు ఎవరైతే ఉన్నారో, వారి నేతృత్వంలో దేవాలయాన్ని మొత్తం renovate చేసేట్లుగా సరియైన పథకాన్ని రూపకల్పన చేయాలని గౌరవ ముఖ్యమంత్రి గారు ఆదేశించడం జరిగింది.

ఇంతవరకు ఆ పథకానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ రూపకల్పన జరిగిందా, ఎలాసైతే యాదాద్రిలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని renovate చేయడానికి ఒక కమిటీ వేశారో అదేమాదిరిగా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయాన్ని renovate చేయడానికి ఒక కమిటీ వేసి దానిని అభివృద్ధి చేసేటువంటి కార్యక్రమాన్ని తీసుకుంటున్నారా?

వేములవాడలోని బస్‌స్టాండు నుండి దేవాలయం వరకు ఉన్నటువంటి రోడ్డును వెడల్పు చేయాలని గతంలోనే కోరడం జరిగింది. ఈ పథకంలో ఆ రోడ్డు వెడల్పు చేసేటువంటి కార్యక్రమం ఏమైనా ఉన్నదా, మరియు ఇప్పుడున్నటువంటికి అదనంగా 150 గదుల నిర్మాణం, మరియు దేవాలయాన్ని అభివృద్ధి పరచాలని 150ఎకరాల స్థలాన్ని సేకరించాలనే ప్రతిపాదన కూడా చేయడం జరిగింది. ఇవన్నీ కూడా గౌరవ ముఖ్యమంత్రి గారి సమక్షంలో కోరడమైనది. అసలు ఆ ప్రణాళిక ఎలా వుంది, అందులో ఏ, ఏ అంశాలు పొందుపరుస్తున్నారనే స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిందిగా మీద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయానికి వెళ్లి వారు అక్కడ అన్ని ప్రత్యక్షంగా చూడడం జరిగింది. అలాగే అక్కడ Urban Development Athorityని నియమించడానికి ప్రతిపాదనలు తయారవుతున్నాయి. ఆలయ పరిసర ప్రాంతాల్లోని వెయ్యి మీటర్ల పరిధిలో పది మీటర్లు G +2 కట్టడములను గుర్తించి వాటిని తొలగించుటకు మరియు పదిమీటర్లు అంతకుంటే ఎక్కువ దేవాలయం కంటే ఎత్తు ఉండగూడదు అన్న ఆలోచనతో, G+2 కంటే ఎక్కువ ఎత్తులో భవనాలు నిర్మించుటకు అనుమతులు ఇవ్వగూడదని అక్కడి గ్రామ పంచాయితీకి ఆదేశాలివ్వడం జరిగింది.

శ్రీ స్వామి వారి నిత్య కళ్యాణ మండపం తొలగింపు విషయంలో రెండవ ప్రాకారం కట్టుటకై మరియు వేద ఆగమ పాఠశాల ఏర్పాటు చేయుటకై శ్రీ శ్రీ శ్రీ శృంగేరి పీఠాధిపతులను సంప్రదించి వారి సందర్శనార్థం, వారి సలహా, సూచనల మేరకు అవసరమైన తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. దేవాదాయ శాఖ కమీషనరు మరియు ఇతర ఇంజనీరింగు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో మాట్లాడినప్పుడు దసరా తరువాత రమ్మని చెప్పడం జరిగింది. కాబట్టి, దసరా తరువాత వారి ఎప్పుడు రమ్మంటారో ఆ సమయాన్ని తీసుకొని, అక్కడికి వెళ్లి వారిని ఆహ్వానించి వారికి ఇక్కడ చేయదలుచుకున్న ప్రణాళికలన్ని చూపెట్టిన తరువాత వారు దానిని అప్రూవల్ చేసినట్లయితే అప్పుడు నిర్మాణాలు కూడా మొదలుపెట్టవచ్చు.

దేవాలయం ఎదుట వెడల్పు రెండవ ప్రాకారం నిర్మాణం చేయుట కొరకు సీతారామ స్వామి కళ్యాణానికై అవసరమైన దాదాపు A20 to A30 వరకు భూమిని సేకరించుటకై గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు కలెక్టర్ కరీంనగర్ తేది:18-08-2015 నాడు సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పై భూమి సేకరణ

విషయమై ఆయా సర్వే నంబరు దారులను సేకరించుటకై జిల్లా యంత్రాంగం తగు చర్యలు చేపడుతుంది.

దేవాలయం దగ్గర ఉన్నటువంటి చెరువు వెడల్పు కార్యక్రమ నివేదికను తయారు చేయుటకై సాగు నీటిపారుదల శాఖ వారి ఆధ్వర్యంలో ఒక ప్రైవేటు ఏజెన్సీని కూడా ఏర్పాటు చేయడమైనది. ఆవిధంగా చెరువు వెడల్పు చేయడానికి కార్యక్రమాలు జరుగుతున్నాయి. వేములవాడ ప్రధాన రహదారి వెడల్పు చేయడంలో భాగంగా Executive Engineer, R&B Department సదరు రహదారి ఎంత వెడల్పు ఉండాలి, దాని నిర్మాణం వలన ప్రభావిత మయ్యే నిర్మాణాల భూసేకరణ వివరాలు సంబంధిత అధికారులు సేకరిస్తున్నారు. రూ.7.5కోట్లతో వేములవాడ నుండి నాంపల్లి వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయుటకై ప్రభుత్వ అంచనాలను జిల్లా కలెక్టరు ద్వారా ప్రభుత్వానికి సమర్పించడమైనది. అదేవిధంగా నాంపల్లి గుట్టపై కళాశాల నిర్మాణం, Panoramic view, land scaping కోనేరు, ధ్యాన మందిరం ఏర్పాటు చేయుటకై పర్యాటక శాఖ వారితో సంప్రదించగా, వారు సదరు గుట్టను సందర్శించి అభివృద్ధి పనులకై ప్రాజెక్టు నివేదికను కూడా తయారు చేస్తున్నారు. సంకెపల్లి గ్రామం మూలవాగుపై చెక్‌డ్యాం నిర్మాణం చేయుటకై నీటి పారుదల శాఖ వారు తగు చర్యలు చేపడుతున్నారు.

గౌరవ ముఖ్యమంత్రి వర్యుల సూచన మేరకు జిల్లా అధికారులైన Executive Engineer, R&B Department, Vemulawadaకు రెండు బైపాస్ రోడ్లను అభివృద్ధి చేయడంలో భాగంగా మొదటి బైపాస్ రోడ్డు సుందరీకరణకు గాను రూ.14.50కోట్లు రెండవ బైపాస్ రోడ్డు మరియు సుందరీకరణకు రూ.8.5కోట్లు, నంది విగ్రహం నుండి తిప్పాపూరు గ్రామం రహదారి వెడల్పునకై రూ.15కోట్ల మంజూరు కొరకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. ఆలయ అభివృద్ధిలో భాగంగా పైన పేర్కొన పనులన్నీ చేపట్టుట కొరకు గౌరవ ముఖ్యమంత్రి గారు సంవత్సరానికి రూ.100కోట్ల చొప్పున నాలుగు సంవత్సరాలకు గాను రూ.400కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పడం జరిగింది.

ఈ నిధుల మంజూరుకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. అంతేకాకుండా Development Authority ఏర్పాటు చేయటకై ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. వేములవాడ గుడి చెరువు FTL పరిధిలో పిల్లర్లు నిర్మాణం చేయుటకు గాను కార్యనిర్వాహక అధికారి అనుమతిస్తూ రూ.4లక్షలు తహసిల్దారు, వేములవాడకు చెల్లించుటకు కమీషనర్ ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగింది. గుడిచెరువు divider FTL పరిధి నుంచి ఆనుకొని top width 150feet or 46metres చేయుటకు గాను DPR తయారయింది. దీనిని Manasa Association & Consultants Architect Builders, Karimnagar నకు రూ.4,96,490కు కొటేషన్ ద్వారా అనుమతించడం జరిగింది.

ఈవిధంగా శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి గారే అక్కడ అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని స్థపతిద్వారా, అన్ని ఆచారాల ప్రకారంగా దీనిని అభివృద్ధి చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. తప్పకుండా రానున్న కాలంలో ఈ పుణ్య క్షేత్రం అభివృద్ధి కావడానికి కూడా చాలా అవకాశాలున్నాయి. నిన్ననే గౌరవ శాసనసభ్యులు, కమీషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసుకొని దీని పురోగతి గురించి కూడా రెవ్యూ చేయడం జరిగింది.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు వేములవాడను సందర్శించిన సందర్భంగా, అక్కడ ఒక Vedic and Music School కావాలని కోరడం జరిగింది. అది అక్కడ చాలా అవసరం. అంతే కాకుండా ఆ ప్రాంతంలో ఒకటి మంచి Meditation Hall ను కూడా ఏర్పాటు చేయాలని కోరాము. వాటి గురించి కూడా గౌరవ మంత్రివర్యులు తెలియజేయాలని మీద్వారా కోరడమవుతుంది.

శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి : అధ్యక్షా, నిన్న జరిగినటువంటి రెవ్యూలో మ్యూజిక్ పాఠశాల ఏర్పాటు చేయుటకై నిర్ణయం తీసుకోవడం జరిగింది. దానికి సంబంధించిన నిధుల కేటాయింపు విషయమై ఈ ఎస్టిమేట్‌లో పెట్టడం జరుగుతుంది. అలాగే మెడిటేషన్ హాలు, సీతారామ కళ్యాణం, శివ కళ్యాణం గురించి రెండు పెద్ద హాల్స్ నిర్మాణం చేయడం, బస్టాండును కూడా దేవాలయం ముందరకు తరలించే విధంగా అన్ని రకాలుగా చర్యలు తీసుకోవడం జరిగింది. గౌరవ మంత్రివర్యుల శ్రీ హరీష్‌రావు గారు దేవాలయాన్ని ఆనుకొని ఉన్నటువంటి చెరువును కూడా మంచి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దడానికి అంగీకరించారు. ఈ విధంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

మిస్టర్ ఛైర్మన్ : ప్రశ్న నెం.868(33) సభ్యుడి కోరిక మేరకు వాయిదా వేయడం అయినది.

## కృష్ణా పుష్కరాలకు కార్యాచరణ ప్రణాళిక

ప్రశ్న నెం.877(34) డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి, శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎం.ఎల్.సి.లు, గౌరవనీయులైన గృహనిర్మాణ, న్యాయ,

దేవాదాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గోదావరి పుష్కరాల తరహాలోనే పెద్దఎత్తున కృష్ణా పుష్కరాలను, సమ్మక్క-సారక్క జాతరను నిర్వహించాలని యోచిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక, ఖర్చు చేయాలని ప్రతిపాదించిన మొత్తాల వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన గృహనిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి (శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి): అ) అవునండీ.

ఆ) 2016లో రాబోయే సమ్మక్క, సారలమ్మ జాతరను సాఫీగా నిర్వహించడానికి చేపట్టవలసిన శాఖ వారీ పనులు కార్యాచరణ ప్రణాళికను వరంగల్ జిల్లా కలెక్టరు ప్రభుత్వానికి సమర్పించారు. వాటికి ప్రభుత్వ ఆమోదాన్ని త్వరలోనే ఇవ్వడమవుతుంది. నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్లు ఇతర అనుబంధ శాఖలు 2016, కృష్ణా పుష్కరాల కోసం ఆవశ్యకతలను సమర్పించాలని సూచించడమయింది. ఈ విషయంలో అవసరమైన చర్యను ప్రభుత్వం త్వరలోనే చేపడుతుంది.

డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం - వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ) : అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా ఈ ప్రభుత్వం గోదావరి పుష్కరాలను చాలా అద్భుతంగా నిర్వహించింది. అందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాము. అదేవిధంగా కృష్ణా పుష్కరాలంటే ఒక్కప్పుడు విజయవాడ అనే చెప్పుకునే వారు. కృష్ణా నదీ మన రాష్ట్రంలోనే చాలా దూరం ప్రవహిస్తున్నప్పటికీ, ఎప్పుడు కూడా మన దగ్గర ఎక్కువగా కృష్ణా పుష్కరాలకు ప్రాధాన్యతనివ్వలేదు. గోదావరి పుష్కరాలు చేసినట్లుగానే, కృష్ణా పుష్కరాలను కూడా అద్భుతంగా నిర్వహించేందుకు ఇక్కడ ఎక్కడెక్కడైతే కృష్ణా నదీ పారుతుందో ఆయా చోట్ల ఏమైనా గాట్లను గుర్తించి అక్కడ పనులేమైనా మొదలుపెట్టారా?

సమ్మక్క-సారలమ్మ జాతర, భారతదేశంలో జరుగుతున్న అతిపెద్ద గిరిజన జాతర. ఈ జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. దానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతుందని చెబుతున్నప్పటికీ అక్కడికి వెళ్లేటువంటి రహదారుల విస్తరణ జరపకపోవడం వలన గంటల తరబడి, రోజుల తరబడి భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. అందుకని ఆయొక్క రోడ్ల విస్తరణకు శాశ్వత పరిష్కారం ఏమైనా చేపట్టారా అని గౌరవ మంత్రివర్యులను మీద్వారా కోరుతున్నాను. అలాగే గోదావరి పుష్కరాలకు ఏర్పాటు చేసినటువంటివి ఏర్పాట్లు కొన్ని ఈ పుష్కరాలకు కూడా సరిపోతాయి. అవే కాకుండా ఇంకా ఏమైనా పెంచడానికి చర్యలు చేపడుతున్నారా అనేది వివరించాలని కోరుతున్నాను.

శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, మొన్న జరిగినటువంటి గోదావరి పుష్కరాలను ప్రభుత్వం చాలా బ్రహ్మాండంగా నిర్వహించడం జరిగింది. అదే ప్రక్క రాష్ట్రంలో చూస్తే పెద్ద దుర్ఘటన కూడా చోటుచేసుకోవడం జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆంధ్ర ప్రాంతం నుండి తెలంగాణ ప్రాంతానికి పుష్కర స్నానాల కొరకు వచ్చిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఆ రకంగా విపరీతమైన రద్దీ ఏర్పడినప్పుడు కూడా పోలీసులు గానీ, మంత్రులు గానీ, దేవాదాయ శాఖ వారు గానీ, ప్రభుత్వ యంత్రాంగమంతా కలిసి ప్రభుత్వ ప్రతిష్ట పెంచేవిధంగా తెలంగాణ ఏర్పడిన తరువాత తొలి పుష్కరాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆ రకంగా ఈరోజు ప్రభుత్వానికి పేరు, ప్రతిష్టలు వచ్చాయని తెలియజేసుకుంటున్నాను. ఎలా అయితే గోదావరి పుష్కరాలు నిర్వహించారో అంతకంటె మిన్నగా కృష్ణా పుష్కరాలను నిర్వహించాలని కోరుతున్నాను.

అదేవిధంగా గత ప్రభుత్వాల హయాంలో సమ్మక్క-సారలమ్మ జాతరను నిర్వహించినప్పుడు పనులేవన్నా చేయాలంటే, సమ్మక్క-సారలమ్మ జాతరకు రెండు, మూడు నెలల ముందే చేపట్టేవారు. అప్పుడు పనుల్లో లోపాలుండేవి. కానీ, ఇప్పుడు అలా కాకుండా గౌరవ ముఖ్యమంత్రి గారు, గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు, దేవాదాయ శాఖ మాత్యులు, గిరిజన శాఖ మాత్యులు, తదితరులు ఎప్పటికప్పుడూ సమ్మక్క-సారలమ్మ జాతరపై రెవ్యూ చేసుకుంటూ పకడ్బందీగా నిర్వహించాలనే ఆలోచన చేస్తున్నట్లుగా వార్తా పత్రికల్లో చూడడం జరుగుతుంది. ఆ రకంగా చేసినట్లయితే ఇది ప్రపంచంలోనే రెండవ పెద్ద జాతర కాబట్టి ఎలాంటి చెడు సంఘటనలు జరుగకుండా చేస్తూ దానిని జాతీయ పర్యాటక కేంద్రంగా మరియు జాతీయ జాతరగా డిక్లేర్ చేస్తూ జాతరను ప్రతిష్టంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి (ఉపాధ్యాయ నియోజకవర్గం - మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్): అధ్యక్షా, ప్రప్రథమంగా గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తూ, అదేవిధంగా కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏ, ఏ పద్ధతులు చేపడుతున్నారో తెలియజేయాలని మీద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

అదేవిధంగా అంచనాల కమిటీతో సమక్క-సారలమ్మ జాతర ప్రాంతాన్ని పర్యటించడం జరిగింది. జాతర సమయంలోనే కాకుండా ప్రతిరోజూ కూడా భక్తులు అక్కడికి వచ్చే అవకాశం ఉంది. సెలవు దినాల్లో పిక్నిక్ వెళ్లే మాదిరిగా చాలామంది అక్కడికి వచ్చినట్లుగా మరియు అక్కడా వైద్య సదుపాయాలు కూడా లేకపోవడం మేము గమనించడం జరిగింది. నిరంతరం వచ్చే భక్తులకు అందుబాటులో ఉండేవిధంగా స్నానాల గదులు గానీ, బట్టలు మార్చుకునే గదులు గానీ, శానిటేషన్ గానీ, మంచినీటి వసతి గానీ, వైద్య సదుపాయాలు గానీ, తదితర సౌకర్యాలు శాశ్వతంగా ఏర్పాట్లు చేయడానికి ప్రణాళికలు చేయాలని అలాగే ఆ దేవాలయాన్ని ఆనుకొని ఉన్న భూమిని ఒక ఉద్యాన వనంగా అభివృద్ధి చేసే దిశగా ఆలోచన చేయాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్ (ఉపాధ్యాయ నియోజకవర్గం – వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ): అధ్యక్షా, నల్లగొండ జిల్లా, చందన్ పేట మండలంలో కృష్ణా పుష్కరాలను నిర్వహించడానికి మంచి అనువైన ఘాట్ ప్రదేశం ఉంది. ఇటీవల ఆ మండలంలో తిరుగుతున్న సందర్భంలో ఆ విషయం చర్చకు వచ్చింది. అక్కడ ఒకవాల్ నిర్మాణం చేస్తే కొన్ని వేల మంది అక్కడ పుష్కర స్నానం చేసేటువంటి అవకాశం ఉంది.

అదేవిధంగా వరంగల్ జిల్లాకు సుదూరమైన ప్రాంతంలో ఉన్నటువంటి సమ్మక్క-సారలమ్మ జాతరను నిర్వహిస్తుంటాము. కేవలం ఆ జాతర సమయాన్నే దృష్టిలో పెట్టుకొని తాత్కాలికమైన ఏర్పాట్లు అప్పటికప్పుడు గత ప్రభుత్వాలు చేయడం జరిగింది. అక్కడికి లక్షలమంది వెళ్తుంటారు కాబట్టి రద్దీ లేకుండా రోడ్లు బ్లాక్ కాకుండా ముందుగానే చర్యలు చేపట్టాలని కోరుతున్నాను. గౌరవ సభ్యులు తెలియజేసినట్లుగా నిత్యం చాలామంది భక్తులు అక్కడికి వెళ్తుంటారు. కానీ అక్కడ ఉండడానికి గదులు ఏమాత్రం లేవు, కనీస సౌకర్యాలు కూడా లేవు. ఆ సౌకర్యాలు నీటి వసతి, రాత్రి పూట బస చేసేందుకు అవకాశం ఉండేట్లుగా చేయాలని మీద్వారా గౌరవ మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

శ్రీ ఇంద్రకరణ్ రెడ్డి : అధ్యక్షా, గౌరవ సభ్యుల అడిగిన ప్రశ్నలకు సమాధానం ఏమిటంటే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యంగా జూలై 14 నుండి 25, 2015 వరకు తొలి పుష్కరాలను నిర్వహించడం జరిగింది. శ్రీ టి.హరీష్‌రావు, శ్రీ కె.తారాక రామారావు, శ్రీ తుమ్మల నాగేశ్వర రావు తదితరులతో కమిటీ ఒక కమిటీ వేసి గోదావరి పుష్కరాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటి పుష్కరాలు కాబట్టి గోదావరి పుష్కరాలు ఘనంగా నిర్వహించాలని గౌరవ ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గతంలో 27 Ghats ఉండగా, ఇప్పుడు 107 Ghats ని గుర్తించి సాగు నీటిపారుదల శాఖ తరఫున దాదాపు రూ.120కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. ఈ విధంగా R&B Department, Panchayat Raj Department, Endowment Department ప్రతి డిపార్టుమెంటు నుండి పనులు పర్యవేక్షించి దాదాపు రూ.650కోట్ల వరకు ఖర్చు పెట్టడం జరిగింది. గతంలో నిర్మించినటువంటి Ghats కూడా ధర్మపురి లాంటి పుణ్యక్షేత్రంలో కూడా దాదాపు 100 మీటర్ల వరకే ఉండేవి. అటువంటిది ఈ సంవత్సరం అదనంగా 500మీటర్ల వరకు పెంచి ఎంతమంది భక్తులు వచ్చినా పుణ్యస్నానం చేసేందుకు అందుబాటులో ఉండేవిధంగా బాసరలో గానీ, కాళేశ్వరంలో గానీ, భద్రాచలంలో గానీ అదేవిధంగా ధర్మపురిలో మంచి ఏర్పాట్లు చేయడం జరిగింది. దానివల్ల ఎవరికీ ఇబ్బంది కాలేదు.

గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాలతో ఎవరికి వారు శ్రీ టి.హరీష్ రావు, శ్రీ ఈటల రాజేందర్ గారు గానీ, శ్రీ నాయిని నర్సింహారెడ్డి గారితోపాటుగా మిగతా మంత్రులందరూ కలిసి ఒక్కొక్క ప్రాంతాన్ని ఒక్కొక్కరుగా బాధ్యతలు తీసుకొని ట్రాఫిక్ నియంత్రణలో గానీ, Ghats వద్ద గానీ, దేవాలయాల్లో రద్దీ విషయం గానీ ఎక్కడా ఏమి జరగకుండా జాగ్రత్తపడడం మూలంగా ఈయొక్క పుష్కరాలు చాలా విజయవంతమయ్యాయి. దాదాపు 6,64,00,000ల మంది పుణ్య స్నానాలు చేసినట్లుగా ప్రభుత్వ రికార్డులో రావడం జరిగింది.

ఆ విధంగా కేంద్ర ప్రభుత్వానికి రూ.650కోట్ల Detailed Project Report పంపి తెలంగాణ ప్రాంతానికి కూడా మీవంతు సహాయంగా అందించాలని కోరినప్పుడు తెలంగాణకు రూ.50కోట్లు మాత్రమే ఇచ్చారు. కానీ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలకి మాత్రం రూ.100కోట్లు, రూ.100కోట్లు, ఇవ్వడం జరిగింది.

**10.40 ఉ.** అన్ని ప్రాంతాల కంటే ఎక్కువగా తెలంగాణ ప్రాంతంలోనే భక్తులు ఎక్కువగా పుష్కర స్నానం చేస్తారు. ఈ రకంగా తెలంగాణ ప్రాంతం ఎంతో వివక్షకు గురైంది. ఈ విషయాన్ని మేము ఎన్నో సార్లు చెప్పాము. మన ముఖ్యమంత్రి గారు కూడా నీతి అయోగ్ సభ్యులతో మాట్లాడి, ఎక్కువ నిధులు కేటాయించమని కోరినా, వారు స్పందించలేదు. ఆ విధంగా పుష్కరాలలో గౌరవ సభ్యులు అడిగినట్లుగా, స్నానాలు చేసే చోట, బట్టలు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు మొదలైనవన్నీ క్రొత్త పద్ధతులలో ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడకి వచ్చిన ప్రజలందరూ ఏర్పాట్లు చాలా బాగున్నాయని చెప్పడం జరిగింది. అదే పద్ధతిలో ఇప్పుడు క్రొత్తగా ఏర్పాటు చేసే కృష్ణా పుష్కరాలలోను, సమ్మక్క, సారక్క మరియు మేడారం జాతరలోను అదేవిధంగా నిర్వహిస్తాము. ఎటువంటి

ఇబ్బందులు జరగకుండా కార్యక్రమాలన్నీ సజావుగా సాగేలా చూస్తాము.

గోదావరి పుష్కరాలకు సంబంధించి ముఖ్యమంత్రిగారు చొరవ తీసుకోవడం వలన పుష్కరాలన్నీ విజయవంతమైనట్లుగా అందరూ చెపుతున్నారు. ముఖ్యమంత్రిగారి గౌరవ ప్రతిష్టలు పెరిగే విధంగా సభ తరఫున ఈ కార్యక్రమాలను బాగా నిర్వహించినందుకు మా తరఫున కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. అదేవిధంగా గోదావరి పుష్కరాలతోపాటు మన రాష్ట్రానికి కృష్ణా పుష్కరాలు కూడా తొలి పుష్కరాలే. 2016వ సంవత్సరంలో కృష్ణా పుష్కరాలు మొదలవుతాయి. కృష్ణానది మహారాష్ట్రలోని మహాబలేశ్వరంలో పుట్టి, తంగడిక గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించింది. కృష్ణమ్మ మహబూబ్‌నగర్ మరియు నల్గొండ జిల్లాల నుంచి ప్రవహిస్తుంది. మహబూబ్ నగర్ జిల్లాలో 164 కిలోమీటర్లు, సుమారు 32 గ్రామాలను తాకుతూ వెళుతుంది. నల్గొండ జిల్లాలో 117 కిలోమీటర్లు 11 గ్రామాల ద్వారా ప్రవహిస్తుంది. కృష్ణా పుష్కరాలు 2016, శ్రీ దుర్ముఖి నామ సంవత్సరం, ఆగస్టు నెలలో నిర్వహించుటకు దైవజ్ఞులు నిర్ణయించారు. కృష్ణా పుష్కరాలు తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా అత్యంత వైభవంగా జరుపుటకు ప్రభుత్వం కృషి చేస్తోంది. మన ముఖ్యమంత్రిగారు కూడా మొన్ననే కృష్ణా పుష్కరాల గురించి జిల్లా కలెక్టర్లు, మంత్రులు, సంబంధిత ఎం.ఎల్.ఎ.లతో కూర్చుని గతంలో ఎన్ని ఘాట్లు ఉన్నాయి, ఇప్పుడు క్రొత్తగా ఎన్ని కావాలి, మొదలైన విషయాల గురించి ఆయన మాట్లాడడం జరిగింది. గోదావరి పుష్కరాలు జరిగిన తరువాత అక్కడ కూడా భక్తులు స్నానం చేయడానికి ఎక్కువగా వస్తారు కాబట్టి, దానికి అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టాలని మొన్ననే ఆయన మాకు చెప్పడం జరిగింది. ఇందుకు సంబంధించి త్వరలోనే ఒక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నాము. ప్రస్తుతం మహబూబ్ నగర్‌లో 15 స్నాన ఘట్టాలు మాత్రమే ఉన్నాయి. అలాగే, నల్గొండలో కూడా ప్రస్తుతానికి 19 స్నాన ఘట్టాలు ఉన్నాయి. క్రొత్త ప్రతిపాదనలతో మనం ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గౌరవ సభ్యులు అడిగినట్లుగా చందం పేట బ్యాక్‌వాటర్ నుంచి నాగార్జున సాగర్ వద్ద నుంచి అడగడం జరిగింది. ఇందుకు సంబంధించి ముందుగానే ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రతిపాదనలను పంపించినట్లయితే, వారి ద్వారా మనకు ఈ ప్రతిపాదనలు వస్తాయి. నల్గొండ జిల్లాలో అదనపు స్నానఘట్టాలు, మొదలైన వాటికి సంబంధించి జిల్లా కలెక్టర్లకు ప్రతిపాదనలు పంపించినట్లయితే, రాబోయే సమావేశంలో తాము పై అంశాలనన్నింటిని చర్చించడం జరుగుతుంది. 2016, ఆగస్టులో ప్రారంభమయ్యే కృష్ణా పుష్కరాలకు సంబంధించి అన్ని రకాలుగా ఏర్పాట్లు చేయడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం కూడా జరుగుతుంది.

2016వ సంవత్సరంలోనే సమ్మక్క, సారలమ్మ మరియు మేడారం జాతరలకు సంబంధించి ఫిబ్రవరి 17వ తేదీ 2016 నుంచి, 21-02-2016 వరకు జరుగుతాయి. సమ్మక్క, సారలమ్మ మేడారం జాతరలు సాంప్రదాయక గిరిజనులకు సంబంధించిన జాతరలు. ఈ జాతరలకు సుమారు కోటి నుంచి కోటిన్నర మంది భక్తులు వస్తారని అంచనా. కేవలం మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా ఎక్కువ మంది ప్రజలు రావడం జరుగుతుంది. గత జాతరలో దేవాదాయ శాఖ 12 రకాలైన పనులను చేపట్టింది. 6-09-2015న మొన్ననే గౌరవ గిరిజన శాఖా మంత్రివర్యులు, పార్లమెంటు సభ్యులు, ముఖ్యకార్యదర్శి, ఎండోమెంట్ కార్యదర్శి అందరితో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఈ విధమైన ప్రతిపాదనలను తయారు చేయమని చెప్పడం జరిగింది. అక్టోబరు 1వ తేదీ నాడు చీఫ్ సెక్రటరీ గారితో మరొక సమావేశం జరిగింది. అందుకు కలెక్టరు ద్వారా వరంగల్ జిల్లా జాతరకు సంబంధించి రూ.107కోట్ల, 29 లక్షల ప్రపోజల్సు రావడం జరిగింది. ఈ సమ్మక్క, సారలమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించుటకు దాదాపుగా 15 శాఖల వారి వంతు అవసరాలను గుర్తించడం జరిగింది. ఈ జాతరను దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ఈ పనులన్నింటిని చేయుటకు తగిన చర్యలు చేపడుతున్నాము. ప్రస్తుతం జాతర పనులన్నింటిని 15 రోజుల ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు చెప్పడం జరిగింది. స్నాన ఘట్టాలు, దుస్తులు మార్చుకునే గదులు, ఎటువంటి ఆటంకాలు జరగకుండా చెక్ డ్యాములు ఏర్పాటు చేయడం, విద్యుద్దీపాలు, రహదారులు వెడల్పు చేయడం మొదలైనవన్నీ ముందుగానే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాము. అలాగే, చిన్న జాతరలైన నల్గొండ, కరీంనగర్ ప్రాంతాలలో కూడా 25,000 నుంచి 30,000 మంది వరకూ భక్తులు రావడానికి అవకాశం ఉంది. వాటన్నింటిని మనం పరిగణనలోకి తీసుకుని కనీసం ఆర్.ఓ. ప్లాంట్సు, విద్యుద్దీపాలు, రహదారుల విస్తరణ మరియు వైద్య సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని మొన్నటి సమావేశంలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగింది. అదేవిధంగా గోదావరి పుష్కరాలలో ఏ విధమైన సదుపాయాలను ఏర్పాటు చేశామో, అన్ని సౌకర్యాలను కృష్ణా పుష్కరాలలో, మేడారం జాతరలో కూడా అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ

ప్రశ్న నెం. 910(35) సర్వశ్రీ సయ్యద్ అల్తాఫ్ హైదర్ రజ్వీ, సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ, ఎం.ఎల్.సి.లు., గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని నిర్ణయించడమయిందా :

(ఆ) అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను ప్రభుత్వ సర్వీసులలోకి లీనం చేయాలని ఉద్దేశిస్తున్న విషయం వాస్తవమేనా :

(ఇ) కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడానికి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను లీనం చేయడానికి అనుసరించాల్సిన విధానం ఏమిటి :

(ఈ) కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడానికి, లీనం చేయడం కోసం ఎస్.సి.లు, ఎస్.టి.లు, బి.సి.లకు రిజర్వేషన్లు, రోస్టర్ విధానాన్ని అనుసరించడమువుతుందా?

గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, చిన్న మొత్తాల పొదుపులు, రాష్ట్ర లాటరీలు, వినియోగదారు వ్యవహారాలు, లీగల్ మెట్రాలజీ, పౌరసరఫరాల శాఖ మంత్రి (శ్రీ ఈటెల రాజేందర్)ః

(అ) కాంట్రాక్టు సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణ అంశంపై 1994, 2వ ఎ.పి. చట్టంలోని నిబంధనలు రాష్ట్రసబార్డినేటు సర్వీసు నియమావళి, ప్రత్యేక నియమావళి, న్యాయస్థాన తీర్పులను పురస్కరించుకొని ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణ అంశాన్ని పరిశీలించడానికి ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన అధికారుల కమిటీని నియమించడమయింది.

(ఆ) ఇందుకు సంబంధించి న్యాయస్థాన తీర్పులను దృష్టిలో ఉంచుకొని అనుసరించాల్సిన మార్గదర్శకాలపై కమిటీ కొన్ని సిఫార్సులను చేసింది.

(ఇ) ఇందుకు సంబంధించి న్యాయస్థాన తీర్పులను దృష్టిలో ఉంచుకొని అనుసరించాల్సిన మార్గదర్శకాలపై కమిటీ కొన్ని సిఫార్సులను చేసింది.

(ఈ) పథకాన్ని అమలుచేసేటప్పుడు రిజర్వేషను అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడమువుతుంది.

SRI SYED ALTAF HYDER RAZVI(Assembly Constituency): Sir, the Issue of contract employees and the outsourcing employees is very important one as thousands and thousands of employees are waiting for their services to be regularized for the past several years. In this regard, the question which we have posed is that the Government needs to clarify in regard to question (a) as to whether the decision has been taken to regularize their services; the answer is that it does not say either "Yes" or "No". It said that the Committee of Officers is constituted to examine the issue. Now the question is that if the Government is already decided to regularized their services, I am sure, the Hon'ble Minister would have come before the House with a suitable reply. In respect of the question (b) the Government has replied that the recommendations and the guidelines of the Committee would be followed. Therefore, I request the Government to let us know those guidelines and recommendations. When it comes to regularization of the services of these employees working on contract basis, what steps are being taken up by the Government in regard to rule of reservation to make sure the percentage of reservations in respect of SCs, STs, BCs and Minorities to be followed. Further, as to whether any time frame is set for this Committee to submit its report so that the Government could take a decision in this regard. Further, I would like to know from the Hon'ble Minister the total number of employees (including doctors, teachers and in various other professions) working on contract as well as on out-sourcing bases in each and every department whose services are to be regularized. Now, it is high time for the Government to expedite the process of regularization of their services. I specifically request the Hon'ble Minister to give a suitable reply to my question.

శ్రీ పూల రవీందర్ః అధ్యక్షా, ఇది కాంట్రాక్టు ఉద్యోగులు, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ కాలేజి లెక్చరర్లు, గురుకులాలలో పనిచేస్తున్న సి.ఆర్.టి.లు, కాంట్రాక్టు టీచర్లు మొదలైన వారు రకరకాలుగా ఉన్నారు. దీనిమీద మన గౌరవ ముఖ్యమంత్రి గారు కృతనిశ్చయంతో వారికి న్యాయం చేయడానికి ఒక మంచి ఆలోచనతో ఉన్నారు కాబట్టి,

సాధ్యమైనంత తొందరలో చేయాలని కోరుతున్నాను. వాస్తవంగా కొన్ని జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లతోనే ఆ కళాశాలలు నడుస్తున్నాయి. గతంలో ఎలాంటి సెలెక్షన్లు లేకుండా ఆగిపోయాయి. దయచేసి వీటిని సాధ్యమైనంత త్వరగా కాంట్రాక్టు ఉద్యోగులను, లెక్చరర్లను, ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, మన ప్రభుత్వం వచ్చిందే నిధులు, నియామకాల విషయంలోనే. వీటికిసంబంధించి మన ఎన్నికల ప్రణాళికలలో పొందుపరచినట్లుగా కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామనే మాట మాట్లాడాము. అయితే, ఇంతవరకూ కూడా కాంట్రాక్ట్ ఉద్యోగులు, లెక్చరర్లు గానీ, వారు అన్నట్లుగానే రోస్టర్ పాయింట్ల వారీగా నియామకాలు చేయడం జరిగింది. ఇంతవరకూ వారికి రోస్టర్ లేకుండా నియామకం జరగలేదు. ఆ రోస్టర్ ప్రాతిపదికమీద నియామకమైన వారందరూ 1994వ సంవత్సరం నుంచి విధులలో పనిచేస్తున్నారు. వారికి దాదాపు 20 సంవత్సరములుగా విధులలో పనిచేస్తూ, వయసంతా అయిపోయి ఉన్నారు. ఇక వారికి ఎప్పుడు రెగ్యులరైజ్ అవుతుంది అధ్యక్షా? కాబట్టి, ఒక నిర్దిష్టమైన కాలంలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేస్తామని ఒక తేదీని ఏమైనా స్పష్టంగా చెప్పగలుగుతారా? మరొక అంశం ఏమిటంటే, అసలు ఈ ఔట్‌సోర్సింగ్ అనే పదమే మాకు అర్థం కావడం లేదు. అసలు ఎవరికో డబ్బులు ఇస్తే, ఎవరో అపాయింట్ చేస్తారు. ఇది ఇంకా ఇంకా తెలంగాణ రాష్ట్రంలో ఉంటుందా? ఈ ఔట్‌సోర్సింగ్‌ను తెలంగాణ రాష్ట్రంలో మాత్రం మన ప్రభుత్వంలో కొనసాగడానికి వీలులేదు. ఇప్పుడు నిర్దిష్టంగా నోటిఫికేషన్లు విడుదలవుతాయి కాబట్టి, వాటి ప్రకారం నియామకాలు చేయాలి. ఈ ఔట్‌సోర్సింగ్ అనే పదం మా ప్రభుత్వంలో ఉండదనే మాటను మా మంత్రిగారు స్పష్టంగా చెప్పవలసిందిగా కోరుతున్నాను.

డా.వల్లా రాజేశ్వర్ రెడ్డి : అధ్యక్షా, మన రాష్ట్రంలో కాంట్రాక్టు లెక్చరర్లు, ఉద్యోగస్తులు అనేకమంది ఉన్నారు. జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, ఇతర విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలలో కూడా అనేక చోట్ల ఈ కాంట్రాక్టు వ్యవస్థలో అనేకమంది పనిచేస్తున్నారు. ప్రతిరోజు అనేకమంది మంత్రుల దగ్గర, ముఖ్యమంత్రిగారి దగ్గర, ఇతర ఎం.ఎల్.ఎ.లు, ఎం.ఎల్.సి.ల దగ్గర కూడా ప్రతిరోజూ ఏదో ఒక కాంట్రాక్టు అసోసియేషన్ వారు వచ్చి మాట్లాడుతున్నారు. మనం ఖచ్చితంగా ఈ కాంట్రాక్టు వ్యవస్థ గురించి ఎన్నికల సమయంలో చెప్పాము. దానికోసం వేసిన ఒక కమిటీలో కూడా క్లారిటీ త్వరగా ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇతరత్రా కార్యాలయాలలో కూడా ఖచ్చితంగా వారు నోటిఫికేషన్ ఇచ్చి, రోస్టర్‌ను అనుసరించి కాంట్రాక్టు బేసిస్‌లో ఉన్నట్లయితే, ఆయా విశ్వవిద్యాలయాలలో ఉన్న ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేస్తారా, చేయరా? ఇతర సంస్థలలో ఉన్న ఉద్యోగులకు సంబంధించి పై అంశాలన్నీ అనుసరించిన వారిని కూడా చేస్తారా? లేదా అనుసరించకపోతే, వారికి ఏమైనా వెయిటేజ్ ఇస్తారా? ఎందుకంటే, అనేకమంది నిరుద్యోగులు ఈరోజున పై అంశాలకు సంబంధించి ఎదురు చూస్తున్నారు. అతి తొందరగా దీని మీద నిర్ణయం తీసుకోవలసిందిగా మీ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి : అధ్యక్షా, కాంట్రాక్టు లెక్చరర్లను నియామకం చేసి, రెగ్యులరైజ్ చేసే విషయంలో మనం ఒక నిబంధన ప్రకారం వీరిని నియమించడం జరుగుతోంది. అలాగే, పబ్లిక్ సర్వీసు కమీషన్ ద్వారా లెక్చరర్లను నియమించడం జరుగుతుంది. అయితే, కాంట్రాక్టు లెక్చరర్ల విషయంలో రెగ్యులర్ సర్వీసు కమీషన్ ద్వారా నియామకం జరగలేదు కనుక, వీరిని రెగ్యులరైజ్ చేయడానికి ఏమైనా అడ్డంకి అవుతుందా అని మీ ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను. అంతేగాకుండా, ఈ ఉద్యోగస్తులకు కూడా చాలీ, చాలని వేతనాలతో నియామకాలు చేస్తున్నాము. కానీ, వీరిని కూడా ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు అనే కారణంతో తొలగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. వారికి ఫైనాన్స్ నుంచి క్లియరెన్సు అయినా ఇంకా వారికి విద్యాశాఖలో క్లియరెన్సు రాకుండా వారిని అదేవిధంగా కొనసాగించకుండా తొలగించిన సందర్భాలు కూడా ఉన్నాయి కాబట్టి, అటువంటి వారికి సంబంధించి ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా అని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

ముఖ్యంగా ఈ ఔట్‌సోర్సింగ్ అనేది చాలా దురదృష్ట కరమైనటువంటిది. ఎందుకంటే, ఒక ఏజన్సీలకు అప్పచెప్పి, వాటి ద్వారా ఇష్టం వచ్చినట్లు నియామకాలు చేసే పద్ధతిని మానుకునే విధంగా వాటిని తొలగించాలని మీ ద్వారా గౌరవ మంత్రిగారికి తెలుపుతున్నాను. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్లు, పి.టి.ఎఫ్.లు., దాదాపు 20, 30 సంవత్సరముల నుంచి వారు ఆయా పాఠశాలలో సుమారు రూ.1623ల వేతనం ఇవ్వడం జరుగుతోంది. వారు పూర్తికాలం పాఠశాలల్లో పనిచేస్తున్నారు కనుక, వారిని రెగ్యులరైజ్ చేసే అవకాశం ఏమైనా ఉందా? లేకపోతే వారి వేతనాలు పెంచేందుకు ఏమైనా అవకాశం ఉంటే, అటువంటి చర్యలు తీసుకోవాలని మీ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఈటెల రాజేందర్ : అధ్యక్షా, ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం వీరందరినీ పర్మనెంటు చేయాలనే గొప్ప సంకల్పంతో మ్యానిఫెస్టోలో పెట్టడమే కాకుండా, ప్రభుత్వం అధికారంలోకి

వచ్చీరాగానే ఒక కమిటీని కూడా వేయడం జరిగింది. కమిటీ దాదాపుగా రికమెండేషన్లు అన్నీ ఇవ్వడం జరిగింది. కానీ, మనకు మళ్ళీ ఈ కార్యక్రమం పూర్తి అయిన తరువాత న్యాయపరమైన సమస్యలు రాకుండా ఉండాలనే సంకల్పంతో గతంలో ఇచ్చిన అనేక జడ్జిమెంట్లు, అనేక పద్ధతులను బాగా లోతుగా అధ్యయనం చేస్తున్నాము. తమకు ఈ విషయంలో ఎక్కువ అవగాహన ఉంది. 2006వ సంవత్సరంలో కర్ణాటక గవర్నమెంట్ ఉమాదేవి ఆ కేసులో ఆనాటి సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా కొన్ని సూచనలను చేయడం జరిగింది. వాటన్నింటిని పరిశీలిస్తున్నాము. ఏది ఏమైనప్పటికీ కూడా 1993 నుంచి ఈనాటి వరకూ ఏ ఏ రంగాలలోనైతే రోస్టర్ పాయింట్లు లేక రూల్ ఆఫ్ రిజర్వేషన్ల ద్వారా మెరిట్, నియామక పద్ధతుల ద్వారా ఎవరినైతే తీసుకున్నామో వారందరినీ కూడా మేము ఐడెంటిఫై చేయడం జరిగింది. దాదాపుగా ఈ రాష్ట్రంలో వివిధ శాఖలలో పనిచేసేటటువంటి కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య దాదాపు 25,589 పై చిలుకు మంది ఉన్నారు. వారందరినీ కూడా తప్పకుండా రెగ్యులరైజ్ చేయాలనే సంకల్పంతో ఉన్నాము. గతంలో ఇలాంటి సందర్భం ఉత్పన్నమైనప్పుడు ప్రభుత్వం వేరే పద్ధతులను కూడా అవలంభించడం జరిగింది. ఈ రాష్ట్రంలో గత ప్రభుత్వాలు అవలంబించి, రిక్రూట్ చేసిన పద్ధతులను కూడా లోతుగా అధ్యయనం చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ కాలయాపన అనే మాటకన్నా కూడా చేసిన పని క్రొత్తగా ఉండాలని, దానికి ఫలితం రాబట్టాలనే సంకల్పం తప్ప, మరేమి లేదని నేను తమరి ద్వారా విన్నవిస్తున్నాను.

**11.00 ఉ.** అధ్యక్షా, ఔట్‌సోర్సింగ్‌లో రెండు పద్ధతులు ఉన్నాయి. ఒకటి మనకు అవసరమైన అభ్యర్థులను ఎంపికచేసే పనిని పూర్తిగా ఏజెన్సీకి అప్పగించి, మనకు అవసరమైన సేవలను అందించినందుకు గాను వారికి డబ్బు చెల్లించడం. మనకు సిబ్బంది తక్కువగా ఉన్నప్పుడు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ద్వారా పనులు ఆటంకం లేకుండా జరిపించడం ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. జిహెచ్ఎంసిలో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఒక పద్ధతి అయితే, ప్రభుత్వ కార్యాలయాలల్లో ఉద్యోగులు తక్కువగా ఉన్నప్పుడు ఔట్‌సోర్సింగ్ వారిని నియమించుకునే పద్ధతి మరొకటి ఉంది. ఈ రెండు విధానాల్లోను ఆయా ఉద్యోగులకు, ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదు. ఏజెన్సీ ద్వారానే వారికి జీతభత్యాలు అందుతాయి. Contractor Vs. Government విధానమే తప్ప, Employee Vs. Government అనే పద్ధతి లేదు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల విషయానికి వస్తే, సంవత్సరానికి ఒకసారి వారిని తొలగిస్తూ, సర్వీస్ బ్రేక్ చేసి, తిరిగి నియమించే పద్ధతి ఉన్నది. జూనియర్ కాలేజీలలో లెక్చరర్లను విద్యాసంవత్సరం ముగిసిన పిదప, వారిని తొలగించి, మరల కాలేజీలు ప్రారంభమైనప్పుడు వారిని తీసుకోవడం జరుగుతుంది. ఎక్కడైతే నిబంధనలకు లోబడి, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలు జరిగి ఉన్నాయో, వారందర్నీ తప్పకుండా, త్వరలోనే రెగ్యులరైజ్ చేయడం జరుగుతుందని తమరి ద్వారా విన్నవిస్తున్నాను అధ్యక్షా.

## కంతనపల్లి బ్యారేజి నిర్మాణం

ప్రశ్న నెం.936(36) శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎం.ఎల్.సి. గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా:

అ) కంతనపల్లి బ్యారేజిని నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్న విషయం వాస్తవమేనా; అయితే, ఆ వివరాలేమిటి :

ఆ) బ్యారేజి ఎత్తును తగ్గించే ప్రతిపాదన కూడా ఏదైనా ఉన్నదా :

ఇ) అయితే, అందుకు గల వివరాలేమిటి :

ఈ) సదరు ప్రాజెక్టు పనులను ఎప్పటిలోగా చేపట్టడమవుతుంది?

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి( శ్రీ టి. హరీష్ రావు) : అ) పవర్ బ్లాకులు, ఫోర్‌బే పవర్‌హౌస్‌తో పాటు గోదావరి నదిపై కంతనపల్లి బ్యారేజిని నిర్మించేందుకు గాను రూ.2345.00కోట్లకు ప్రభుత్వం24-04-2013 తేదీగల సాగునీరు మరియు ఆయకట్టు ప్రాంతాభివృద్ధి (ఎం&ఎంఐటి V ) శాఖ జి.ఓ. ఎం.ఎస్. నెం.38 ద్వారా పరిపాలక ఆమోదాన్నిచ్చింది.

ఆ) కంతనపల్లి బ్యారేజి ఎత్తును మార్చే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

ఇ) నాలుగు గ్రామాలు పూర్తిగా, పదమూడు గ్రామాలు పాక్షికంగా ప్రభావితమవుతున్నందున ముంపు ప్రాంతాన్ని తగ్గించడం కోసం ఆలోచన చేయడమయినది.

ఈ) ప్రాజెక్టు పనులను ఇప్పటికే చేపట్టడమయింది.

శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు : అధ్యక్షా, తమరి ద్వారా మంత్రిగారిని అడిగేది ఏమిటంటే ఈ ప్రాజెక్టును ఎంత ఎత్తులో కడతారు? దినపత్రికల్లో ఈ విషయమై వివిధ కథనాలు వచ్చాయి. ఎనభై ఐదు మీటర్ల ఎత్తులో కడితే మునిగే ప్రాంతాలు, ఎనభై మూడు అయితే ఎంత, అలాగే ఎనభై మీటర్ల ఎత్తులో కడితే ఎన్ని ప్రాంతాలు, ఎన్ని గిరిజన తండాలు మునుగుతాయి అనే వివరాలు తెలియచేయాలి. ఎంత ఎత్తులో ఎంత నీటిపరిమాణం నిలుపచేయడానికి అవకాశముంటుంది తెలియచేయమని కోరుతూ,

అదే విధంగా ఎన్ని ఎకరాలకు నీరు అందించడానికి వీలుంటుందో కూడా తెలుపవలసిందిగా కోరుతున్నాము. అలాగే విద్యుదుత్పత్తికి గల అవకాశం కూడా తెలియచేయవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ పల్లా రాజేశ్వర రెడ్డి: అధ్యక్షా, ప్రస్తుతం కంతనపల్లి బ్యారేజి నిర్మించే చోటు నుండి దేవాదుల పంప్‌హౌస్ కట్టే దగ్గరకు దానిని మారుస్తారని పత్రికల్లో వార్తలు వచ్చాయి. అది నిజమేనా? ఒకవేళ వాస్తవమే అయితే, అందువల్ల ఉపయోగాలేమిటి?

శ్రీ టి.హరీష్ రావు : అధ్యక్షా, గౌరవ సభ్యులు వెంకటేశ్వర్లుగారు చాలా వివరాలు అడిగినారు. వాస్తవం ఏమిటంటే కంతనపల్లి ప్రాజెక్టు ద్వారా దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు కూడా బాగా నడవడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్పట్లో దేవాదుల ప్రాజెక్టు నిర్మించేటప్పుడు నీటిని 170 రోజులు పంప్ చేయడానికి నిర్ణయించాము. కాని అక్కడ నీటి లభ్యత తక్కువగా ఉండడం వల్ల, ఇప్పటివరకూ ఏ సంవత్సరం కూడా వందరోజులకు మించి నీటిని మనం తీసుకోలేక పోయాము. ఇప్పుడు కంతనపల్లి ప్రాజెక్టును కట్టడం వల్ల దాని బ్యాక్‌వాటర్‌ను దేవాదులలో ఎక్కువ రోజులు నీటిని నిలువచేసుకునే అవకాశం ఏర్పడింది. అయితే ఈ దేవాదులకాని, అటు కంతనపల్లి ప్రాజెక్టుగాని, తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో, ఆ నాటి ముఖ్యమంత్రులు పూర్తిస్థాయి అవగాహన లేకుండా, ఆగమేఘాల మీద శంకుస్థాపనలు చేయడం జరిగింది. 2001లో మన కేసిఆర్‌గారు ఉద్యమాన్ని ప్రారంభించే క్రమంలో, అప్పటి ముఖ్యమంత్రిగారు సరైన దారి కూడా లేకపోవడం వల్ల, తాపీమేస్త్రీలను కూడా హెలీకాప్టర్‌లో తీసుకువెళ్లి, హడావిడిగా శంకుస్థాపన చేయడం జరిగింది.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డిగారు తిరిగి అక్కడే శంకుస్థాపన చేసారు. ఇవన్నీ కూడా తెలంగాణ ప్రజలను మభ్యపెట్టడానికి చేసిన ప్రయత్నాలే. దాని ఫలితమే దేవాదులో 170రోజులకు నీటిని పంప్‌చేసుకోవలసి ఉండగా, 90 రోజులకు కూడా నీరు లభించని పరిస్థితి. ఆయకట్టు చివరి ప్రాంతానికి నీరు అందడం లేదు. ఈ లోపాలు అన్నిటిని సరిచేయడానికి మేము re-engineering కార్యక్రమం చేపట్టాము. ఈ కంతనపల్లి ప్రాజెక్టును గౌరవ ముఖ్యమంత్రిగారు 29-03-2015న విజిట్‌చేస్తూ, అదే రోజున దేవాదుల ప్రాజెక్టును కూడా వారు చూడటం జరిగింది. ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని, ఆయకట్టుకు వీలైనంత త్వరలో నీరు అందివ్వాలని ముఖ్యమంత్రిగారు ఆదేశించడం జరిగింది. ప్రస్తుతం చురుకైన పరిశీలన జరుగుతున్నది.

గౌరవ సభ్యులు శ్రీ వెంకటేశ్వర్లు గారు ఈ ప్రాజెక్టును ఎంత ఎత్తులో కడతారని అడిగారు. మొదటగా దీనిని 85 మీటర్ల ఎత్తులో నిర్మించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. అయితే మరో రెండు ప్రత్యామ్నాయాలు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. 83 మరియు 80మీటర్ల ఎత్తులో కడితే ఎట్లా ఉంటుంది అనే విషయాలను కూడా అధ్యయనం చేస్తున్నాము. అలాగే గౌరవ సభ్యులు నీటి నిలువ గురించి సమాచారం అడిగారు. 85 మీటర్ల ఎత్తులో కడితే 22టిఎంసీల నీటిని నిలువ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అందువల్ల 19,650 ఎకరాల భూమి ముంపుకి గురయ్యే అవకాశం ఉంది. వరంగల్ జిల్లాలో నాలుగు గ్రామాలు పూర్తిగాను, ఎనిమిది గ్రామాలు పాక్షికంగాను మునిగిపోతాయి. ఖమ్మం జిల్లాలో ఐదు గ్రామాలు పాక్షికంగా మునిగిపోతాయి. వరంగల్ మరియు ఖమ్మం జిల్లాలో దాదాపు 17 గ్రామాలు, ముఖ్యంగా గిరిజన తండాలు, ఈ 85 మీటర్ల ఎత్తు వల్ల ముంపుకి గురయ్యే అవకాశం ఉంది. దాని గురించి కొన్ని గిరిజన సంఘాలు ఆందోళన కూడా చేపట్టడం జరిగింది. కంతానపల్లిలో దాదాపు 220 ఇళ్లు, చింతగూడెంలో 150, కొత్తూరులో 100 గ్రామాలు, సర్వేలో 80 ఇళ్లు, FRLలో ఎనిమిది గ్రామాలలో 550 ఇళ్లు, ఖమ్మం జిల్లాలో FRLలో 116 ఇళ్లు, ఈ రకంగా ముంపుకి గురవుతున్నటువంటి పరిస్థితి ఉంది. కాబట్టి, గ్రామాల సంఖ్యను, అలాగే ముంపుకు గురవుతున్న తండాలను, ఇళ్లను కొంత తగ్గించడం కొరకు ప్రత్యామ్నాయ మార్గాలను చూడడం జరిగింది. 83 మీటర్ల ఎత్తులో అయితే, 16టిఎంసిల నీటి లభ్యత ఉంటుంది. ముంపుకి గురయ్యే భూములు 19,650 ఎకరాల నుండి 16,110 ఎకరాలకు తగ్గే అవకాశముంటుంది. ఒక్క కంతనపల్లి తప్ప, మిగిలిన గ్రామాలు ముంపుకి గురయ్యే అవకాశం కూడా ఉండదు. కేవలం 220 ఇళ్లు మాత్రమే అక్కడ ముంపుకి గురవుతాయి.

అదే విధంగా 80 మీటర్ల ఎత్తులో చూసినట్లైతే, 14,110 ఎకరాలు ముంపుకి గురయ్యే అవకాశం ఉంది. కంతనపల్లి గ్రామం ఒక్కటే మునిగిపోతుంది. విద్యుదుత్పాదన గురించి చెప్పుకోవాలంటే 85 మీటర్ల ఎత్తులో 280 MW, 83 ఎత్తులో 223 MW, 80 మీటర్ల ఎత్తులో 151మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి జరుగుతుంది. అదే విధంగా నీటి లభ్యత చూసుకున్నప్పుడు, 85 మీటర్ల ఎత్తులో 22.5టిఎంసిలు, 83మీటర్లకు 16.40టిఎంసిలు మరియు 80మీటర్ల ఎత్తుకి 10.10టిఎంసిల నీటి లభ్యత ఉంటుంది. ఈ అంశాలన్నిటినీ పరిశీలించి, ప్రభుత్వం ముందుకు పోతున్నది అధ్యక్షా. పనులు ఎక్కడా ఆగినటువంటి పరిస్థితి లేదు. అయితే ఇది ఏ

లెవెల్‌లో ఉంటే మంచిది అనే అంశాన్ని జిల్లా కలెక్టర్‌గారు స్థానిక ప్రజలతో చర్చిస్తున్నారు. త్వరలోనే ఒక తుది నిర్ణయానికి రావడానికి అవకాశముందని తెలియచేస్తున్నాను.

గౌరవ సభ్యులు శ్రీ రాజేశ్వర రెడ్డిగారు అడిగిన అంశం కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది అధ్యక్షా. మనకు దేవాదుల ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నడువవలసిన అవసరం ఉంది. రెండవది కంతనపలి ప్రాజెక్టు SRSP Stage-II stabilisation కొరకు ఉద్దేశించబడినటువంటిది. దానిని రీఇంజనీరింగ్‌లో భాగంగా, ఏ విధంగా నైతే కాళేశ్వరం నుండి నీళ్లు తెచ్చుకుంటున్నామో, అదే విధంగా stabilisation కొరకు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ, ఆ ప్రాంత గిరిజనులు నిరాశ్రయులు కాకుండా, వీలైనంత మేరకు ముంపును తగ్గిస్తూ, వరంగల్ జిల్లా అవసరాలను తీర్చే విధంగా రెండింటిని కలుపుకొని, ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోవడం జరుగుతుంది.

## ఆహార భద్రతా పథకం

ప్రశ్న నెం.899(37) శ్రీ సభావత్ రాములు నాయక్, ఎం.ఎల్.సి. గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, పౌర సరఫరాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలోని ఆహార భద్రత పథకం క్రింద లబ్ధిదారులు, ఇప్పటివరకు వారికి సరఫరా చేసిన బియ్యం పరిమాణం వివరాలు ఏమిటి:

ఆ) ఈ పథకం క్రింద కేటాయించిన బియ్యాన్ని అక్రమంగా మళ్లిస్తున్న విషయం వాస్తవమేనా:

ఇ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య లేమిటి?

గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, పౌర సరఫరాల శాఖ మంత్రి(శ్రీ ఈటల రాజేందర్): అ) ఎన్.ఎఫ్.ఎస్.ఎ., క్రింద వర్తింపు అయిన లబ్ధిదారులు, రాష్ట్రానికి సరఫరా చేయబోయే బియ్యం పరిమాణం వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

ఎన్.ఎఫ్.ఎస్.ఎ. క్రింద గుర్తించిన లబ్ధిదారులు:

| | ఎ.ఎ.వై. | ప్రాధాన్యత | మొత్తం |
|---|---|---|---|
| కుటుంబాలు/ రేషన్ కార్డుల సంఖ్య | 566878 | 4311295 | 4878173 |
| వ్యక్తుల సంఖ్య | 1527985 | 17641615 | 19169600 |

రాష్ట్ర ఆహార భద్రతా కార్డుల ద్వారా వర్తింపు అయిన కుటుంబాలు

| | ఎ.ఎఫ్.ఎస్.సి | ఎఫ్.ఎస్.సి | అన్నపూర్ణ | మొత్తం |
|---|---|---|---|---|
| కుటుంబాలు/ రేషన్ కార్డుల సంఖ్య | 3442 | 4109128 | 3923 | 4116493 |
| వ్యక్తుల సంఖ్య | 7305 | 9078901 | 4144 | 9090350 |

ఎన్.ఎఫ్.ఎస్.ఎ క్రింద అవసరమైన/అర్హమైన బియ్యం

| | సంవత్సరానికి (ఎంటిలు) | నెల ఒక్కింటికి (ఎంటిలు) |
|---|---|---|
| ఎన్.ఎఫ్.ఎస్.ఎ సాధారణం | 12,26,325 (12.26 లక్షల మె.ట.లు) | 1,02,194 |
| టైడ్ ఓవర్ | 1,09,518 (1.10 లక్ష మె.ట.లు) | 9,127 |
| మొత్తం | 13,35,843 (13.36 లక్షల మె.ట.లు) | 1,11,321 |

ప్రస్తుతం ఆహార భద్రత కార్డులకు యూనిట్ ఒక్కింటికి ఆరు కేజీల చొప్పున, ఎ.ఎ.వై కార్డులకు కుటుంబానికి 35 కేజీల చొప్పున 281.93 లక్షల లబ్ధిదారులకు నెలకు 1.79 లక్షల మెట్రిక్ టన్నుల పరిమాణం బియ్యాన్ని సరఫరా చేయడమువుతున్నది.

ఆ&ఇ)

బియ్యం మళ్లింపులు జరగకుండా కట్టుదిట్టం చేసేందుకు క్రమం తప్పకుండా తనిఖీలను నిర్వహించడమువుతున్నది. అటువంటి వ్యకులు, డీలర్లు మొదలైన వారిపై ఇ.సి. చట్టంలోని నిబంధనల క్రింద, క్రిమినల్ చట్టం క్రింద కేసులను నమోదు చేయడమువుతున్నది.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, మౌలికంగా ఏ ప్రాతిపదికన రేషన్ కార్డులను గుర్తించారు? ఎంతమంది లబ్ధిదారులను గుర్తించారు? రాష్ట్రప్రభుత్వం చెబుతున్నటువంటి లెక్కలు ఏ ప్రాతిపదికన నిర్ణయించారో చెప్పవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ రాములు నాయక్‌గారు రేషన్ బియ్యం అక్రమంగా తరలింపు గురించి ప్రశ్న వేసారు, నేను అడిగింది రేషన్ కార్డుల గురించి. కాబట్టి రెండు ప్రశ్నలు భిన్నమైనవి.

శ్రీ ఈటెల రాజేందర్: అధ్యక్షా, ఈ పథకం క్రింద దాదాపుగా 89లక్షల కుటుంబాలకు బియ్యం సరఫరా చేయడమువుతున్నది. దాదాపు 2.82 కోట్ల మంది లబ్ధిదారులు ఈ ప్రయోజనం

పొందుతున్నారు. సంవత్సరానికి 22లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయడమవుతున్నది. ఇందుకు గాను రూ.2749కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేయబడింది.

ఈ బియ్యం పంపిణీ విషయంలో పౌర సరఫరాల శాఖలో గత అనేక సంవత్సరాలనుండి రుగ్మతలు ఉన్న మాట వాస్తవమే. పేదల బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి, అక్రమంగా తరలించే బ్రోకర్లు, మిల్లర్లు గాని, రేషన్ షాపు డీలర్లు కావచ్చు, యధేచ్ఛగా వారు కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చారు. కాని తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత, వారి పట్ల కఠినంగా వ్యవహరించి, వారి అక్రమాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేసింది. ఇప్పటివరకు అలాంటి వారి మీద మొట్టమొదటిసారిగా 2480 కేసులు నమోదు చేయడం జరిగింది. వారి దగ్గర నుండి రూ.18కోట్ల విలువైన సరుకుని సీజ్ చేయడం కూడా జరిగింది. వారిపై మొదటిసారిగా పి.డి. చట్టాన్ని ప్రయోగించి, జైలుకు పంపడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు కడుపు నిండా తిండి పెట్టాలన్న భావనకు కట్టుబడి ఉంది. అందుకు తూట్లు పొడిచే పద్ధతికి ఎవరు ఒడిగట్టినా ఉపేక్షించేది లేదని మీద్వారా సభకు మనవి చేస్తున్నాను.

ఈ ప్రభుత్వం పేద ప్రజల ఆకలిని గుర్తించి, వారికి గతంలో ఉన్న నాలుగు కేజీల బియ్యం కోటాను ఆరు కేజీలకు పెంచింది. అలాగే గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రూ.60,000 ఆదాయ పరిమితిని రూ.1,50,000కు పెంచడం జరిగింది. పట్టణ ప్రాంతంలో ఉన్న ఆదాయ పరిమితి రూ.75,000ను రూ.2.00లక్షలకు పెంచడం జరిగింది. అర్హులైన వారందరికి రేషన్ కార్డులు ఇవ్వాలన్నది మా ప్రభుత్వ ధ్యేయం. దేశంలో ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకున్న తరువాత, మన రాష్ట్రం కూడా ఈ నెల నుండే ఆ పరిధిలోకి చేరిందని మనవి చేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారుల సంఖ్య 1.91 కోట్ల మంది ప్రజలు మాత్రమే. ఆ అంచనాల ప్రకారం వారు కేవలం 12 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే మనకు కేటాయించబోతున్నారు. అది కూడా కిలో రూ.3.00 చొప్పున ఇవ్వబోతున్నారు. అయినప్పటికీ మనం కిలోకి ఒక రూపాయి చొప్పున, మనిషికి వారు ఐదు కిలోలు ఇవ్వగా, మనం ఆరు కిలోల చొప్పున, వారిచ్చిన 12 లక్షల మెట్రిక్ టన్నులతో సరిపెట్టకుండా, మనం 22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాము. కేంద్రం 1.91కోట్ల మంది లబ్ధిదారులకు ఈ పథకాన్ని నిర్దేశించగా, మనం ఆ సంఖ్యను పెంచి, 2.82 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ ప్రయోజనం వర్తింపచేసి, వారికి కడుపునిండా అన్నం పెడుతున్నాం. ఈ దేశంలో సంక్షేమ రంగంలో మన రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెటడానికి మా ప్రభుత్వం కృషి చేస్తుందని మీద్వారా ఈ సభకు తెలియచేస్తున్నాను అధ్యక్షా.

శ్రీ సభావత్ రాములు నాయక్ : అధ్యక్షా, ఒక మంచి పథకాన్ని అమలు చేస్తూ, పేద ప్రజల ఆకలి తీరుస్తున్నందుకు మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారికి, పౌర సరఫరాల శాఖ మంత్రిగారికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. నాలుగు కేజీల బియ్యం కోటాను ఆరు కేజీలకు పెంచారు. ఎంతమంది సభ్యులున్నా, ఒక కుటుంబానికి ఇరవై కేజీల బియ్యాన్ని మాత్రమే ఉమ్మడి రాష్ట్రంలో ఇస్తుండేవారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ఒక వ్యక్తికి ఆరు కిలోల చొప్పున, కిలోకి ఒక రూపాయి చొప్పున, పదిమంది సభ్యులుంటే అరవై కిలోలు ప్రస్తుతం పంపిణీ చేస్తున్నారు. ఆ నాడు కిలో రెండు రూపాయల బియ్యం పథకం వల్లనే ప్రభుత్వం అధికారం చేజిక్కించుకోగలిగింది. ఇది చాలా గొప్ప పథకం. కాబట్టి బియ్యాన్ని అక్రమ రవాణా కాకుండా చూడవలసిన బాధ్యత ఉంది. రూ.150 కోట్ల విలువ చేసే బియ్యం అక్రమంగా రీసైక్లింగ్ అవుతున్నది. 15-20శాతం వరకు రేషన్ డీలర్లు రైస్ మిల్లర్లతో చేతులు కలిపి,అక్రమాలు చేస్తున్నారు. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే రూ.15-20 కోట్ల విలువచేసే బియ్యాన్ని తరలిస్తున్నారు. తాండూర్ నియోజక వర్గం దాటితే కర్నాటక రాష్ట్రం మొదలవుతుంది. తాండూర్ నుండి కర్నాటకలోకి సులభంగా బియ్యం తరలిపోతున్నాయి. అలాగే మెదక్ జిల్లాలో నారాయణ్ ఖేడ్ నియోజకవర్గం ఉంది అధ్యక్షా. ఆ ప్రాంతం అటు మహారాష్ట్రకు, ఇటు కర్నాటకకు సమీపంగా ఉంటుంది. ఇక్కడ నుండి 20 నుండి 30 శాతం బియ్యం అక్రమంగా తరలిపోతున్నది. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే విజిలెన్స్ వారు 185 కేసులు నమోదు చేసారు. ఇంతకుముందే మంత్రిగారు పి.డి. చట్టం అమలుచేసి, అక్రమాలకు పాల్పడేవారిని జైలుకు పంపామని చెప్పారు. ఇది చాలా అభినందనీయం.

నేను నా చిన్నతనం నుండి రేషన్ షాపులు ఒక కుటుంబానికే పరిమితం కావడం చూస్తున్నాను. ఇరవై సంవత్సరాలు గడిచినా, డీలర్ షిప్ ఆ కుటుంబం మధ్యనే ఉంటుంది. రేషన్ డీలర్ మీద ఎన్ని కేసులు నమోదై ఉన్నా, వారి లైసెన్సులు మాత్రం రద్దు కావు. మా నారాయణ్ ఖేడ్ నియోజక వర్గంలో ఒక డీలర్ పదిసార్లు సస్పెండైనప్పటికీ, రేషన్ షాపు అతనే నడిపిస్తున్నాడు. మన తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది విద్యావంతులైన, నిరుద్యోగ యువకులు ఉన్నారు. ప్రభుత్వం అక్రమాలకు పాల్పడే డీలర్ల లైసెన్సులు రద్దుచేయకుండా, వారికే లైసెన్సులు రెన్యువల్ చేస్తూపోవడం మంచిది కాదని మీద్వారా మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను.

11.20 ఉ.

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, ఇదొక గంభీరమైన సమస్య, సభ్యులందరికీ తెలుసు. గౌరవ సభ్యులు రాములు నాయక్ గారు ఉదహరించిన విషయాలన్నీ వాస్తవం. పూర్తిగా నాకు సమాచారం ఉంది, చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత బోగస్ కార్డులను కొంత వరకు ఏరేసిన మాట వాస్తవం. చాలా మంది డీలర్లు వాళ్లే స్వయంగా బోగస్ కార్డులను తయారుచేసుకుని, వాటి ఆధారంగా కోటా డ్రా చేసి దాన్ని ప్రక్క రాష్ట్రాలకు తరలిస్తున్న మాట వాస్తవం. ఈ బోగస్ కార్డులను ఏరేయాలి. ఈ ఫెయిర్ ప్రైస్ షాపుల డీలర్ల మీద రెయిడ్ చేస్తే వాళ్ల ఇళ్లల్లో కట్టలు కట్టలుగా బోగస్ రేషన్ కార్డులు దొరుకుతాయి. వీటిని పూర్తిగా ఏరేయాలి. బోర్డర్ చెక్‌పోస్టులను బలోపేతం చేస్తే ఈ సమస్యని కొంత వరకు తగ్గించవచ్చు. 30, 40 శాతం రేషన్ ప్రక్కదారి పడుతోంది. ఈ సమస్యని పరిష్కారం చేయాలని కోరుతున్నాను.

SRI SYED ALTAF HYDER RAZVI: Sir, while giving Ration Cards, which the Government proposes to give in the month of November, while making the new ration card, there is one problem, which is regularly being brought-up.

صاحب! یہ جو آدھار کارڈ ہوتا ہے، ابھی آپ Head of the Family کے نام پر Food Security Card بنا رہے ہیں۔ Suppose the family members are 5, 1 child out of 5 children, suppose 1 is not having Aadhaar Card, his name is not being included. تو کیا حکومت نے ایسا کوئی رول بنایا ہے کہ جس کا آدھار کارڈ نہیں ہے، اس family میں اس کا نام فوڈ سیکیورٹی میں نہیں رکھا جائے گا۔ صاحب! جب سپریم کورٹ کہتا ہے کہ Aadhaar Card is not mandatory, تو اگر ایسا کچھ ہو تو میں حکومت سے گزارش کروں گا کہ آدھار کارڈ کو اس میں mandatory نہ کیا جائے کیونکہ اگر family میں پانچ ممبر ہوں تو پانچوں کا نام فوڈ سیکیورٹی میں رہنا چاہئے۔ اور دوسری چیز صاحب اگر ایک فرد کم ہو جائے the quanity of the ration will be reduced per family، دوسری چیز یہاں پر صاحب، جو راشن شاپس ہیں، especially in the heavily populated areas, جیسا urban areas ہیں، ایک ایک راشن شاپس پر کئی راشن کارڈس ہیں۔ Sir, Ration Shops, I know which have thousands of Ration Cards. تو پرابلم یہ ہوتا ہے کہ بڑی بڑی لائینس ہوتی ہیں، خواتین کو بھی گھنٹوں لائین میں کھڑے ہونا پڑتا ہے، لیکن راشن نہیں ملتا، اور اس میں بھی بہت مشکلات ہوتے ہیں، جھگڑے ہوتے ہیں۔ اس میں ایک average کے اوپر divide کیجئے، دکانوں میں اضافہ کیجئے اور دکانوں کو ایسا locate کیجئے کہ وہ localities کے درمیان میں رہیں تا کہ غریب لوگوں کو وہاں پر پہنچنے میں سہولت ہو۔ راشن کی دکان ایک جگہ ہوتی ہے، لوگ کہیں اور رہتے ہیں، اس میں کافی مشکل ہو رہی ہے تو اس میں آپ ایک detail دیجئے۔ آپ اس میں review کیجئے اور راشن کارڈس کو بڑھانے کے لئے بھی اور آدھار کارڈ کو mandatory مت کیجئے۔ میں منسٹر صاحب سے اس پر وضاحت چاہوں گا۔

శ్రీ ఈటెల రాజేందర్ ః సభ్యుల ఆందోళన కానీ, ఆవేదనకానీ అర్థం చేసుకునేటటువంటిదే. మన రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ శాఖమీద ఇన్ని రకాల రివ్యూలు, సమీక్షలు జరిగిన సంగతి నాకు తెలిసి ఎప్పుడూ లేదు. ఒక వందసార్లు రకరకాల పద్ధతులలో అధికారులతోకానీ, బియ్యం సరఫరా చేసే దుకాణాదార్లతోకానీ, బియ్యం మిల్లర్లతోకానీ, కాంట్రాక్టర్స్‌తోకానీ అనేక రకాలుగా దఫదఫాలుగా మేము సమావేశం ఏర్పాటుచేసిన మాట వాస్తవం. సభ్యులు ఏయే సమస్యలైతే ఇప్పుడు లేవనెత్తిండ్రో వాటన్నింటిపట్లాకూడా కూలంకషంగా చర్చించుకుని వాటిని ఏ విధంగా అమలుచేయాలనేదానిమీద కూడా ఉన్నాము. నాకు తెలిసి దేశంలోనే మొట్టమొదటిసారిగా దుకాణాలవారీగా, గ్రామాలవారీగా మొత్తం నివేదిక తెచ్చుకుని కంపైల్ చేసే చరిత్ర ఒక్క తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే దక్కింది. పది నుంచి ఇరవై శాతం పేదల బియ్యం పెద్దలపాలు అనే పద్ధతిలో కూడా జరుగుతోంది. ఇప్పటికే మేము చేసినటువంటి కొన్ని చర్యలవల్ల ఇంతకుముందు చెప్పినట్లుగా ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 54,000 కార్డ్స్ వాళ్ళే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని సభ్యులకు తెలియజేస్తున్నాను. సభ్యులన్నట్లు 2.82 కోట్లమందికి కాదు మూడు కోట్లమందికి మనం బియ్యం ఇచ్చినాము. కానీ డే టు డే మనం తీసుకున్న చర్యలలో భాగంగా దాదాపుగా 20లక్షలమందికి ఇప్పటికే కార్డులను రద్దుచేశాము. ఒకటి మాత్రం సత్యం. భారత ప్రభుత్వం ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజల సంఖ్య కేవలం 1.9 కోట్ల జనాభా మాత్రమే. ఇంకా 90.9 లక్షలమందిలో కొంతమంది పేదవాళ్ళు, కొంతమంది ధనికులు ఉన్నమాట కూడా వాస్తవం. ఈ అనర్హులను, బోగస్‌కార్డులను, బియ్యం యజమానుల దగ్గరే కొన్ని కార్డులు అక్రమంగా ఉంటున్నాయో వాటన్నింటినీ కూడా అరికట్టే పనిలో ఉన్నాము కాబట్టే కార్డ్స్ ముద్రించి ఇచ్చే విషయంలో కొంత ఆలస్యమైన మాట వాస్తవమే.

ఇంకరెండవ అంశానికి వస్తే, బియ్యంలో కూడా ఒక డీలరుకి రెండువేల కార్డ్స్ ఉంటే, మరొకరికి రెండువందల కార్డ్సే ఉంటాయి. వాటిని రేషనలైజ్ చేయాలని చెప్పి ఒక నాలుగైదుసార్లు మా దగ్గరే కూర్చోబెట్టుకుని గ్రామాలలో అయితే 500 నుంచి 800 కార్డ్స్ ఉండాలి. మండలాలలో అయితే దాదాపు 800, పురపాలక సంఘాల్లో అయితే 1000, కార్పొరేషన్‌లో అయితే 1000 నుంచి 1200 కార్డ్స్ ఇచ్చి రేషనలైజ్‌చేయాలనే కాన్సెప్ట్‌తో ఉన్నాము. బియ్యం డీలర్లతో అనేకసందర్భాలలో సమావేశం నిర్వహించి అక్రమాలు జరిగితే ఉపేక్షించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా లేదు కాబట్టి గతంలోలాగా రాజుల సొమ్ము రాళ్ళపాలు అనే దానికి తెలంగాణ

ప్రభుత్వం ఒప్పుకోదు అని చెప్పి ముందు నుంచి ఎర్రచీమ పోయినా పట్టించుకుంటావు కానీ, వెనక నుంచి ఏనుగుపోయినా పట్టించుకోమనే సామెత ఏదైతే ఉందో అది తప్పు. ముందునుంచి కూడా ఎర్రచీమ పోకుండా ఉండే పద్ధతిలో చేస్తామని చెప్పినాము. దాంట్లో భాగంగానే ఇంతకుముందు చెప్పినట్లుగా కేసుల విషయంలో 2480 కేసులు పెట్టినాము. దాదాపుగా 72733 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేసినాము. అదే విధంగా కొన్ని క్రిమినల్ కేసులు కూడా పెట్టి జైలుపాలు చేయడం జరిగింది.

మొట్టమొదటిసారిగా మనం టాడా కేసు పెట్టి అరెస్టు చేయడం జరిగింది. అంతే కాకుండా దీంట్లో కమీషన్ కూడా పెంచబోతున్నాము. ఇప్పుడు ఎన్.ఎఫ్. ఎస్.ఐ కార్డు అమలు చేయబోతున్నాము. గతంలో 20 పైసలు మాత్రమే ఉండేది. దానిని కూడా కొంత పెంచాలని చెప్పి నిర్ణయించుకున్నాము. ఎందుకంటే ఈ అక్రమాలు జరగకుండా ఉండడానికి వారితో చర్చోపచర్చలు జరిపితే, మాకు రెమ్యునరేషన్ పెంచితే మేము ఒక్క కిలో కూడా పక్కదారి పట్టకుండా చూసే బాధ్యత మాదని చెప్పి వాళ్ళు చెప్పారు. చెప్పడమే కాకుండా తప్పు చేస్తే క్షమించకండని చెప్పి వాళ్ళ నుంచి హామీ దొరికిన తరువాత అది కూడా చేపడతాము.

అంతేగాకుండా ఈ దేశంలో అక్కడక్కడ జి.పి.యస్ పద్ధతి అమలులో ఉంది. మన దగ్గర కూడా ట్రాన్స్‌పోర్టులో గోదాముల నుంచి పక్కదారి పడుతున్న లారీలు వెళ్ళకుండా ఉండే పద్ధతిలో జి.పి.యస్‌ను కూడా లింకప్ చేయబోతున్నాము. అట్లాగే ఈ-పాసు విషయంలో కూడా కందుకూరు లాంటి మండలంలో ఇప్పటికే అమలుచేశాము. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్ననాడే కందుకూరులాంటి మండలాలలోని కొన్ని గ్రామాల్లో కొన్ని దుకాణాల్లో అమలుచేశాము కాబట్టి ఆ సందర్భంలో 15 నుంచి 20 శాతం బియ్యం ఆదా అయిన చరిత్ర మనకు అనుభవం ఉంది కాబట్టి మొత్తమిప్పుడు ఈ రంగారెడ్డి, హైదరాబాద్‌లో 1540 దుకాణాలల్లో ఈ-పాస్ యంత్రాన్ని కూడా పెట్టి దీనిని అమలు చేయబోతున్నాము. దీని తదుపరి మొత్తం తెలంగాణాలో ఈ-పాస్ యంత్రాలను పెట్టి ఒకే కుటుంబానికి రెండు కార్డ్స్ ఉండే పద్ధతి, డీలర్ల దగ్గర్నే అక్రమకార్డులు ఉండే పద్ధతి వంటివన్నీ అరికట్టే ప్రయత్నం తప్పకుండా చేయబోతున్నాం. అట్లాగే గౌరవ సభ్యులు కోరినట్లుగా కార్డులనుంచి చిన్నపిల్లల్ని డిలీట్ చేయాలనే ఆదేశాల్ని ఎక్కడా కూడా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వలేదు. అర్హులైన వాళ్ళందర్నీ కూడా ఇన్‌క్లూడ్ చేయాలని చెప్పినాము. ఇంకా ఎంత గొప్పపనిచేసింది తెలంగాణ ప్రభుత్వమంటే పిల్లగాడికి హాస్టల్‌లో సీటుండి అక్కడున్నప్పటికీ కూడా మళ్ళీ ఆ కుటుంబంలో ఆ పిల్లగాడికి ఇంటి దగ్గర కూడా బియ్యమిస్తున్నాం. ఆ విషయంలో కొద్దిగా గందరగోళమున్న మాట వాస్తవం. అలాగే విద్యార్థికి మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం బియ్యమిస్తుంది. అదేవిధంగా హాస్టలులో ఉన్నవారికి కూడా బియ్యమిస్తుంది. ఇక్కడ ఇచ్చిన పిల్లలకు మళ్ళీ కుటుంబంలో వారికి మళ్ళీ బియ్యమిస్తున్నాం. మేమెక్కడా ఆధార్ లేదనే నెపంతో ఏ సభ్యుడ్నీ కూడా తొలగించడానికి ఆస్కారంలేదు. మీకు గనుక ఎక్కడైనా అలాంటివి జరిగిన ఉదాహరణలు కనుక ఇస్తే ఎప్పటికప్పుడు సరిచేసుకునే ప్రయత్నం చేస్తాము.

నేను మా గౌరవ సభ్యులకు ఇంకొక మాట విన్నవించే అంశమేమంటే మా దగ్గర సమగ్రమైన నివేదిక ఉంది. గౌరవ ముఖ్యమంత్రిగారితో దానిపై సమీక్షపెట్టుకుని నూటికి నూరు శాతం ఉక్కుపాదంపెట్టే బాధ్యత మాదే. అక్రమాలకు తావులేకుండా పౌరసరఫరాలశాఖను అన్నిరకాల తీర్చిదిద్దాలనే సంకల్పానికి తెలంగాణ ప్రభుత్వం కానీ, గౌరవ ముఖ్యమంత్రిగారు కానీ కట్టుబడి ఉన్నారు కాబట్టి మీకు కూడా ఎక్కడైనా సమాచారం వస్తే మాకందించే ప్రయత్నం చేయండి. బ్రోకర్లకు ఆస్కారం లేని పద్ధతిలో, అక్రమాలకు, దుర్మార్గాలకు అస్కారం లేని పద్ధతిలో పౌరసరఫరాలశాఖను తీర్చిదిద్దాలనేదే ప్రభుత్వ సంకల్పం కాబట్టి మీ సహాయ సహకారాలు కూడా మాకందించాలని చెప్పి గౌరవ సభ్యులకు తమరిద్వారా విజ్ఞప్తి చేస్తున్నాము.

## రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు

ప్రశ్న నెం.951(38) డా॥ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎం.ఎల్.సి. గౌరవనీయులైన సాగునీరు, గనులు, భూగర్భ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) ఖమ్మం జిల్లా, బయ్యారం ప్రాంతంలో, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో ఇనుప ఖనిజం నిక్షేపాలు విస్తారంగా లభ్యమవుతున్న విషయం వాస్తవమేనా:

ఆ) ప్రభుత్వం రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్‌ను స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నదా:

ఇ) అయితే, ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన సాగునీరు, గనులు, భూగర్భ శాఖ మంత్రి (శ్రీ టి.హరీష్‌రావు) అ) అవునండీ.

ఆ) అవునండీ.

ఇ) i) భారత భౌగోళిక సర్వే సమర్పించిన ప్రాథమిక పరిశీలన డేటా ప్రకారం, రాష్ట్రంలో 302 మిలియన్ టన్నుల వివిధ గ్రేడుల ఇనుప ఖనిజం లభ్యంగా ఉంది. దీనికి సంబంధించి, తదుపరి సవివరమైన అన్వేషణ జరిపే ఆవశ్యకత ఉంది. ప్లాంటును

స్థాపించడానికి జి3 కేటగిరిలో 200 మిలియన్ టన్నుల నిక్షేపాలు సెయిల్ (ఎస్ఏఐఎల్)కు తప్పనిసరిగా కావలసివుంటుంది. బయ్యారంలో సవివరమైన అన్వేషణ జరుగుతున్నది.

ii) కేంద్ర ప్రభుత్వ, ఉక్కు, గనుల మంత్రిత్వ శాఖ, తెలంగాణలో స్టీల్‌ప్లాంటును స్థాపించేందుకు గల సాధ్యాసాధ్యతలపై ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్రం నుండి పరిశ్రమల కమీషనరు, గనుల, భూగర్భ శాఖ డైరెక్టరుగా సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్‌ను స్థాపించేందుకు ఈ బృందం చిత్తశుద్ధితో అన్ని చర్యలను చేపడుతున్నది.

డా. పల్లా రాజేశ్వర్‌రెడ్డి: అధ్యక్షా, బయ్యారం ఉక్కు అనేది తెలంగాణ ప్రజల హక్కు అనే నినాదమిచ్చి దానికోసం సత్వర చర్యలు తీసుకోవాలనుకున్నాం. గౌరవ ముఖ్యమంత్రిగారు ఫిబ్రవరిలో వెళ్ళి తోమర్‌గారిని కలిసినప్పుడు టాస్క్‌ఫోర్స్ కమిటీ వేస్తామన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ వేశారు. గత ఎనిమిది నెలలుగా అది వడిగా అడుగులు వెయ్యడంలేదని చెప్పేసి ప్రజలందరూ భావిస్తున్నారు. ఒకవైపేమో గత ప్రభుత్వాలు ఇక్కడ సత్వర నాణ్యతలేదు, సరైన పరిమాణంలో లేదు, కాబట్టి ఇక్కడ పెట్టడం సాధ్యంకాదన్నారు. ఇప్పుడున్న టాస్క్‌ఫోర్స్ క్లియర్‌గా చెప్పింది. కావలసినన్ని నిక్షేపాలు ఇక్కడున్నాయి. దానికి కావలసిన మొత్తం కూడా తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందని చెప్పింది. భూమికానీ, పక్కనే కిన్నెరసాని నుంచి 2 టియంసి నీళ్ళుకానీ, దానికి కావలసిన నిధులులాంటివన్నీ కూడా ఇస్తామని చెప్పింది. 15 సంవత్సరాలపాటు రాయితీలు ఇచ్చినట్లయితే వెంటనే మొదలుపెట్టచ్చు. కాబట్టి కేంద్రప్రభుత్వం కానీ ఒకవేళ దానిని పట్టించుకోనట్లయితే రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకుని, ఉక్కు కర్మాగారం ఇక్కడ పెట్టబడినట్లయితే ఆ ప్రాంత గిరిజనులకే కాకుండా రాష్ట్రంలోని అనేకమంది నిరుద్యోగులకు ఈరోజున ఉపయోగవుంటుంది. అదేవిధంగా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కూడా అది ఉపయోగపడుతుంది కాబట్టి ఎంత వేగంగా చర్యలు తీసుకుందామనుకుంటున్నారు టాస్క్‌ఫోర్స్ ద్వారా, మన రాష్ట్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందీ వివరంగా ఇస్తే బాగుంటుందని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ టి.హరీష్‌రావు: అధ్యక్షా, గౌరవనీయులు రాజేశ్వర్‌రెడ్డిగారు చెప్పినట్లు ఈ ప్రాసెస్ కొంత ఆలస్యమవుతుందన్నమాట వాస్తవమే. అయితే కేంద్ర ప్రభుత్వంలో ఏర్పడినటువంటి టాస్క్‌ఫోర్స్ అనేకమైనటువంటి నిబంధనలను మనకు పెట్టడం జరిగింది. వాళ్ళు ఏమడిగినారంటే మాకు కనీసం 200 మిలియన్ టన్నుల బొగ్గు జి3 స్టేటస్‌లో ఉండాలని. అంటే వాస్తవానికి గనులశాఖలో ఆయొక్క నాణ్యతను నిర్ణయించడానికి జి1, జి2, జి3, జి4 అనే నాలుగు విభాగాలుగా విభజించడం జరుగుతుంది. ప్రస్తుతం మనం జి4లో ఉన్నాము. ఇక్కడ ఇనుప ఖనిజం ఉంది అని అంతవరకే తెలుసు మనకి. వాళ్ళేమంటున్నారంటే ఉందీ అంటే మాకు సాధ్యంకాదు. ఇది ఎంత లోతులో ఉంది. ఎంత నాణ్యతతో ఉంది. ఎకనామికల్‌గా అది వయబుల్‌గా ఉందా? లేదా? అనేటటువంటిది జి3 స్టేటస్‌కు కావలసినటువంటి అవసరముంది. ఆ జి3 స్టేజిలో మాకు 200 మిలియన్ టన్నుల బొగ్గు మీరు ఇచ్చినట్లయితే మేము దీనిని చేయగలుగుతాము. రెండోది వాళ్ళేమన్నారు. The deposit shall be in a close range of proposed steel plant. మూడోది ఏమంటున్నారంటే కనీసం మేము బెనిఫికేషన్ ప్లాంట్ పెట్టాలన్నా 50 నుంచి 100 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం జి3 స్టేటస్‌లో మాకు ఇవ్వాలని అడిగినారు. అదే విధంగా రాష్ట్రప్రభుత్వం నుంచి రాయితీలు కానీ ఇతరత్రా అడిగినారు. వాటన్నింటినీ ఇవ్వడానికి ఒప్పుకుంది. అదేవిధంగా జగ్‌దల్‌పూర్‌నుంచి కూడా ఒక రైల్వే లైను కూడా వేయాల్సిన అవసరంగురించి చెప్పినారు. దానికి కూడా కొంత ఖర్చులు భరించడానికి మన రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం జరిగింది. ఇవన్నీ చేయడానికి ప్రభుత్వం రెడీగా ఉంది. దాంట్లో ప్రధానంగా ఏమి వచ్చింది? జి3 స్టేటస్‌ను మనం ఇవ్వాలి. అలా ఇవ్వాలన్నప్పుడు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారిని పిలిచి మీరు జి3 స్టేటస్‌కు చేయండి. కేంద్ర ప్రభుత్వ సంస్థ కదా మీరు వేగంగా చేయండి.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహకారమిస్తామని అడిగాం. వాళ్ళు మనకు మొత్తం తెలంగాణలో దాదాపు 12 బ్లాకులున్నాయి కాబట్టి రెండు సంవత్సరాలు పడుతుందన్నారు. ట్రయల్ బేసిస్‌లో అయినా బయ్యారంలో ఒకటి చెయ్యండని, దానికి అటవీ అనుమతులు అన్నీ కూడా ఇప్పిచ్చి ఇస్తే, ఆ ట్రయల్ బేసిస్‌లో బయ్యారంలో ఒక్క బ్లాక్ చెయ్యడానికి expected time for completion of field work is March 2016. Report submission by September, 2016 అన్నారు. ఒక్క బ్లాక్‌కే సెప్టెంబర్ 2016కి ఇస్తే ఈ 12 బ్లాకులు ఎప్పుడు పూర్తికావాలి? ఈ 200 మిలియన్ టన్నులు మనం ఎప్పటిలోగా ఇవ్వాలి అనే విషయాన్ని ఈరోజు ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఆలోచిస్తోంది. జి.యస్.ఐ., అనేది గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఏజెన్సీ. వాళ్ళు ఇంత సమయం అడుగుతున్నారు. మనకు దాదాపు పన్నెండు బ్లాకులున్నాయి. కరీంనగర్ జిల్లాలోని ఆర్నకొండ, వరంగల్ జిల్లాలో సీతానగరం, ఖమ్మం జిల్లాలో ఎర్రగుంట, ఖమ్మం జిల్లాలో లచ్చాపురం, వరంగల్ జిల్లాలో డబ్రిపేట, వరంగల్ జిల్లాలో అబ్బాపూర్, మల్లంపల్లి,

ఆదిలాబాద్ జిల్లాలో దస్తురాబాద్, కల్లడ, నాయకపుగూడెం, ఆదిలాబాద్ జిల్లాలో చిట్యాల, ఆదిలాబాద్ జిల్లాలో రెబ్బనపల్లి, కరీంనగర్ జిల్లాలో చందోలి, అంబార్‌పేట, కరీంనగర్ జిల్లాలో ఎర్రబల్లి, నిజామాబాద్ జిల్లాలో ఎల్లారెడ్డి. ఈ పన్నెండు బ్లాకుల కింద మనకు ఇనుప ఖనిజం ఉన్నట్లుగా ప్రాథమికంగా గుర్తించడం జరిగింది. ఈ పన్నెలండు చోట్ల కూడా మనం జి3 స్టేటస్‌కు తేవాల్సిన అవసరముంది. అందుకే ఈ మధ్యలోనే మేము ఈ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాతో చేస్తే చాలా ఆలస్యం జరుగుతోంది, వేగంగా స్టీల్‌ప్లాంట్ పెట్టాలని ముఖ్యమంత్రిగారు ఆదేశించారు కనుక దానిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TSMDC) ను నోడల్ ఏజెన్సీగా పెడుతూ వారిద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఎవరైనా మల్టీ నేషనల్ కంపెనీలనుకానీ, ప్రైవేటు ఏజెన్సీలు కానీ, దీనిని వేగవంతంగా జి3 స్టేటస్‌కు తేవడానికి సర్వేచేసి దానిని ఎక్స్‌ప్లోర్ చేసి ఇవ్వడానికిగల సాధ్యాసాధ్యాలపై ఒక అంతర్జాతీయ బిడ్డింగ్‌కు పోవాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఎందుకంటే బోర్స్ డ్రిల్ చేయాల్సి ఉంటుంది. చాలావరకు ఫారెస్టు ఏరియాలో ఉంటాయి. ఫారెస్టు క్లియరెన్స్ రావాల్సిన అవసరముంటుంది. ఆ బోర్ డ్రిల్ చేయాలంటే చాలా లోతుగా డ్రిల్ చేయాల్సి ఉంటుంది. అంతా రాయి ఉంటుంది కనుక వేగంగా డ్రిల్ చేసే అవకాశముండదు. కాబట్టి ఎక్కువ ఏజెన్సీలను పెట్టి ఇంకా ఏదైనా అంతర్జాతీయ స్థాయిలో ఉండేటటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించుకుని వేగవంతంగా దీనిని పూర్తిచెయ్యడానికి TSMDC నోడల్ ఏజెన్సీగా అంతర్జాతీయ బిడ్డింగ్ కూడా పిలవబోతున్నాం. దానిద్వారా తొందరగా కూడా తెప్పించుకుని దీనిని ఇంకా వేగంగా చెయ్యడానికి కూడా ప్రయత్నం చేస్తున్నాం.

కనీసం ప్రాథమికస్థాయిలో మనం బెనిఫికేషన్ పెల్లటైజేషన్ ప్లాంట్ పెట్టుకోవడానికి కూడా అవకాశముంది. దానిద్వారా కూడా ఒక రూ.3000 కోట్ల పెట్టుబడి వస్తుంది. ఇప్పుడున్న ఇనుప ఖనిజాన్ని అప్‌గ్రేడ్ చేస్తూ దాని స్ట్రెంగ్త్‌ను పెంచడానికి బెనిఫికేషన్ ప్లాంట్‌ను పెట్టుకుంటాము. బెనిఫికేషన్ ప్లాంట్‌లో అప్‌గ్రేడ్ చేసిన ఇనుప ఖనిజాన్ని పెల్లెట్లుగా తయారుచేసే దానిని పెల్లటైజేషన్ ప్లాంట్ అంటావుు. ఆ పెల్లెట్స్‌ను ఉపయోగించి తిరిగి రాడ్స్ తయారుచెయ్యడానికి అవకాశవుంటుంది. అందువల్ల ప్రాథమికంగా ఈ మూడు, నాలుగువేల కోట్ల రూపాయల పెట్టుబడితో బెనిఫికేషన్ ప్లాంట్, పెల్లెటైజేషన్ ప్లాంట్ వేగవంతంగా తీసుకొచ్చి నెక్స్ట్ స్టేజిలో మనం స్టీల్‌ప్లాంట్ తేవడానికి అవకాశముంది. ఒకవేళ సెయిల్ ఆలస్యం చేసినా కూడా మనం ఒకసారి జి3 స్టేటస్‌కో, జి2 స్టేటస్‌కో తెచ్చుకోగలిగితే అనేక అంతర్జాతీయ కంపెనీలు కూడా ముందుకొచ్చే అవకాశముంటుంది. మనం సెయిల్‌తో పర్స్యూ చేస్తున్నాం. సెయిల్ అడిగిన ప్రతీదీ వేగంగా చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. మొత్తంగా ప్రభుత్వం ఈ యొక్క ప్రాసెస్‌ను ఒక జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ద్వారానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో సాంకేతికపరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించుకొని జి3 స్టేటస్ తేవడానికి వేగవంతంగా స్టీల్‌ప్లాంట్ పెట్టడానికి అన్ని ప్రయత్నాలు కూడా తెలంగాణ ప్రభుత్వం చేస్తుందనే విషయాన్ని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాం.

11.40 ఉ.

## నూతన రేషను కార్డుల పంపిణీ

ప్రశ్న నెం.941(40) శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి., గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, పౌరసరఫరాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో ఎంతమంది వ్యక్తులకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడమయింది; వారికి ఎప్పటిలోగా పంపిణీ చేయడమవుతుంది:

ఆ) సబ్సిడీ బియ్యానికి అర్హులుగా గుర్తించిన వ్యక్తుల వివరాలు:

ఇ) లబ్ధిదారులకు సబ్సిడీపై సరఫరా చేస్తున్న సరుకులు ఏవి?

గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, పౌరసరఫరాల శాఖ మంత్రి (శ్రీ ఈటల రాజేందర్):

అ) రాష్ట్రంలో 89,94,666 ఆహార భద్రతా కార్డులను వర్తింపు చేస్తూ సుమారు 2,82,59,950 మంది వ్యక్తులకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడమయింది. కొత్తగా ముద్రించిన ఆహార భద్రతా కార్డులను 2015, నవంబరు నాటికి జారీ చేయాలని ప్రతిపాదించడమయింది.

ఆ) సబ్సిడీ బియ్యానికి అర్హులుగా 2,82,59,950 మంది వ్యక్తులను గుర్తించడమయింది.

ఇ) బియ్యం, గోధుమలు, గోధుమ పిండి, కందిపప్పు, పంచదార, చింతపండు, మిరపపొడి, అయోడైజ్డ్ ఉప్పు, పసుపు, కిరోసిన్‌ను సరఫరా చేయడమవుతున్నది.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సర్వే చేయగా, తెలంగాణ రాష్ట్ర జనాభా 3.63కోట్లు. ఇంత జనాభాకు అనుగుణంగా ఉండేటువంటి రీతిగా కుటుంబాల సంఖ్య 1.01కోట్లు. ఈ కుటుంబాల సంఖ్యను ఆధారంగా చేసుకొని గతంలో తెల్ల రేషన్ కార్డులు, గులాబి రేషన్ కార్డులు, అంత్యోదయ రేషన్ కార్డులు ఇస్తూ వచ్చాము. గౌరవ మంత్రి వర్యులు చెప్పినట్లుగా ఆహార భద్రతా కార్డుల కుటుంబాల సంఖ్య 89,94,666 చెప్పారు. దానిలో లబ్ధి

పొందుతున్నటువంటి లబ్ధిదారులు 2,82,59,950 అంటున్నారు. అంటే తెల్ల రేషన్ కార్డులు గానీ, గులాబి రేషన్ కార్డులు గానీ, అంత్యోదయ రేషన్ కార్డులు గానీ ఇవన్నీ పోయి సమగ్రంగా కేవలం ఆహారభద్రతా కార్డులే ఇస్తున్నారా? గతంలో ఇచ్చినటువంటి రేషన్ ఏదైతే ఉన్నదో రూ.1కి ఒక కిలో చొప్పున ఇచ్చే బియ్యం అంతా కూడా ఆహార భద్రతా కార్డుల ద్వారా కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి 6కిలోలు ఇస్తామనే మాట చెప్పాము. కాబట్టి దానికి కట్టుబడి ఉండి ఈ ఆహార భద్రతా కార్డుల ద్వారా అందరికి చెల్లించేటువంటి అవకాశం ఉంటుందా అని మీద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

కొన్ని రోజుల క్రితం ఆదిలాబాదు జిల్లాలో ఒక సమావేశానికి హాజరు కాగా రూపాయికి కిలో బియ్యం ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి నష్టమే అవుతుంది తప్ప, లాభం ఉండడం లేదనే మాట అక్కడున్నటువంటి జెడ్.పి.టి.సి. సభ్యులు తెలియజేయడం జరిగింది. కాబట్టి దీనిని ఏమైనా క్రమబద్ధీకరణ చేసి కొత్త కార్డులు ప్రవేశపెడుతున్నప్పుడు ప్రభుత్వం ఏ రకమైనటువంటి విధానాన్ని అవలంభిస్తుంది. గౌరవ మంత్రి వర్యులు బియ్యం, గోధుమలు, గోధుమ పిండి, కందిపప్పు, పంచదార, చింతపండు, మిరపపొడి, అయోడైజ్డ్ ఉప్పు, పసుపు, కిరోసిన్‌ను సర్ఫరా చేయడమవుతున్నదని అంటున్నారు. అధ్యక్షా, అసలు ఏ రేషన్ షాపులో ఇవన్నీ కనపడవు మాకు. నేను మా ఇంట్లో పని మనిషిని రేషన్ దుకాణంలో ఇవన్నీ తీసుకొచ్చుకుంటవా అని అడిగితే, రేషన్ దుకాణాలు ఎప్పుడూ మూసే ఉంటాయనే మాట చెబుతుంది. కాబట్టి దీనిమీద ఏదైనా పకడ్బందీ వ్యూహం చేసేటువంటి అవకాశం ఉందా అనేది తెలియజేయాలని మీద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను. తెలంగాణ రాష్ట్రం వస్తే ఇగో ఇంత బాగ చేస్తున్నామనేటువంటి మాట రావాలి. కాబట్టి, దానికి అనుగుణంగా పౌర సర్ఫరాలపై సమగ్రమైన చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా అనేటువంటి విషయాన్ని తెలియజేయాలని కోరుతున్నాను.

శ్రీ సబావత్ రాములు నాయక్: అధ్యక్షా, ఎస్సీ/ఎస్టీ వసతి గృహాల్లో సన్నబియ్యం ఇస్తున్నందుకు వారికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రేషన్ ప్రక్రియ మొదలై 68 సంవత్సరాలు అయింది. ఒక్కొక్క గిరిజన తాండాలు, గూడెంలలో దాదాపు నాలుగు వందల మంది వరకు నివశిస్తుంటారు. కానీ, ఈరోజుకి కూడా గిరిజన గూడెంలు, తాండాలున్నటువంటి ప్రాంతాల్లో రేషన్ దుకాణాలు లేవు. వారు రేషన్ తెచ్చుకోవాలంటే నాలుగైదు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. అందుకని వారున్నటువంటి గిరిజన తాండాలు, గూడెంలల్లోనే రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని మీద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ ఈటల రాజేందర్: అధ్యక్షా, ప్రభుత్వ పరంగా చర్యలు ఏమి చేపట్టడం లేదనేది వాస్తవం కాదు. ఈమాత్రమైనా కష్టపడుతున్నాం కాబట్టే, ఆమాత్రమైనా నడుస్తుందనే విషయం గౌరవ సభ్యులు గమనించాలి. ఇంకా చేయవలసి ఉందని నేను భావిస్తున్నాను. గౌరవ సభ్యులు వారి, వారి ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడ ఏమి జరుగుతుందనే విషయాలు గమనించి ఫలానా దగ్గర ఇలా నడుస్తుందని చెబితే ఇంకా బాగుంటుందని చెప్పి నేను కోరుతున్నాను.

దీనిలో ఇప్పటిదాకా కార్డులు ఎందుకు అందజేయలేదంటే, గౌరవ సభ్యులు చెప్పినట్లుగా ఆధార్ లింకేజ్ అనే పేరిట ఇంకా కొంతమందిని కార్డుల్లోకి లాక్కపోవడం వల్ల కొంత సమస్య ఉంది. ఇంకా ఎవరైనా అనర్హత ఉంటే తీసివేయాలనేది మరొక కారణం. ఒకసారి కార్డు గనుక ఇస్తే మళ్లీ అది వెనక్కు తీసుకోలేము కాబట్టి, పకడ్బందీగా ఇప్పటివరకు ఉన్నవారు ఇందులోకి రాకపోయినా, అర్హత లేనివారు ఇంట్లాంటి కార్డులు పొందినా కూడా సమస్యలుంటాయని, ఇటువంటి వాటిని సరిచేయాల్సిన అక్కర ఉంది కాబట్టి, కార్డులు ఇప్పటిదాక ఇవ్వకుండా కొంత ఆలస్యం చేసిన మాట వాస్తవం. నెల లోపల ఇటువంటివన్నీ పకడ్బందీగా పూర్తి చేసి నవంబరు, డిసెంబరు కల్లా పూర్తిస్థాయిలో కార్డులు ఇచ్చేటువంటి కార్యక్రమం చేపడుతామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

బియ్యం ఇచ్చేదగ్గర, పకడ్బందీగా బియ్యం ఇవ్వడమనేది జరుగుతోంది. రేషన్‌లో భాగంగా తొమ్మిది సరుకులు ఇస్తున్నాము. ఎక్కడా కూడా సరుకులకు కొరత లేదు. కాకపోతే లబ్ధిదారులు ఏ సరుకైతే తీసుకుంటారో, దానినే గోడౌన్ నుండి లిఫ్టు చేయడం జరుగుతుంది. కొన్ని, కొన్ని గ్రామాల్లో చింతపండు గానీ, మిర్చిపొడి గానీ, పసుపు పొడి గానీ బయటనుండి కొనుగోలు చేసుకుంటే కొంత డూప్లికేటు వస్తుందనే ఆలోచనతో సీజన్ రాగానే వారే సంవత్సరానికి సరిపడా సమకూర్చుకుంటారు. మిగతా సరుకులైనటువంటి కందిపప్పు, కిరోసిన్, చెక్కర, గోదుమలు, బియ్యం, అయోడైజ్డ్ సాల్ట్ విషయంలో మాత్రం అందరికీ అందజేస్తాము. కాకపోతే నాలుగు రోజులో, ఐదు రోజులో ఇచ్చి, మిగతా రోజుల్లో షాపులు మూసివేస్తున్నారనే విషయం మా దృష్టికి వచ్చింది. కాబట్టి, కొత్త విధి విధానాల్లో పది రోజులా, 15రోజులా అనేది పెట్టుకొని తప్పకుండా ఏ తేదీనుండి ఏ తేదీవరకు బియ్యం ఇవ్వాలి, ఏసమయం నుండి ఏసమయం వరకు బియ్యం షాపు తెరచి ఉంచాలనే పనివేళలు నిర్దేశించుకునే పరిస్థితి వస్తుంది. నిర్దేశించిన సమయానికి షాపులు తెరచిన వారికి మాత్రమే షాపులు ఉంటాయి. ఒకవేళ ఎవరైనా నిర్దేశించిన సమయాలు పాటించకపోతే, ఎవ్వరినీ కూడా ఉపేక్షించే పరిస్థితి లేదు.

గౌరవ సభ్యులు శ్రీ సభావత్ రాములు నాయక్ చెప్పినట్లుగా తండాలకి, గూడెంలకి ఇప్పటికీ కూడా కొన్ని చోట్ల వాగులు వస్తే సరుకులు తెచ్చుకునే పరిస్థితి లేదు. కిలోమీటర్లు, కిలోమీటర్లు పోయేటువంటి పరిస్థితి ఉంది. అందుకని 250 కుటుంబాలు ఉంటేనే రేషన్ షాపు ఉండాలన్న నిబంధన ఏదైతే ఉందో, దానిని తప్పకుండా సరిచేసి నిజంగా వారు పేదవారు కాబట్టి, కిలోమీటర్లు వెళ్లేటువంటి దౌర్భాగ్య పరిస్థితి ఉంది కాబట్టి, అడవులు, వాగులు దాటి పోవాలంటే కొద్దిగా కష్టం ఉంటుంది. తండాలను, గిరిజన గూడెంలను కూడా గ్రామ పంచాయతీలు చేయబోతున్నాము. కాబట్టి, 250కుటుంబాలు ఉండాలనే నిబంధనల్ని తొలగించి గిరిజన గూడెంలకు తప్పకుండా రేషన్ షాపులు ఏర్పాటు చేస్తామని తెలియజేస్తున్నాను.

అదేవిధంగా గతంలో నిరంతరంగా 14సంవత్సరాల నుండి షుగర్ ఆంధ్ర ప్రాంతం నుండే సరఫరా చేసేవారు. దాంతో సభ్యులు శ్రీ కొంపల్లి యాదవరెడ్డి గారు ప్రస్తావిస్తూ ఇప్పటికీ కూడా షుగర్‌ని అక్కడినుండే సరఫరా చేసుకోవాలా అని అడిగారు. దాంతో, మొట్టమొదటి సారి నిజాం షుగర్ ఫ్యాక్టరీ నుండి షుగర్ సరఫరా చేస్తున్నాము. ఒకవేళ ఇంకా సరిపోకపోతే, తెలంగాణ షుగర్ మిల్లుల నుండి షుగర్ కొనుగోలు చేసి షుగర్‌ని సరఫరా చేస్తాము తప్ప, బయట నుండి కాంట్రాక్టుల నుండి తీసుకొని సరఫరా చేయడానికి ఎలాంటి ఆస్కారం లేదు. కందిపప్పు విషయంలో వారు పోయినసారి టెండర్లల్లో కిలోకి రూ.108/-కి Quote చేసి సరఫరా చేస్తామని ఇస్తే, రూ.135/-లు, రూ.145/-లు వచ్చినప్పటికీ కూడా అదే రూ.108/-లికి సరఫరా చేయాలని చెప్పి ఆదేశాలివ్వడం జరిగింది. వారు ఎన్నిసార్లు ధరఖాస్తులు పెట్టుకొని వారికి కష్టం అవుతుంది, లుక్సాన్ అవుతుందని చెప్పి ఆదుకోమని చెప్పినప్పటికీ కూడా, ఎక్కడా ఒక్క రూపాయికి కూడా వారికి వెసులుబాటు కల్పించకుండా ప్రభుత్వం చాలా పారదర్శకంగా ఈ పనులు చేపట్టడం జరుగుతోంది. మొన్న కూడా రూ.147.25పైసలకి టెండర్ వేస్తే, తెలంగాణ దాల్ మిల్స్‌కి మేము సహాయం చేస్తున్నప్పుడు ఇంత ఆపదలో ఒక రాష్ట్ర ప్రభుత్వానికి సహాయం చేయలేరా అని అంటే, మొన్నటికి మొన్నా రూ.147.25పైసలకి టెండర్ అగ్రిమెంట్ అయినప్పటికీ కూడా, సరఫరా మొదలైనప్పటికీ కూడా మళ్లీ పిలిపించి మాట్లాడి రూ.5కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదా అయ్యేట్లుగా చేయడం జరిగింది.

అధ్యక్షా, ప్రజలందరికీ నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను. ఇప్పుడున్నటువంటి ప్రభుత్వం, గతంలో ఉన్నటువంటి ప్రభుత్వాల మాదిరిగా లేదు. ఉక్కుపాదం పెట్టడానికి సిద్ధంగా ఉన్నది. నాకు తెలిసి 15నెలల కాలంలో ఒక రాజకీయ నాయకుడు గానీ, ఒక సంఘం గానీ గీ పైరవీ చేయండి, గీ పని చేయండని ఎవరూ చెప్పినటువంటి సందర్భం లేదు. అది ఈ ప్రభుత్వం యొక్క గొప్పతనం. అది మా డిపార్టుమెంటు యొక్క గొప్పతనం.

ఎక్కడైనా అన్యాయం జరుగుతున్నట్లుగా మీ నోటీసుకు వస్తే మీరు ప్రభుత్వానికి చెప్పడానికి ప్రయత్నం చేయండి. ఉక్కుపాదం పెట్టే బాధ్యత మాది. ఒకటి మాత్రం సత్యం. పేదల సొమ్ము పెద్దల పాలు కాకూడదు, అక్రమాలు జరగకూడదనే ప్రభుత్వ సంకల్పం. కాబట్టి, రాబోయే కాలంలో మరిన్ని మార్పులతో తెలంగాణ రాష్ట్రంలోని పౌరసరఫరాల శాఖ దేశంలోనే ఒక గొప్ప అగ్రగామిగా ఉండేటువంటి పద్ధతిలో చర్యలు చేపడుతుందని, దానికి సంబంధించిన పూర్తి వివరాలు గానీ సమాచారం గానీ ఇప్పటికే మాదగ్గర ఉందని చెప్పి గౌరవ సభ్యులకి మీద్వారా మనవి చేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: టీ విరామం కొరకు సభలు 15నిమిషాలపాటు సభను వాయిదా వేయడమయింది.

(the House then adjourned at 11.51 a.m. for 15-minutes' Tea Break)

(After Tea-break, the House re-assembled at 12.15 P.M.)

గౌరవ ఛైర్మన్ అధ్యక్షస్థానం వహించారు)

## II. ఉపాధ్యక్షుని ఎన్నిక

మిస్టర్ ఛైర్మన్ : అందరికీ నమస్కారం. Now election of Deputy Chairman.

**ANNOUNCEMENT**

I am to announce to the House that under Rule 10 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council, I will read out the names of the Members who have been duly nominated for the office of the Deputy Chairman together with those of their proposers. 20 sets of the nominations are received proposing the name of Sri Nethi Vidya Sagar and they are:

**Sarva Sri / Smt.**

Mohd. Mahmmod Ali,
Kadiyam Srihari
Naini Narasimha Reddy
Mohammed Ali Shabbir
M.S. Prabhakar Rao
Syed Aminul Hassan Jafri,
N. Ramachandra Rao,
Palla Rajeshwar Reddy

Sabavat Ramulu Naik,
Poola Ravinder
K. Janardhan Reddy,
Paturi Sudhakar Reddy
Bodakunti Venkateshwarlu
Kompally Yadava Reddy
V. Gangadhar Goud
Karne Prabhaker
Ponguleti Sudhakar Reddy
D. Rajeshwar Rao
Akula Lalitha
M. Srinivas Reddy

As Sri Nethi Vidya Sagar is the only candidate duly nominated, I declare Sri Nethi Vidya Sagar as elected to the Office of the Deputy Chairman.

I heartfully congratulate Sri Nethi Vidya Sagar on his election as Deputy Chairman and I request him to occupy the Chair.

I request the Chief Minister, Deputy Chief Minister, Minister for Legislative Affairs and the Floor Leaders to conduct Sri Nethi Vidya Sagar to the Chair. Please welcome.

(At this stage, while the Chief Minister, Deputy Chief Minister and the Floor Leaders accompanied, Sri Nethi Vidya Sagar, who was elected as Deputy Chairman came and occupied the Chair and conducted the proceedings)

(డిప్యూటి ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

శ్రీ కె. చంద్రశేఖర రావు ః గౌరవ డెప్యూటి ఛైర్మన్‌గారూ, ఈ రోజు తమరు ఏకగ్రీవంగా ఈ పదవికి ఎన్నిక కావడం పట్ల నేను ఈ రాష్ట్ర ప్రజల తరపున, వ్యక్తిగతంగా నా తరపున హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను. తమరు విద్యార్థి దశనుండే రాజకీయాలలో చాలా చురుకైన పాత్రను పోషిస్తూ, ప్రజాజీవితంలో చాలా క్రియాశీలకంగా పాల్గొంటూ వచ్చారు. ఆ సమయంలో ఘర్షణపూర్వకమైనటువంటి వాతావరణంలో ఎన్నో అడ్డంకులను తమరు ఎదుర్కొన్న విషయం మా అందరికీ తెలుసు. కౌన్సిల్‌కు సభ్యునిగా ఎన్నికైన అనతికాలంలోనే ఉపఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తరుణంలోనే మనకు తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం జరిగింది.

కొత్తగా ఏర్పడిన రాష్ట్రం, కొత్తగా కొలువుతీరిన ప్రభుత్వం ఈ నేపధ్యంలో, తెలంగాణ ముద్దుబిడ్డగా, తమరు ఎంతో రాజనీతిజ్ఞతతో, ఈ రాష్ట్రం ఏ విధంగా ముందుకు పోవాలనే విషయంలో తమరు చాలా సంయమనంతో వ్యవహరించారు. మన కొత్త రాష్ట్ర ప్రయాణం ప్రారంభమైన సందర్భంలో, ఈ సభలో నాయకులు ఏ విధంగా వ్యవహరిస్తారు అని దేశమంతా ఆసక్తిగా గమనించే తరుణంలో, అలాగే కౌన్సిల్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సభ సజావుగా జరిగిపోయే విధంగా తమరు నిర్వహించిన పాత్ర తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా ఉండిపోతుంది అధ్యక్షా. నేను బయట కూడా చాలా సందర్భాలలో ప్రజలకు, ప్రజా వేదికల మీద తెలంగాణ రాష్ట్రం అనేది ఒక కొత్త అధ్యాయమని, తెలంగాణ ప్రజల జీవితంలో ఒక కొత్త చరిత్రకు ప్రారంభం అని చెబుతూ వచ్చాను. తెలంగాణ రాష్ట్ర నాయకుల నుండి ప్రజలు ఆశించేది చిల్లర,మల్లర రాజకీయాలు కాదు. ఈ ప్రభుత్వానికి తమరు గొప్పగా ఆశీస్సులు, అండదండలు అందించారు. ఈ శాసన మండలిలో ప్రభుత్వ కార్యనిర్వహణ ఇంత గొప్పగా జరగడానికి మీ సహకారం ఎంతో ఉంది. తదనంతర కాలంలో తమరి పదవీ కాలం పూర్తి కావడమూ, మరల తమరు కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నిక కావడం, కౌన్సిల్ సభ్యులంతా తమరినే డిప్యుటి ఛైర్మన్‌గా ప్రతిపాదించి, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం చాలా సంతోషకరమైన సంగతి. ఈ పదవికి తమరిని ఎన్నుకోవడం కౌన్సిల్‌కే గౌరవంగా నేను భావిస్తున్నాను. తమరిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినందుకు కౌన్సిల్ సభ్యులందరినీ నేను పేరుపేరున అభినందిస్తూ, వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. తమరి యొక్క పదవీకాలంలో కౌన్సిల్ మరింత వన్నె దిద్దుకోవాలని, ఇంకా అర్థవంతమైన, ప్రజోపయోగమైన చర్చలు చేసి, రాష్ట్ర ప్రజల మన్ననలు పొందాలని కోరుకుంటూ, జీవితంలో తమరు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి, ప్రజా సేవలో మీ జీవితం పరిపుష్టం కావాలని, అందుకు భగవంతుడు నిండు ఆయుష్షును, ఆరోగ్యాన్ని తమరికి, తమ కుటుంబానికి ప్రసాదించాలని కోరుకుంటున్నాను.

ఈ సందర్భంలో మరొక్కసారి తమరికి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా హృదయపూర్వకమైన అభినందనలు తెలియచేస్తున్నాను అధ్యక్షా.

12.20
మ.

جناب محمد محمود علی (Janab Mohd.Mahmood Ali): صاحب! آپ کو ڈپٹی چیرمین بنائے جانے پر میں سب کو مبارکباد دیتا ہوں ۔آپ سابقہ میں بھی اچھا رول ادا کر چکے ہیں اور اس مرتبہ بھی ہمیں اچھی امید ہے۔آپ کی ڈپٹی چیرمین صاحب کی صدارت میں ہمارا کونسل بہت اچھے طریقہ سے چلے گا۔میری جانب سے میں آپ کو مبارکباد دیتا ہوں۔

శ్రీ కడియం శ్రీహరిః ఈరోజు రాజకీయాలకు అతీతంగా మీరు డెప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మీకు నాహృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. మీ గొప్పతనాన్ని, మీ రాజనీతిజ్ఞతను గుర్తించిన అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా మిమ్మల్ని ప్రతిపాదించి, డెప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నిక కావడానికి దోహదపడినందుకు ఆ పార్టీలకు కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇంతకు ముందు గౌరవ ముఖ్యమంత్రి గారు

సెలవిచ్చినట్లుగా మీ నేతృత్వంలో ఈ కౌన్సిల్‌కి మంచి పేరు వచ్చే విధంగా చర్చలు సారవంతంగా, రాష్ట్రాభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి ఉపయుక్తంగా ఉండేలా మీరు సభని నిర్వహిస్తారని, ఆదిశగా కౌన్సిల్‌ని నడిపిస్తారని ఆశిస్తూ మరొకసారి మీకు అభినందనలు తెలియజేస్తున్నాను.

SRI SYED AMINUL HASAN JAFRI(Teachers Constituency-Hyderabad): Sir, on behalf of my party, I heartily congratulate the Hon'ble Deputy Chairman on his re-election. Thank you very much for giving me this opportunity.

శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి: అందరి ఆమోదంతో డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైన మీకు శుభాభినందనలు తెలియజేస్తున్నాను. 1969లో విద్యార్థి నేతగా తెలంగాణ ఉద్యమంలో జైలుకెళ్లి, ఈ తెలంగాణ రాష్ట్ర సాధనలో సుదీర్ఘమైన మీ రాజకీయ పోరాటానికి అభినందనలు తెలియజేస్తున్నాను. ఒక గ్రామ సర్పంచు నుంచి ప్రజా జీవితాన్ని ప్రారంభించి, యువజన నేతగా, అన్ని కార్యక్రమాలలో ప్రజా మనిషిగా పేరు తెచ్చుకునే విధంగా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత తెలంగాణ శాసన మండలి మొదటి సమావేశంలో చరిత్రలో నిలిచిపోయే విధంగా మీ పాత్రని నిర్వహించారు. గతంలో మీ ఆధ్వర్యంలో ఈ సభలో జరిగిన చర్చలు సమాజానికి ఎంతో ఉపయోగపడ్డాయి. మీ సేవలను దృష్టిలో పెట్టుకొని, రాజకీయాలకు అతీతంగా ఏకగ్రీవంగా మిమ్ములను డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నుకున్నందుకు అన్ని పక్షాల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీ ఆధ్వర్యంలో తప్పకుండా ఒక మంచి పేరు వస్తుందని, సభకి మంచి ఉన్నతి కలిగే విధంగా మీ సేవలు ఉపయోగపడతాయని ఆశిస్తూ, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మీకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇంకా ప్రజా సేవ చేసే భాగ్యం కలిగించే విధంగా ఆ భగవంతుని ఆశీర్వాదాలు మీకుండాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కర్నె ప్రభాకర్(నామినేటెడ్): అధ్యక్షా, ఈరోజు నల్గొండ జిల్లా నుంచి శాసన మండలికి డిప్యూటీ ఛైర్మన్‌గా మీరు ఎన్నికైన సందర్భంలో జిల్లా ప్రజలందరూ కూడా చాలా సంతోషంగా ఉన్నారు. గతంలో మీరు ఈ సభలో వ్యవహరించిన తీరు, తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రనిర్మాణంలో బాధ్యతగా మీరు చేసిన కార్యక్రమం ఏదైతే ఉందో దానికి తప్పకుండా మిమ్ములను తెలంగాణ సమాజమంతా అభినందిస్తున్నటువంటి సందర్భంలో, ఈ అవకాశాన్ని మరొకసారి చేజిక్కించుకున్న పరిస్థితుల్లో, భవిష్యత్తు మండలి కార్యక్రమాలలో తప్పకుండా కాంక్రీట్ డిస్‌కషన్స్ జరిగే పద్ధతుల్లో మీ వైఖరి ఉంటుందనే భావనలో ఈ సభ ఉంది. మీరు చేసిన సేవలను గుర్తించి, మండలి సభ్యులందరూ మిమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం నిజంగా అభినందించవలసిన విషయం. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు మీకు రావాలని కోరుకుంటూ, ఈసందర్భంగా మీకు మరొకసారి అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి.జగదీష్‌రెడ్డి: తెలంగాణ శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా మీరు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, మీ జిల్లాకి చెందిన మంత్రిగా జిల్లా ప్రజల తరఫున, నా తరఫున మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా మీరు చిన్ననాటి నుం౦ రాజకీయాలలో ఉన్నప్పటికీ, ఎన్నోసార్లు మీకు రావలసిన అవకాశాలు రాకపోయినప్పటికీ, నమ్ముకున్న పార్టీ పట్ల, నాయకత్వం పట్ల మీరు ప్రదర్శించిన విధేయత, రాజకీయాలలో ఆ జిల్లాలో ఉన్న సమీకరణాల వల్ల మీకు ఇబ్బందులు వచ్చినా, ఎంత బాధాకరమైన పరిస్థితులు ఎదురైనప్పటికీ కూడా మీరు నమ్ముకున్న పార్టీని వదలకుండా , ఆనాయకత్వాన్ని వదలకుండా మీరు వ్యవహరించిన తీరు నిజంగా అభినందనీయం. చాలా సందర్భాలలో ఎన్నో వివాదాస్పద విషయాలు వచ్చినప్పటికీ మీరు ఒక నిబద్ధతతో నిలబడిన విషయాలను మేము ముఖ్యమంత్రిగారిని వ్యక్తిగతంగా కలిసినపుడు మాట్లాడుకున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ప్రభుత్వానికి కౌన్సిల్‌లో మద్దతు తెలిపిన సందర్భం హర్షనీయం. సభ సజావుగా సాగాలని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో ఈ రాష్ట్రానికి చెందిన రెండు సభలూ కూడా ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా ఉంటేనే అది సాధ్యమవుతుందనే ఆలోచనతో ఒక నిర్ణయం తీసుకోవడం నిజంగా ముఖ్యమంత్రిగారికి ఆరోజు చాలా సంతోషం కలిగించింది. రెండు, మూడుసార్లు ఆవిషయం చెప్పారు. మీరు గతంలో ఏపార్టీలో ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకోవాలని ఒక నిర్ణయం తీసుకుని ముందుకొచ్చారు. నల్గొండ జిల్లాకి సంబంధించి ఒక మంచి నిర్ణయం, ఉపయుక్తమైన నిర్ణయం తీసుకొని ముందుకు వచ్చిన సందర్భం ఉంది. మళ్లీ అదే పద్ధతిలో తిరిగి శాసన మండలికి డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం జరిగింది. ఒకవైపు రాజకీయ పార్టీల మధ్య వివాదాలున్నప్పటికీ, కౌన్సిల్‌లో అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో, ప్రతిపక్షపార్టీలు కూడా మీకు మద్దతు తెలియజేసి మీరు ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించడమన్నది మీ వ్యక్తిత్వానికి, మీ రాజనీతిజ్ఞతకి నిదర్శనమని తెలియజేస్తూ, మిమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నికున్న ఈ శాసన మండలి సభ్యులందరికీ మన నల్గొండ జిల్లా ప్రజల తరఫున మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ నాయిని నర్సింహారెడ్డి: అధ్యక్షా, పెద్దల సభకి పెద్ద మనసుతో శాసన మండలిలో ఉన్న రాజకీయ పార్టీలన్నీ కూడా ఏకగ్రీవంగా మిమ్ములను డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నుకున్నందుకు

నిజంగా అభినందించక తప్పదు. తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ గారు సాధించిన తర్వాత మీరు కౌన్సిల్‌లో ఇచ్చిన సహకారం గొప్పది. మీ త్యాగాన్ని, మీ నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలందరూ అభినందిస్తారు. ఈరోజు మీరు మళ్లీ డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి మీ రాజకీయ నిర్ణయాలు, మీకు ప్రజలతో ఉన్న సంబంధాలే కారణం. మీరు చిన్ననాటి నుంచి ఉద్యమాలు చేస్తూ, ప్రజా పోరాటాలలో ఉండి పని చేసుకుంటూ వచ్చారు. కాబట్టి భవిష్యత్తులో మీరు మంచి మంచి పదవులు అలంకరించే అవకాశం కలగాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

డా. పల్లా రాజేశ్వరరెడ్డి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆరోజు పెద్దల సభ అయిన శాసన మండలిలో మీరు తీసుకున్న నిర్ణయం చాలా పరిణతితో కూడుకున్నది. తర్వాత ఈ పదిహేను మాసాలుగా మీరు గమనించే ఉంటారు. టిఆర్ఎస్ కార్యకర్తలు గానీ, నాయకులు గానీ మీపట్ల ఎంత గౌరవంగా, ఎంత ప్రేమ పూర్వకంగా ఉన్నారో మీరే చాలాసార్లు చెప్పి ఉన్నారు. ఈ తెలంగాణ సమాజం కోరుకున్న విధంగా, మీరు ఆరోజు చేసిన యాక్ట్‌కి, గౌరవ ముఖ్యమంత్రిగారు మీరే మళ్లీ డిప్యూటీ ఛైర్మన్‌గా ఉండాలని కోరితే, సభలో ఉన్న మిగతా మూడు పక్షాలు – టిఆర్ఎస్‌తోబాటు కాంగ్రెస్ పార్టీ, యంఐయం, బిజెపి .. అందరూ కూడా ఒక తాటిపైకి వచ్చి, డిప్యూటీ ఛైర్మన్‌గా మీరే ఉండాలని కోరడమంటే తప్పకుండా తెలంగాణ సమాజం తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించినట్లయింది. ఈ సందర్భంగా మరొకసారి అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ తలసాని శ్రీనివాసయాదవ్ : ఈరోజు పెద్దల సభ అయిన శాసన మండలికి మీరు డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు నేను మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. ఈరోజు భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. నాకు తెలిసి 25, 30 సంవత్సరాల రాజకీయ చరిత్రలో మండలి ఛైర్మన్‌గా ఒక బిసి నాయకుడు ఉండడం, డిప్యూటీ ఛైర్మన్‌గా ఒక బిసి నాయకుండడం, పవిత్రమైన శాసనసభలో ఒక బిసి నాయకుడు స్పీకర్‌గా ఉండడం ఎప్పుడూ చూడలేదు. ఈరోజు ఈ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకి, వెనుకబడిన తరగతులకు ఇస్తున్న గౌరవానికి అందరూ సంతోషపడుతున్నారు.

ఈ పెద్దల సభలో కూడా అనేకమైన కీలక నిర్ణయాలు తీసుకున్న దరిమిలా మీరు సభను సజావుగా ముందుకు తీసుకుపోవడానికి అన్ని పార్టీలకు అవకాశం కల్పిస్తూ, మన రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే కార్యక్రమంలో ప్రభుత్వానికి మీరు తోడ్పాటు అందించే విధంగా, మీరు గతంలో తీసుకున్న కార్యక్రమాలు నిజంగా అభినందనీయం. గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పిన విధంగా మీకు అనేక సంవత్సరాలుగా రాజకీయాలలో అనుభవం ఉన్నా మీకు మంచి అవకాశాలు రాలేదు. చాలా కీలకమైన కాలంలో మీరు ముందుకు వచ్చిన తీరుని చూశాం. తెలంగాణ రాష్ట్రంలో చాలా అణగారిన ప్రజానీకం, బడుగు బలహీన వర్గాలు ఒక స్థానానికి రావాలంటే చాలా ఇబ్బందికరమైన పరిస్థితులుండేవి. ఎన్ని పోరాటాలు చేసినా, ఎన్ని రకాలుగా ప్రజల మధ్య ఉన్నప్పటికీ కూడా సాధ్యమయ్యేది కాదు. కానీ మన తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత గౌరవ ముఖ్యమంత్రిగారి సారథ్యంలో ఈవిధంగా ఉన్నతమైన అవకాశాలు వెనకబడిన తరగతులకు, బడుగు బలహీన వర్గాలకు రావడమన్నది నిజంగా అదృష్టమని నేను ఈసందర్భంగా తెలియజేస్తున్నాను. మనకిచ్చిన ఈగౌరవాన్ని తప్పకుండా ప్రజల కోసం పూర్తి స్థాయిలో వినియోగిద్దాం. ఈరోజు సభలో అన్ని పక్షాలు మిమ్ములను ఏకగ్రీవంగా బలపరచినందుకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

جناب محمد سلیم (Janab Mohammed Saleem): ڈپٹی چیرمین صاحب کو میں مبارکباد دیتے ہوئے یہ گزارش کرتا ہوں کہ جیسا آپ نے اس سے پہلے بھی کونسل چلائی، اس سے اچھا حکومت تلنگانہ میں سب کو لے کر چلانے سے ایک طریقے سے اچھا رہے گا اور خوشی ہوگی۔ میں اس کے ساتھ ہی ساتھ سی ایم صاحب کو مبارکباد دیتے ہوئے اور سب ممبران کونسل کو مبارکباد دیتے ہوئے اچھا solution کر کے ایک اچھے تقرر کو ڈپٹی چیرمین کے عہدہ پر فائز کرنے کے لئے میں مبارکباد دیتا ہوں۔ اس کے ساتھ خدا حافظ۔

శ్రీ పూల రవీందర్: అధ్యక్షా, ఈరోజు కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైన శుభ సందర్భంలో తమరికి హృదయపూర్వకంగా శుభాభినందనలు తెలియజేస్తున్నాను. ఒక విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన మీ జీవితంలో అంచలంచెలుగా ఎదుగుతూ, గ్రామ సర్పంచు నుంచి నేటి స్థాయికి వచ్చారు. మూడు దశాబ్దాల పాటు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, పోరాటాలు చేసి, ఆ తర్వాత కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికై వచ్చిన తరుణంలో, గౌరవ ముఖ్యమంత్రిగారు 14 సంవత్సరాలు కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్న సందర్భంలో, ఒక కీలకమైన సమయంలో కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. మీరు ఆరోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తోడ్పాటుగా నిలబడడానికి ఒక మంచి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈరోజు మన తెలంగాణ ముఖ్యమంత్రిగారి దూరపు ఆలోచనతో, ఒక మంచి నిర్ణయంతో, వారి సహకారంతో, గౌరవ సభ్యుల సహకారంతో యునానిమస్‌గా మీరు ఈరోజు డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు అభినందనలు తెలియజేస్తూ, గౌరవ ముఖ్యమంత్రిగారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను, థ్యాంక్యూ.

శ్రీ ఉల్లోళ్ల గంగాధర్‌గౌడ్ (శాసనసభ నియోజకవర్గం): ఈరోజు మీరు కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక

కావడానికి అన్ని పార్టీలు సహకరించిన సందర్భంలో మీకు నా తరుపున అభినందనలు తెలియజేస్తున్నాను. గత ఉమ్మడి రాష్ట్రంలో మీరు మూడు సంవత్సరాలు పని చేసినపుడు, బడుగు బలహీన వర్గాలు, రైతాంగం, ఇతర వర్గాలకు సంబంధించిన విషయాలపై సానుకూలంగా చర్చలు కొనసాగించడం జరిగింది. అటువంటి సందర్భాలు మేము చాలా చూశాం. రాబోవు రోజుల్లో గౌరవ ముఖ్యమంత్రిగారి నేతృత్వంలో, తెలంగాణ ప్రభుత్వ పరిపాలనలో, బడుగు బలహీన వర్గాలకు, రైతాంగం, ఇతర వర్గాలకు సంబంధించిన విషయాలపై పూర్తి స్థాయిలో సభలో చర్చ జరిగేలా, న్యాయం జరిగేలా చూస్తారని భావిస్తూ మరొకసారి మీకు అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్: గౌరవనీయులైన శాసన మండలి ఛైర్మన్ శ్రీ స్వామిగౌడ్‌గారికి, గౌరవ పెద్దలు, ముఖ్యమంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీ హరీష్‌రావు గారికి మరియు సభలో ఉన్న గౌరవ సభ్యులందరికీ శాసన మండలి ఉపాధ్యక్షపదవికి నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మరియు నా గురించి కొన్ని మంచి మాటలు చెప్పినందుకు మీకు కృతజ్ఞతలతో ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రత్యేకించి మా నాయకుడు, ముఖ్యమంత్రిగారు నాపై విశ్వాసంతో నన్ను ఈ పదవికి ఎంపిక చేసినందుకు వారికి సర్వదా కృతజ్ఞుడనై ఉంటాను. ఈ సభ ఔన్నత్యాన్ని పెంచడానికి, సభలో ప్రజా సమస్యలపై చర్చ వచ్చేలా నా వంతు కృషిచేయగలనని మీఅందరికీ హామీ ఇస్తున్నాను. డెప్యూటీ ఛైర్మన్‌గా తు.చ. తప్పకుండా సభ నియమావళికి మరియు ఇతర నిబంధనలకి కట్టుబడి, మీ అందరి మన్ననల్ని పొంది మన తెలంగాణ రాష్ట్రశాసన మండలికి మంచి పేరు తీసుకొచ్చి, ఈ సభద్వారా రాష్ట్ర ప్రజలకి నా సేవలను అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇస్తూ, మీకందరికీ మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## III. లఘు చర్చ

### 1. విద్యుత్ సరఫరా గురించి (కొనసాగింపు)

ఇప్పుడు విద్యుత్ సరఫరాపై లఘు చర్చ. యాదవరెడ్డిగారు మాట్లాడవలసిందిగా కోరుతున్నాను.

12.40 మ. శ్రీ కొంపల్లి యాదవరెడ్డి: అధ్యక్షా, విద్యుత్ సరఫరా విషయంపై మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ విద్యుచ్ఛక్తి రంగం కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి ఒక అగ్ని పరీక్షగా ఉన్న సమయంలో ప్రియతమ ముఖ్యమంత్రి గారు స్వయంగా వందల గంటలు, వారి సమయాన్ని వెచ్చించి అధికారులతో కూర్చొని ఒక బృహత్తరమైన ప్రణాళికతో ప్రస్తుతమున్నటువంటి విద్యుచ్ఛక్తిని ఏరకంగా వాడుకోవాలి, ఏరకంగా దానిని ఆదా చేయాలనే ఉద్దేశ్యంతో వారు చేపట్టిన కార్యక్రమాలు మనకు ఒక బాసటగా నిలిచి మన రాష్ట్రాన్ని విద్యుత్ ఇబ్బందులు లేనే విషయానికి తీసుకువచ్చినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈ పరిస్థితులు తెలంగాణ ప్రాంతానికి రావడానికి అసలు కారణాలేమిటనేది అన్వేషించినప్పుడు పూర్తిగా దానిగురించి చెప్పలేము గానీ, ముఖ్యంగా తెలంగాణ ఉమ్మడి రాష్ట్రంగా కాకముందు హైదరాబాద్ రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి సరఫరా అనేది చాలా మెరుగుగా ఉండేది. ఉమ్మడి రాష్ట్రం అయిన తరువాతనే మనకు చీకటి రోజులు రావడం దురదృష్టకరం. మొదట హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్నప్పుడు 1910లో మొట్టమొదటిసారి ఈ విద్యుచ్ఛక్తి తయారు చేయడం జరిగింది. అప్పటివరకు ఆంధ్ర ప్రాంతం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండి కూడా వారు విద్యుత్ ఏరకంగా ఉంటుందనేది చూసిన రోజులు కావు. మన దగ్గర విద్యుచ్ఛక్తి తయారు చేసిన 12సంవత్సరాల తరువాత ఒరిస్సా రాష్ట్రంతో కలిసి ఒక ఉమ్మడి ప్రాజెక్టు చేసిన తరువాతనే వారికి విద్యుత్ విషయాలు తెలియడం జరిగింది. కానీ, మన దగ్గర మొదటిసారి హుస్సేన్ సాగర్ దగ్గర నిర్మించిన ఈ ప్రాజెక్టు రెసిడెన్సీ రోడ్ అనే ప్రాంతానికి సరఫరా చేయడం జరిగింది. ఆ తరువాత 1915వరకు ఈ హైదరాబాద్ నగరమంతా వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగింది. కానీ, ఉమ్మడి రాష్ట్రం అయిన తరువాత మనం ఎన్నైతే ప్రాజెక్టులు నెలకొల్పడానికి తయారు చేశామో వాటితో 4,617మెగావాట్ల విద్యుచ్ఛక్తి తయారయ్యే ప్రాజెక్టులు నిర్మాణమైతే మనకు ఈరోజు ఈ పరిస్థితి ఉండేది కాదు.

దీనికి ముఖ్యమైన కారణాలు మనం అన్వేషించినప్పుడు APSEB అనే సంస్థ 1959లో ప్రారంభించడం దానికి 13మంది ఛైర్మన్‌లుగా వ్యవహరించినటువంటి వ్యక్తుల్లో కేవలం ఇద్దరు వ్యక్తులు మాత్రమే తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు ఉండడం జరిగింది. వారు కూడా కేవలం 765రోజులు అధ్యక్షులుగా ఉండడం జరిగింది. దానిలో డైరెక్టర్లుగా పని చేసినటువంటి 53మందిలో కేవలం 10మంది మాత్రమే తెలంగాణ వారు ఉండేవారు. వీరందరి ఆధిపత్యంతో మన దగ్గర ఏర్పాటు చేయాలనుకున్నటువంటి ప్రాజెక్టులు కూడా వాళ్ల ప్రాంతానికి తరలించుకుపోవడం గుమనార్హం.

1969లో తెలంగాణాలో జరిగిన తెలంగాణ ఉద్యమం తరువాత, ఎప్పుడైనా ఈ రాష్ట్రం విడిపోయేదే అనే నిర్ణయానికి ఆంధ్ర పాలకులు వచ్చి ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఇక్కడి ప్రాజెక్టులన్నీ కూడా ఆంధ్ర ప్రాంతానికి తరలించుకుపోవడం జరిగింది.

తెలంగాణ ప్రాంతంలోని ఖమ్మం జిల్లాలోని మణుగూరులో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు

ప్రణాళికవేయడం జరిగింది. కానీ, దానిని విజయవాడకు తరలించారు. తరలించడానికి కారణాలేమిటని ఎవరినీ అడిగినప్పటికీ కారణాలు ఏమాత్రం చెప్పకుండా పైగా దానికి కావలసిన బొగ్గు మాత్రం మణుగూరు నుండే తీసుకుపోవలసి వచ్చేది. దీనిపై బొగ్గు రవాణా చేసేందుకు కూడా చాలా ఖర్చు అవుతుంది. దీనిని ఇక్కడినుండి అక్కడికి ఎందుకు తరలించారని అడిగినప్పుడు దానికి సమాధానం చెప్పేటువంటి వ్యక్తి కూడా లేకపోయారు. ఈరకంగా మన దగ్గర ఏర్పాటు చేద్దామని అనుకున్న ప్రాజెక్టులన్నీ అక్కడికి తరలించడం జరిగింది. ఇది కూడా చాలా గమనార్హం.

తరువాత గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులు కూడా 2001-02లో ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు శంకర్‌పల్లిలో 1400మెగావాట్ల కెపాసిటీతో ప్రాజెక్టును నిర్మాణం చేయాలనుకొని నిర్ణయం తీసుకొని అక్కడా land acquire చేసి, అక్కడ ప్రిలిమినరీ పనులు మొదలైనప్పటికీ దానిని పూర్తి చేయకుండా, తరువాత ఆంధ్రా ప్రాంతంలో ఉన్నటువంటి 7 గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులకు లింకు ఇవ్వడమనేది మొత్తం ప్రజానీకం గుర్తించడం జరిగింది.

ఇన్ని కష్టాలకు గురైన ఈ ప్రాంతాన్ని ఒక నిర్మితమైన కార్యక్రమంగా తీసుకొని మన ప్రాంతానికి విద్యుచ్ఛక్తిని ఏవిధంగా అందించాలనే ఆలోచనతో మన గౌరవ ముఖ్యమంత్రి మరియు గౌరవ మంత్రివర్యులు చాలా రోజులుగా కష్టపడి దాదాపు లక్ష కోట్ల పెట్టుబడితో కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకోవడం జరిగింది. అవన్నీ కూడా పబ్లిక్ రంగ సంస్థలు కావడం గమనార్హం.

ఈ ప్రాంతానికి విదుచ్ఛక్తి చాలా అవసరమనేది గమనించి ఇక్కడ లక్ష కోట్ల రూపాయలతో ప్రాజెక్టుల నిర్మాణానికి తలపెట్టిన ప్రభుత్వానికి మరొక్కసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇన్ని ఇబ్బందులున్నప్పటికీ మనం ముందుకు సాగుతున్నాము. కానీ, ఇవన్నీ మనం పకడ్బందీగా చేస్తున్నామనే సంతోషం ఒకుక్క ఉన్నప్పటికీ ఇంకా కొన్ని చిన్న, చిన్న అవకతవకలు జరుగుతున్నాయి. అవి మంత్రిగారి దృష్టికి తీసుకు రాదలచుకున్నాను. ఏమిటంటే, ఈమధ్యన మేము జిల్లా సమీక్షా సమావేశాలకు గానీ, జనరల్ బాడీ సమావేశాలకు వెళ్లినప్పుడు ఆ సమీక్షల్లో ఎలక్ట్రిసిటీ తరఫున అధికారులు కాకుండా కేవలం లైనుమెన్‌లు వచ్చేవారు. అది చాలా బాధాకరమైన విషయం. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో నాకు దాదాపు ఐదారు సార్లు ఎదురైన విషయాన్ని మంత్రిగారి దృష్టికి తీసుకురావడం జరుగుతున్నది. మంత్రిగారు దానిపై ఏవిధమైన చర్యలు తీసుకుంటారో ఆలోచించాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

అదేరకంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు క్రిందికి జారిపోయి అకస్మాత్తుగా ప్రమాదాలు ఏర్పడినప్పుడు ఎవరినీ ప్రశ్నించినా అసలు సిబ్బంది లేరు, మెటీరియల్ లేదనే సమాధానమే వస్తోంది. కానీ, వాటిని సరిచేయడానికి చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. అలాగే విద్యుత్ తీగలు క్రిందకు వేలాడడానికి కారణాలు ఏమిటనేది పరిశీలిస్తే, ఒక స్తంభం నుండి ఇంకొక స్తంభానికున్న దూరం ఎక్కువగా ఉండడం వల్ల వైర్లు క్రిందకు వేలాడడం జరిగిందని తేలింది. కాబట్టి, గౌరవ మంత్రివర్యులు వీటిమీద కొద్దిగా అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి వాటిమీద చర్చించి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని మీద్వారా మంత్రివర్యులను కోరుకుంటున్నాను.

విద్యుత్ రంగాన్ని ఇంత ఛాలెంజ్‌గా తీసుకొని మనకు కలుగుతున్నటువంటి ఇబ్బందులను దూరం చేసినటువంటి ప్రభుత్వానికి మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

SRI SYED AMINUL HASAN JAFRI: Sir, the Hon'ble Energy Minister has given a very detailed account of the power situation in the State. I would like to point out that there is not a single reference to the twin cities of Hyderabad and Secunderabad. The twin cities of Hyderabad and Secunderabad are being served by the Hyderabad Metropolitan Zone as also the Rangareddy Zone. These two zones come under the purview of the Greater Hyderabad Municipal Corporation. I would like to point out that the demand for power in the Metro Zones and the Rangareddy Zones i.e. in the GHMC areas is around 2000 MW. It ranges between 1800 and 2000 MW. Almost 18 to 20 Lakhs power consumers are located in the GHMC Area. So, the power consumption in the GHMC area, I feel it could be around 25 millions to 28 million units per day. Last year, immediately after formation of Telangana State, we had faced severe power crisis in the twin cities of Hyderabad and Secunderabad and other parts of the State. But, fortunately, due to the efforts of our Hon'ble Chief Minister as also the Government of Telangana, the TS GENCO, the TS Transco, the two DISCOMS, we were able to overcome the crisis and this year, fortunately, during this summer, there have been very few interruptions and very few power-cuts.

The point is, in the twin cities of Hyderabad and Secunderabad, power infrastructure is pretty old. It needs rejuvenation and modernization, immediately. I would like to point out that with the help of Japanese Bank for International Corporation,

which has been renamed as Japanese International Corporation Agency (JICA), one project was taken-up for strengthening the transmission net-work and distribution net-work in the twin cities of Hyderabad and Secunderabad. That project was started in the year 2007 and it was supposed to be completed within FOUR years, but that project is being dragged on. I do not know the reasons for the delay in the early completion of the project. Basically, that project aims at strengthening the distribution net-work and transmission net-work and it envisages power projects. At present, I think, there are only 4 Nos. of 220 KV sub-stations which bring power to the twin cities of Hyderabad and Secunderabad and apart from them, only 11 Nos of 132 KV Sub-stations are there.

When the demand in the twin cities of Hyderabad and Secunderabad and adjoining areas with the location of I.T. Industries, BPO Units, with new projects coming-up with ITIR also being proposed in the area, I think, the demand for the twin cities of Hyderabad and Secunderabad in GHMC area or in the Metropolitan areas is increasing day by day and annually, the increase could be 15 to 20% in the demand.

What I suggest is, there is a need for the revival of the Hyderabad Metropolitan combined cycle power project, which was to be taken up by the NTPC earlier and which, my colleague Sri Yadava Reddy has referred to.

Initially that project was to be based on NAFTA and subsequently, they wanted to change it to gas. But, with non-availability of the gas, it should be converted in to a Thermal Power project and it can be located at Shanakarpally, where the land acquisition was done and preliminary works were also completed there.

There is a need for dedicated a power project to serve the metropolitan regions of Hyderabad. I would suggest that when the technology upgradation is there and in other countries, 800 KV sub-stations are being commissioned, we can also take-up 400 KV sub-stations and 800 KV sub-stations to ensure that uninterrupted power supply, augmented power supply is provided to the Hyderabad Metropolitan regions. I would like to know from the Hon'ble Minister as to the causes for the delay in implementation of transmission and distribution net-work project which was assisted by JICA and when it is going to be completed. One of the reasons for this is that the land is not being provided by the civic agency and the different Government agencies for setting-up the sub-stations which are envisaged under this project. So, in the Southern part of Hyderabad as also in the Western part, several sub-stations could not be set-up. When the Swachch Hyderabad campaign was taken-up by the Hon'ble Chief Minister, three Committees were formed to look into the bottlenecks of the issues concerning Hyderabad. One of the sub-committees i.e. all-party Committee, which was concerned with the power situation in Hyderabad, they had come up with the report and they had suggested 2-3 major things. The first is, the project for shifting of the transmission lines in the residential areas, so that they do not cause problem. The Committee had identified about 728 KM of 33 KV, 11 KV and the Low Tension lines in Hyderabad Metropolitan zone and Rangareddy District zone, which need to ensure the safety of the residents.

We have come across several instances of electrification taking place in different parts of the localities due to old wiring, due to old transmission lines, old supply lines, old distribution transformers, which are working in these places. So, the total cost of shifting these lines has been estimated at Rs.248.90 Crores. I would request the Hon'ble Minister to ensure that the funds are released for taking-up the work for shifting these lines and to maintain proper supply of power, the authorities have also identified the location sites for construction of 115 sub-stations of 33/11 KV, 132/33 KV lines. Sooner the lines are provided for these sub-stations, then, these sub-stations could be commissioned early and the problem which is related to the old transmission and distribution net-work in the twin cities of Hyderabad and Secunderabad could be overcome.

I would suggest that the power Department tackles this. The Energy Department as also the DISCOMS as well as TRANSCO should coordinate with GHMC and other Government agencies to acquire the land for setting up the sub-stations. I would also request the Energy Minister to ensure that the dedicated power project for Hyderabad is revived at the earliest. Thank you Sir.

**1.00 మ.** శ్రీ పూల రవీందర్: అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం కొరకు ఉద్యమం తీవ్ర స్థాయిలో జరుగుతున్న సందర్భంలో, అప్పటి ముఖ్యమంత్రిగారు తెలంగాణ వచ్చినట్లైతే మీరు చీకటిలోనే ఉండిపోతారు, కరెంటుపై ఆధారపడి బోర్ల ద్వారా వ్యవసాయం చేసే రైతులు ఇక్కట్ల పాలవుతారని, ఈ రాష్ట్రం దేనికీ పనికి రాకుండా పోతుందని జోస్యం చెప్పడం జరిగింది. వారు అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా, ఎన్ని గంటలు కరెంటు ఇచ్చినదీ మనందరికీ తెలుసు. రైతు పొలంలో మోటరు పెట్టి, ఇంటికి వచ్చే లోపు కరెంటు

ఉండదు. కరెంటు వచ్చిన తరువాత, రైతు మళ్లీ పొలానికి వెళ్లి, మోటరు పెట్టాలి. పగలు రెండు గంటలు, రాత్రి పూట రెండు, తెల్లవారుఝామున మూడు గంటలు ఈ మాదిరిగా మూడు,నాలుగు విడతల్లో కరెంటు సరఫరా ఉండేది. ఆ పరిస్థితులలో, రాష్ట్ర విభజన జరిగింది. గత ప్రభుత్వాలు ఏ నాడూ తెలంగాణ రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఎంతో పోరాడి మనం రాష్ట్రం సాధించుకున్నాము. తెలంగాణ ప్రాంతంలో రైతుల స్థితిగతులు, ప్రజల తాగునీటి అవసరాల గురించి మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్‌గారు ఆ నాడు ఉద్యమ కాలంలో మొత్తం పది జిల్లాలు తిరిగి, పూర్తి అవగాహన చేసుకున్నారు. వారి అకుంఠిత దీక్ష కృషిఫలితమే ఈ నాడు మన PLF 74% నుండి 80శాతానికి వృద్ధి చెందింది. అలాగే T&D నష్టాన్ని 16.83 నుండి 15.83శాతానికి తగ్గించుకున్నాము. విద్యుత్ అంశానికి ఈ రాష్ట్రం ఎంత ప్రాధాన్యతను ఇస్తుందనేదానికి ఇదే నిదర్శనంగా మనం భావించవచ్చు.

ఇతర రాష్ట్రాల నుండి 3300మెగావాట్ల విద్యుత్తును కొనుగోలు చేసి, రైతులకు, పరిశ్రమలకు, గృహావసరాలకు వినియోగించుకోవడం జరిగింది. అధికారంలోకి వచ్చిన వెంటనే మణుగూరులో 1080మెగావాట్ల ప్రాజెక్టు, కొత్తగూడెంలో 800మెగావాట్ల ప్రాజెక్టు, మరియు దామెరచర్ల ప్రాజెక్టునుండి 4000మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కొరకు ప్రణాళికలు చేసి, శంకుస్థాపనలు జరిపారు. గతంలో మాదిరిగా పునాది రాళ్లు వేసి, విడిచిపెట్టలేదు. భూ సేకరణ పూర్తిచేసి, అటవీ శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల అనుమతులు పొందటం జరిగింది. తెలంగాణ రాష్ట్రాన్ని విద్యుత్తు విషయంలో మిగులు రాష్ట్రంగా తీర్చిదిద్దడం కొరకు, దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టు నల్గొండ జిల్లాలో ప్రారంభించి, వాటి పనులను ప్రతి నిత్యం స్వయంగా మన గౌరవ ముఖ్యమంత్రిగారు పర్యవేక్షిస్తున్నారు. వీటికి సంబంధించిన పనులు ఎంత వేగంగా పూర్తైతే, మనం అంత త్వరగా స్వయం సమృద్ధిని సాధించుకోగలుగుతామని వారు భావిస్తున్నారు.

విద్యుత్ విషయంలో ఎక్కడా, ఎవరూ ఇబ్బంది పడకుండా ఉండాలని, తాత్కాలిక ఏర్పాటులో భాగంగా ఛత్తీస్‌ఘడ్ నుండి కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తిచేసుకోబోతున్నాము. తద్వారా ఒక 1000మెగావాట్ల విద్యుత్తు మనకు అందుబాటులోకి రానుంది. ఒకరి పైన ఆధారపడకుండా, శాశ్వతమైన ప్రణాళికలు రచించి, పర్మనెంట్ విద్యుత్ ప్రాజెక్టులకు మన ముఖ్యమంత్రిగారు రూపకల్పన చేస్తున్నారు. ఇంతకుముందు మాట్లాడిన గౌరవ సభ్యులు మీరు ఒక్క యూనిట్‌నన్నా ఉత్పత్తి చేసారా అని అడిగారు. జనరేట్ చేయడం ఎంత ముఖ్యమో, మన దగ్గర ఉన్న విద్యుత్తును ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవడమూ అంతే ముఖ్యం. ఈ విషయమై నిరంతరం విద్యుత్ శాఖ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని అజమాయిషీ చేస్తూ, ఉన్న కరెంటులోనే రైతులకు ఏడు గంటలు అందించాలని ముఖ్యమంత్రిగారు ఆదేశించారు. వీలైతే తొమ్మిది గంటల పాటు అందించాలని వారు తపన పడుతున్నారు. ఈ విధంగా పవర్ విషయంలో గౌరవ ముఖ్యమంత్రిగారు, మంత్రివర్యులు శ్రీ జగదీష్ రెడ్డిగారు, అహర్నిశలు కృషి చేస్తూ, విద్యుత్ సమస్యను ఎదుర్కోవడానికి ఎంతగానో ప్రయత్నించడం అభినందనీయం.

కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత సీలేరు నుండి, కృష్ణపట్నం నుండి మనకు రావలసిన విద్యుత్‌వాటా 390మెగావాట్లు రాకుండా అడ్డుకున్నారు. అటువంటి క్లిష్టపరిస్థితులలో ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా, ఈ రాష్ట్ర ప్రజలు, రైతులు ఇబ్బంది పడకుండా, పట్టుదలతో సమస్యను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఈ దిశలో భూపాలపల్లి, జైపూర్ ప్రాజెక్టులకు సంబంధించి పనులు ముమ్మరం చేశారు. ఈ అక్టోబర్ నెల నుండి వచ్చే మార్చి వరకు 550మెగావాట్ల విద్యుత్తును సర్దుబాటు చేసుకోవడానికి ఏర్పాటు చేయబడింది. అన్ని వర్గాలవారికి నాణ్యమైన విద్యుత్తును అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయడం హర్షణీయం. ప్రభుత్వం ఒక నూతన పారిశ్రామిక విధానం కూడా ప్రకటించడం చాలా సంతోషకరం. కొత్త పరిశ్రమలు ఏర్పడినట్లైతే, పదిమందికి ఉపాధి దొరుకుతుంది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రిగారిని అడిగేది ఏమిటంటే గత ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్తును అందించింది. ఈ నాడు మన ప్రభుత్వం కూడా అదే విధంగా ఇస్తున్నది. ఇందుకొరకు గాను ప్రభుత్వం ఎంత డబ్బును వెచ్చిస్తున్నదో తెలియచేయవలసిందిగా కోరుతున్నాను. అదే విధంగా గతంలో ఎన్ని సబ్ స్టేషన్లు ఉండేవి, ఇప్పుడు మన ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పదిహేను నెలల కాలంలో కొత్తగా ఎన్ని సబ్‌స్టేషన్లు నెలకొల్పబడినాయో తెలియచేయవలసిందిగా కోరుతున్నాను. ఇంకా అదనంగా కొత్త సబ్‌స్టేషన్లు నెలకొల్పడానికి ఏమైనా ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయా తెలపవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

మన గౌరవ ముఖ్యమంత్రిగారు సోలార్ విద్యుత్తు ద్వారా మన రైతులకు నాణ్యమైన కరెంటును అందించే ఒక మంచి ఆలోచన చేస్తున్నారు. ఆ విషయమై ఎంత వరకు కార్యాచరణ రూపొందించారో తెలుపవలసిందిగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. సోలార్ విద్యుత్తును వ్యవసాయ రంగానికే కాక, నగరాలలో ఉన్న పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లలో కూడా సోలార్ పవర్‌ను ప్రోత్సహించినట్లైతే, ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నేను భావిస్తున్నాను అధ్యక్షా. కాబట్టి

సోలార్ పవర్ ద్వారా మనం ఎన్ని మెగావాట్ల విద్యుత్తును పొందడానికి ప్రాజెక్టులకు అనుమతులు ఇస్తున్నామో తెలియచేయవలసిందిగా గౌరవ విద్యుత్ శాఖ మంత్రిగారిని మీ ద్వారా కోరుతూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కర్నె ప్రభాకర్ ః అధ్యక్షా, విద్యుత్తు పైన జరుగుతున్న స్వల్పకాలిక చర్చలో మాట్లాడడానికి అవకాశమిచ్చినందుకు మొదటగా మీకు నా ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను. సమైక్య రాష్ట్రంలో విద్యుత్తు పూర్తిగా విస్మరించబడినటువంటి అంశము. దాదాపు 58 సంవత్సరాలు, సమైక్య పాలనలో, తెలంగాణ రైతు కరెంటు విషయంలో చాలా అన్యాయానికి గురైనాడు. ఏ రోజు, ఏ గంట కరెంటు లభ్యమవుతుందో తెలియని అయోమయ స్థితిలోకి నెట్టివేయబడినాడు. పంటకు సరిపడ కరెంటు పొందగలిగే భాగ్యానికి నోచుకోలేక పోయాడు. చివరికి ఈ నగరంలో నివసిస్తున్న పౌరులకు కూడా విద్యుత్ కోతలతో అలాంటి అనుభవాలే ఎదురవుతుండేవి.

పరిస్థితి ఎంత తీవ్ర సంక్షోభంలోకి మారిందంటే ప్రతి సంవత్సరం జరిగే ఈ ఉభయ సభలకు వస్తున్న సభ్యులు కరెంటు సమస్యల వల్ల, లాంతర్లు పట్టుకుని సమావేశాలకు చీకట్లో నడుచుకుంటూ వచ్చిన సందర్భాలు మనం చూసాము. ఆ నాడు కరెంటు గురించి టిఆర్ఎస్ శాసన సభ్యులు ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రిగారిని కలిసి, తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోమని కోరుతూ, ధర్నా చేస్తున్న సమయంలో, వారు మన శాసన సభ్యులను నెట్టుకుంటూ, తొక్కుకుంటూ వెళ్లిన సందర్భం మాకు ఇంకా గుర్తే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందని నిర్ణయం వెలువడిన తరువాత, ఉభయ సభల్లో తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, తెలంగాణకు చెందిన జర్నలిస్టులు ఒక సమావేశం ఏర్పాటు చేసి, నేటి మన ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్ గారిని ఇంటర్వ్యూ చేస్తున్న సందర్భంలో, ఒక విలేఖరి తెలంగాణ రాష్ట్రం రాబోతున్న తరుణంలో, విద్యుత్తు లోటును మీరు ఏ విధంగా భర్తీ చేయబోతున్నారని అడిగినప్పుడు, వారు ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో మేము ఈ సమస్యను ఎదుర్కొంటామని చెప్పారు. చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే ఏదీ అసాధ్యం కాదని వారు చెబుతూ, సంవత్సరం లోపే ఈ సమస్యను అధిగమిస్తామని చెప్పిన విషయాన్ని ఈ సభకు గుర్తుచేస్తున్నాను అధ్యక్షా.

ఆ ప్రయత్నంలో భాగంగానే, అధికారం చేపట్టిన వెంటనే విద్యుత్తు పై దృష్టి పెట్టారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలలో విద్యుత్తు కొరకు ప్రైవేట్ పార్టీలపైన ఆధారపడి, ప్రజలకు చౌకధరకు కరెంటును ఇవ్వలేని దుస్థితిని మనం చూసాము. కాని ఈ ప్రభుత్వం పూర్తిగా ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలోనే కరెంటును ఉత్పత్తి చేయాలని ఆలోచిస్తూ, ఆ వైపు అడుగులు వేస్తున్న సందర్భంలో, ఈ పదహారు నెలల కాలంలోనే ప్రజలు కరెంటు కోత లేని మంచి రోజులు అనుభవించి, ఈ ప్రభుత్వాన్ని మనసారా అభినందించారు. రైతులకు పూర్తిగా పగటిపూటనే తొమ్మిది గంటల కరెంటును ఇస్తామని చెప్పడం, తెలంగాణ రైతును అధైర్యం నుండి బయటకు లాగి, వారికి వ్యవసాయం పట్ల ఉత్సాహాన్ని, భరోసాను కలిగించే ప్రయత్నమేనని మీ ద్వారా ఈ సభకు తెలియచేస్తున్నాను. ఇందుకు గాను సంబంధిత శాఖ అధికారులను, గౌరవ మంత్రిగారిని, అనునిత్యం వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమం గురించి ఆలోచనలు చేస్తున్న గౌరవ ముఖ్యమంత్రిగారిని మనం అభినందించవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను.

తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు పద్నాలుగు సంవత్సరాల కాలంలో చెయ్యని ఉద్యమాలు, ధర్నాలు, రాస్తారోకోలు లేవు అధ్యక్షా. రైతుల పక్షాన మేము మాట్లాడుతుంటే, అరెస్టులు చేసారు. నాణ్యమైన విద్యుత్తు గురించి పోరాటం చేస్తే, ఆ నాటి పాలకులు సహించలేక పోయారు. ఈ రోజు విద్యుత్తు మీద చర్చ జరుగుతుంటే, అందులో పాల్గొనవలసింది పోయి, రాద్ధాంతం చేసారు. చిల్లర మల్లర రాజకీయాలు చేసారు. ప్రజా సమస్యల్ని పక్కదోవ పట్టించారు.

(ఈ దశలో గౌరవ చైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

రెండు రోజుల పాటు రైతుల గురించి సభలో చర్చ జరిగింది. చాలా సుదీర్ఘమైన చర్చల వల్ల, అనేక సమస్యల పరిష్కారానికి వారి నుండి మంచి సూచనలు రావలసి ఉంది. కాని ప్రతిపక్షాలు ఆ రకంగా ఆలోచన చేయకుండా, రాజకీయాలు చేసారు. ఎంతో క్లిష్టంగా ఉన్న విద్యుత్తు రంగాన్ని ప్రభుత్వం చక్కదిద్ది, దారిలో పెట్టి ప్రభుత్వం ప్రజల మెప్పు పొందుతుంటే, కనీసం వారు ఈ చర్చలో పాల్గొనకుండా, గందరగోళం సృష్టించారు. వారు రైతుల పక్షాన మాట్లాడే హక్కు కోల్పోయారు కాబట్టే, రెండు సభల్లో కూడా అనవసరమైన రాద్ధాంతం చేసే ప్రయత్నం చేసారు. ప్రభుత్వం తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకుంది. గతంలో భూపాలపల్లి, జైపూర్ ప్రాజెక్టులను వారు ప్రారంభిస్తే, మూడు సంవత్సరాలు గడిచినా, పురోగతి లేదు. రైతుల గురించి పట్టించుకునే నాధుడు లేని సమయంలో, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే, విద్యుత్తుపై పూర్తి స్థాయి దృష్టి పెట్టి, వినియోగంలోకి తీసుకువచ్చే దిశగా కృషిచేసింది. ఒకవేళ ఈ ప్రభుత్వమే అధికారంలో లేకపోయి ఉంటే, ఈ రాష్ట్రముఖ్యమంత్రి స్థానంలో మరొకరు ఉండి ఉంటే, మరొక ఐదారు సంవత్సరాల వరకు ఈ ప్రాజెక్టులు ఈ స్థాయికి వచ్చి,ఉండేవి కావు అని విద్యుత్తు రంగ నిపుణులు చెబుతున్నారు. రాబోయే ఆరేడు నెలల లోపు విద్యుత్తు ఉత్పత్తి

జరుగుతుందని చాలా స్పష్టంగా గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పడం సంతోషకరం. వారికి మనస్ఫూర్తిగా నా ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను.

1.20 ప. కరెంటు వస్తోంది గానీ గ్రామీణ ప్రాంతాలలో అస్తవ్యస్థమైన వ్యవస్థని సరిదిద్దడం కోసం యుద్ధప్రాతిపదికమీద ఈరోజు సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. ట్రాన్స్‌ఫార్మర్స్ ఎరెక్షన్ జరుగుతోంది. కానీ మా మిత్రులు యాదవరెడ్డిగారు చెప్పినట్లు అక్కడక్కడ క్రింది స్థాయిలో ఉన్న ఎ.ఇ.లు, ఎ.డి.ఇ లాంటి అధికారుల్లో కొంత అలసత్వం కనిపిస్తోంది. దానికి మనం సిగ్గుపడవలసిన అవసరం లేదు. చర్చించుకుంటే ఏమి చేయాలో ఆలోచన వస్తుంది. ముఖ్యంగా విద్యుత్ శాఖామంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు, మీరు అహర్నిశలు ఈ పనుల్లో ఉన్నారు, దానికి ఒక ప్రత్యేకమైన అధికారిని వేసి పరిస్థితిని చక్కదిద్దండి. పూర్తిగా ఇదే పని మీద ఉంటూ, 24గంటలూ నిరంతరాయంగా కరెంటు ఇవ్వాలని మీరు ప్రయత్నం చేస్తుంటే, ఆ సామర్థ్యానికి కావలసిన లైనులు కావచ్చు, ట్రాన్స్‌ఫార్మర్స్ కావచ్చు, ఈ విషయానికి సంబంధించి గ్రామీణ ప్రాంతాలలో అంత స్పీడుగా పని జరగడం లేదనే విమర్శ కనిపిస్తోంది. అది జరగకుండా చేస్తే ఈ ప్రభుత్వం చేస్తున్న కృషికి మంచి ఫలితం వచ్చే అవకాశం ఉంది, రైతులు అభినందించే అవకాశం ఉంటుంది కాబట్టి ఆవైపు ఆలోచిస్తే బాగుంటుంది.

ఎండా కాలం రాగానే కరెంటు తగ్గిందని చెప్పగానే గతంలో ఇందిరా పార్కు దగ్గర ధర్నాలు చేసే వాళ్లు. రైతులే కాదు, చాలా ఆశ్చర్యకరంగా పారిశ్రామికవేత్తలు కూడా కరెంటు కావాలని ధర్నాలు చేసిన సందర్భాలను మనం చూశాం. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇందిరా పార్కు దగ్గర ధర్నాలు బంద్ అయ్యాయి. పారిశ్రామికవేత్తలు మూసేసిన తమ పరిశ్రమలను బాగు చేసుకుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరంతరాయంగా కరెంటు ఇస్తున్నందు వల్ల తిరిగి తమ పరిశ్రమలను పునరుద్ధరించుకునే కార్యక్రమంలో ఉన్నారు. కరెంటు లేక పరిశ్రమలు మూత పడడం వల్ల ఉద్యోగాలు కోల్పోయిన యువకులు తిరిగి ఉద్యోగాలు పొందుతున్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల మూతపడిన వేల పరిశ్రమలు మళ్లీ పునరుద్ధరించుకునే అవకాశం వచ్చింది. నిరుద్యోగయువత తరుపున నాణ్యమైన కరెంటుని ఇస్తున్న ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను.

తెలంగాణ ప్రాంతంలో రైతు ఏదైనా పంట వేసుకుంటే కరెంటు వచ్చిందని అర్థరాత్రి పొలాలకు వెళితే, ఆ రాత్రి పూట తేళ్లు కరచి, పాము కరచి చనిపోయిన సందర్భాలున్నాయి గతంలో. 14సంవత్సరాలుగా మేము ఉద్యమంలో పాల్గొంటూ వచ్చాం. మీరు కూడా ఉద్యమనాయకుడిగా కరెంటు గురించి అనేక సందర్భాలలో మాట్లాడారు. మీరు కూడా మారుమూల ప్రాంతం నుంచే వచ్చారు. హైదరాబాదు ప్రక్కన ఉన్నప్పటికీ, చుట్టూ పొలాలతో కూడుకున్న ఉస్మాన్‌సాగర్ క్రింద ఉన్న గ్రామం మీది. కరెంటు కోసం ఎంత ఇబ్బంది పడ్డారో మీకు కూడా తెలుసు, ఆరోజు ఏమి మాట్లాడారో మీకు కూడా ఐడియా ఉంటుంది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా ఉదయమే కరెంటు ఇవ్వాలని ఈ ప్రభుత్వం ఆలోచన చేయడం నిజంగా అభినందించవలసిన అంశం. గతంలో కాల్వ క్రింద ఉన్న వాళ్లే, కృష్ణా గోదావరి నదుల మధ్య ఉన్న వాళ్లే, అక్కడ వ్యవసాయం చేసుకునే రైతులు మాత్రమే వ్యవసాయానికి యోగ్యులనే భావన ఉండేది. కానీ ఈరోజు బోర్ల క్రింద, బావుల క్రింద వ్యవసాయం చేసే వాళ్లకి చిన్నగా విశ్వాసం కలుగుతోంది. నేను కూడా ఆ కోవలోకే వస్తాను. నేను కూడా రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడినే. మేము కూడా ఆ బాధలన్నీ అనుభవించిన వాళ్లమే. గతంలో బోర్లు వేస్తే, ఆ బోరుకి మోటరు కావాలంటే, కిలోమీటరు దూరం నుంచి లైను తీసుకొని రమ్మని మూడు సంవత్సరాలు ఎడిఇ, యస్.ఇ. లను సంప్రదించినా కూడా కరెంటు ఇవ్వలేని పరిస్థితి ఉండేది. భూమి లోపలే లైను వేసుకొని వ్యవసాయం చేసుకున్నాం మేము. దానికి మేము ప్రత్యక్ష సాక్షులం, మేము విక్టిమ్స్ కూడా. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అడగగానే వెంటనే స్తంభాలు వేయడం జరిగింది. రైతులకు మేలు చేయాలనే తపన ఈ ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తోంది.

ఈరోజు ప్రతిపక్షాల వాళ్లు అనేక అంశాల గురించి విమర్శలు చేస్తున్నారు. అనేక రకాలుగా మాట్లాడుతున్నారు. తెలంగాణాలో కరెంటు నిరంతరాయంగా వస్తుంటే ప్రతిపక్ష నాయకులు ఏమంటున్నారంటే – గత ప్రభుత్వం చేసింది మరచిపోయి, ఆనాడు వాళ్లు అధికారంలో ఉన్నారనే విషయాన్ని గుర్తించకపోగా, ఈ ప్రభుత్వం రాగానే పంటలు వేసుకోకండని రైతులకు చెబుతూ, అందుకే మిగులుందని మాట్లాడుతున్నారు. ఒక గందరగోళమైతే ఉంది. ప్రతిపక్ష నాయకులు చెబుతున్నది వాస్తవమా, లేదు, మీరు నిరంతరాయంగా కరెంటు ఇస్తున్నది వాస్తవమా అనే విషయాన్ని తప్పకుండా ఈ సభ ద్వారా చెప్పవలసిన అవసరం ఉంది. అసలు మన ఉత్పత్తి సామర్థ్యం ఎంత ఉంది, మన డిమాండు ఎంతో చెప్పవలసిన అవసరం ఉంది. రైతాంగానికి ఎంత అవసరం ఉంది, ఇచ్చేది ఎంతో చెబితే భరోసా కల్పించే అవకాశం ఉంది. నాట్లు వేసుకుంటే మేము నిరంతరాయంగా కరెంటు ఇస్తామని రైతులకు ఈ సభ ద్వారా భరోసా కల్పించవలసిన అవసరమైతే ఉంది.

గందరగోళంలో ఉన్న వాళ్లకి సమాధానం చెప్పే క్రమంలో అది రైతులకు కూడా చేరుతుంది కాబట్టి రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గారిని అడుగుతున్నాను, ఈ రెండు విషయాలపై తప్పకుండా స్పష్టత ఇవ్వవలసిన అవసరం ఉంది. కరెంటుకి సంబంధించి ప్రభుత్వపరంగా తీసుకోవలసిన చర్యలన్నింటినీ తీసుకుంటున్నారు. రెండు రూపాయలు ఎక్కువైనా ప్రక్క రాష్ట్రం నుంచి కొంటామంటున్నారు. 2018 నాటికి అదనంగా ఐదువేల మెగావాట్లు విద్యుత్పత్తి చేసి సర్ప్లస్ రాష్ట్రంగా చేస్తామని మరొకవైపు మాట్లాడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నిజంగా ప్రజలు ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారు, రైతులు ఆశీర్వదిస్తున్న సందర్భంలో ప్రతిపక్షనాయకులు గందరగోళం సృష్టిస్తున్నారు. దీనికి తప్పకుండా ప్రభుత్వపరంగా ఒక స్పష్టమైన ప్రకటన చేయవలసిన అవసరాన్ని మంత్రిగారి దృష్టికి తీసుకొస్తూ, ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

## 2. విద్యుత్ సరఫరాపై విద్యుత్ శాఖామాత్యుల సమాధానం

మిస్టర్ ఛైర్మన్: విద్యుత్ సమస్యపై సభ్యులు చర్చించిన సందర్భంగా విద్యుత్ శాఖామంత్రి జగదీశ్‌రెడ్డిగారు సమాధానం ఇవ్వవలసిందిగా రిక్వెస్ట్ చేస్తున్నాను.

శ్రీ జి.జగదీశ్ రెడ్డి : అధ్యక్షా, గత రెండు రోజులుగా, నిన్న ఈరోజు రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితిపై సభలో మంచి చర్చ జరిగింది. ఈ సభ ద్వారా తెలంగాణ ప్రజలందరికీ చాలా విషయాలు తెలుసుకునే అవకాశం వచ్చింది. ఇప్పటి వరకు శాసన మండలి సభ్యులు – గౌరవనీయులు శ్రీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి గారు, శ్రీ డి. రాజేశ్వరరావు, డాక్టర్ పల్లా రాజేశ్వరరెడ్డి, శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, శ్రీ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి గారు, శ్రీ సలీం గారు, శ్రీ యస్. రాములు నాయక్ గారు, శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు గారు, శ్రీ గంగాధర్ గౌడ్ గారు, శ్రీ కొంపల్లి యాదవరెడ్డి గారు, శ్రీ జాఫ్రీ గారు, శ్రీ పూల రవీందర్ గారు, శ్రీ కర్నె ప్రభాకర్ గారు ఈ చర్చలో పాల్గొని వివిధ అంశాలను సభ దృష్టికి, మాదృష్టికి తీసుకొచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఇదే సందర్భంలో పాపం ఆ సీట్లల్లో కూర్చోవలసిన మిత్రులు/ ప్రతిపక్షసభ్యులు కూడా ఉండింటే బాగుండేదని నేను భావిస్తున్నాను. సమావేశాలు ఏర్పాటు చేసుకున్న మొదటి రోజే బి.ఏ.సి. మీటింగులో ముఖ్యమంత్రిగారు చాలా స్పష్టంగా చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని రోజులు కోరితే అన్ని రోజులు సభను నడపడానికి మేము సిద్ధంగా ఉన్నాం, అన్ని విషయాల మీద చర్చ చేద్దాం, ప్రభుత్వం చేస్తున్న మొత్తం కార్యక్రమాల పట్ల, ప్రజలకు సంబంధించిన అన్ని అంశాల పట్ల ప్రతిపక్షాలకి చాలా తొందర ఉంది, తక్షణమే ఉత్పన్నమయ్యే సమస్యలను, ఏవిషయాలను తీసుకొచ్చినా మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రిగారు స్పష్టంగా చెప్పారు. అదే పద్ధతిలో రెండు రోజులు వ్యవసాయం మీద, రైతుల పరిస్థితి మీద చర్చ చేశాం. ముఖ్యమంత్రిగారు, వ్యవసాయ శాఖా మంత్రిగారు, ఇతర మంత్రులందరూ కూడా వ్యవసాయానికి సంబంధించి స్పష్టమైన సమాచారం ఇచ్చారు. దానికి గల కారణాలు చెప్పారు, ముఖ్యమంత్రిగారు పరిష్కార మార్గాలు కూడా చెప్పారు. రైతాంగాన్ని ఆదుకోవడానికి ఏమేమి చర్యలు తీసుకుంటున్నారో చెప్పారు. దీంట్లో భాగంగానే విద్యుత్‌పై కూడా చర్చ చేయాలనుకున్నాం, చర్చని ప్రారంభం కూడా చేశాం. ప్రతిపక్షాలకి రాజకీయాలే తప్ప ప్రజలు గానీ, రైతులు గానీ, ఈ రాష్ట్ర భవిష్యత్తుపై పట్టింపు లేని పద్ధతిలో వ్యవహరిస్తూ, అసలు సమస్యలను ప్రజల దృష్టినుంచి మరల్చడానికి ప్రయత్నం చేస్తూ సభలోంచి వెళ్లిపోవడం, ఈ అవకాశాన్ని వినియోగించుకోకుండా పోవడం దురదృష్టకరమైన విషయం. అయినప్పటికీ కూడా, ఎవరు సహకరించినా, సహకరించకపోయినా ఎట్టి పరిస్థితుల్లో ఈ రాష్ట్రాభివృద్ధికి ఏమి చేయాలో అది చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మీద్వారా సభ దృష్టికి, ప్రజల దృష్టికి తీసుకొస్తున్నాను. చర్చలో పాల్గొన్న సభ్యులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు, అదే విధంగా కొన్ని సందేహాలను కూడా లేవనెత్తారు, వాటిని నివృత్తి చేయడానికి నేను ప్రయత్నం చేస్తాను.

ప్రధానంగా చర్చకి వచ్చిన అంశం ఏమంటే – జూన్ 02, 2014 న తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణాలో వాస్తవంగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఎంతనే విషయం చర్చకి వచ్చింది. జూన్,02,2014 నాటికి రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2282.50 మెగావాట్లు. గత 60 సంవత్సరాల సుదీర్ఘ పాలనలో ఘనత వహించిన, గొప్ప గొప్ప ముఖ్యమంత్రులని చెప్పుకున్న వారి నాయకత్వంలో తెలంగాణ ప్రజలకి వాళ్లు ఇచ్చిన గొప్ప వారసత్వ సంపద 2282మెగావాట్లు మాత్రమే.

టి.ఆర్.ఎస్. ప్రభుత్వం రాగానే గౌరవ ముఖ్యమంత్రిగారు అన్ని విషయాలను ఆలోచన చేసి, రాబోయే అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ఇరిగేషన్ అవసరాలు గానీ, గ్రామాల అవసరాలు గానీ, పరిశ్రమల అవసరాలు గానీ దృష్టిలో పెట్టుకొని రాబోయే మూడేళ్లలో 24272 మెగావాట్ల విద్యుత్పత్తి సామర్థ్యం తెలంగాణ రాష్ట్రజెన్కో కలిగి ఉండాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకొని పని ప్రారంభించాం . అప్పుడు 2200 మెగావాట్లయితే మన ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం 24200మెగావాట్లని సభద్వారా తెలియజేస్తున్నాను. కేంద్ర విద్యుత్ ఉత్పత్తి స్టేషన్ల నుంచి మన వాటా 2038మెగావాట్లు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కేంద్రప్రభుత్వం నిర్ణయం చేసినపుడు, అప్పటికే

రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను కేంద్ర ప్రభుత్వ అధికారులు అంచనా వేసి, విద్యుత్ ఉత్పత్తి విషయంలో తెలంగాణాకి అన్యాయం జరిగిందన్నారు. ఈరోజున్న తెలంగాణ రాష్ట్ర అవసరాలకు సరిపోయే విద్యుత్ ఇవ్వాలంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏవైతే విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణం చేశారో అవి ప్రజల ఉమ్మడి సొమ్ముతో నిర్మాణం చేసినవే కాబట్టి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్పత్తి చేసే విద్యుత్ సంస్థల నుంచి 54శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోనే పొందుపరచడం జరిగింది. దాని ప్రకారం మనకి సీలేరు కాంప్లెక్సు నుంచి 390మెగావాట్లు, కృష్ణపట్నం నుంచి 862మెగావాట్లు, సాంప్రదాయేతర వనరుల నుంచి 307మెగావాట్లు – వెరశి మొత్తం 1558మెగావాట్ల విద్యుత్ మన రాష్ట్రానికి ఇవ్వవలసిన అవసరం ఉంది. కానీ దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణాకి రావలసిన విద్యుత్‌ని ఇవ్వకుండా ఆ చట్టాన్ని అపహాస్యం చేసి, చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించింది.

చాలా మంది మిత్రులు కేవలం రాజకీయాలు మాత్రమే మాట్లాడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కుల గురించి మాట్లాడతారేమోనని మేము ఆశించాం. తెలంగాణ ఉద్యమంలో కలిసి రాకపోయినా, తెలంగాణ ప్రజల ఆకాంక్షల వైపు వాళ్లు లేకపోయినా, వాళ్ల ఆంధ్ర అధిష్టానం కనుసన్నలలో మెలగినా, రాష్ట్రం ఏర్పడిన తర్వాతైనా తెలంగాణ ప్రజల అవసరాల వైపు, తెలంగాణ ప్రజల హక్కుల వైపు నిలబడతారని ఆశించాం. కానీ అంత బహిరంగంగా చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ, తెలంగాణ ప్రజల హక్కుని కాలరాస్తున్న ప్రక్క రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసే పరిస్థితుల్లో మన రాష్ట్ర ప్రతిపక్షం లేకపోవడం దురదృష్టకరం.

వాస్తవానికి సీలేరు విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుపై పూర్తి హక్కు తెలంగాణా రాష్ట్రానిదే. ఆనాడు కేంద్ర ప్రభుత్వం చేసిన రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అది తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నది. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగారు కేంద్రంలో తనకున్న పలుకుబడిని ఉపయోగించి, అది అవసరం లేకపోయినా, పోలవరం ముంపుకి , సీలేరు ప్రాజెక్టుకి ఏమాత్రం సంబంధం లేకపోయినా, పోలవరం ప్రాజెక్టు అవసరం తమకుందనే సాకు చూపించి తెలంగాణ నుంచి ఏడు మండలాలను తీసుకుని ఆంధ్రలో కలుపుకోవడమన్నది కేవలం మన సీలేరు ప్రాజెక్టు మీద కన్నువేసి తెలంగాణ రాష్ట్రానికి కరెంటు లేకుండా చేయడమేననే విషయాన్ని సభ దృష్టికి తీసుకొస్తున్నాను.

అంతేకాదు, గతంలో కూడా మీరు చూశారు. తెలంగాణ రాష్ట్రమొట్టమొదటి శాసనసభ, మండలిలో వాళ్ల పార్టీకి సంబంధించిన సభ్యులు–తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుచ్ఛక్తిని అందించడం లేదని ఏరకంగా నిరసన వ్యక్తం చేస్తూ ప్రజల్లోకి వెళ్లారో, మేము ప్రభుత్వాన్ని ఎండగడతామని తెలంగాణ ప్రజల్లోకి వెళ్లిన విషయాన్ని మనం ఒకసారి పరిశీలిస్తే దాని వెనకాల ఉన్న కుట్ర మనకు అర్థమవుతుంది.

1.40 మ. ఒకవైపు తెలంగాణాకు రావలసిన విద్యుచ్ఛకి వాటా మనకు ఇవ్వకుండా కృష్ణపట్నం 1600మెగావాట్ల పవర్ ప్రాజెక్టు పూర్తయి కమీషన్ చేయడానికి అన్ని అవకాశాలు ఉండి కూడా కేవలం దానిని కమీషన్ చేస్తే తెలంగాణాకు 862మెగావాట్ల విద్యుచ్ఛకి ఇవ్వవలసి వస్తుందని చెప్పి, తెలంగాణకు విద్యుచ్ఛక్తి రానివ్వకుండా ఉండడం కొరకే ఆపినటువంటి సందర్భం.

అంతేకాకుండా ప్రైవేటు సంస్థల వద్ద కూడా విద్యుచ్ఛక్తి ఎక్కడా దొరికినా కొనడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని చెప్పి, కొన్ని ప్రైవేటు సంస్థలను కూడా పిలిచి ఆంధ్ర ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్న, ఉత్పత్తి చేస్తున్న సంస్థల యజమానులను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు పిలిచి, మీ దగ్గర తయారయ్యే విద్యుత్ మేమే కొంటాము, మేమే అడ్వాన్సు ఇస్తాము, మీరు ఇంకా ఎవరికీ అమ్మవద్దని చెప్పి చెప్పిన సందర్భం.

అంటే ఇవన్నీ కూడా ఒక పథకం ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని, తెలంగాణ ప్రజల్లో ఒక గందరగోళాన్ని తీసుకురావాలని, తెలంగాణ రాష్ట్రాన్ని పుట్టుకలోనే గొంతు నొలిమేయాలనే ఒక కుట్ర పూరితంగా జరిగిన ప్రయత్నం. ఎందుకంటే, ఒకవైపు తాను ఇవ్వవలసిన విద్యుచ్ఛక్తి వాటా ఇవ్వకుండా తెలంగాణ రాష్ట్రం ఇంకోవైపు కొనే అవకాశం లేకుండా చేయడమే కాకుండా ఇక్కడ తనకు సంబంధించిన కొంతమంది వ్యక్తుల్ని ప్రజల్లోకి పంపించి ఒక గందరగోళం సృష్టించాలి, తెలంగాణలో పరిశ్రమలు లేకుండా చేయాలి, తెలంగాణలో రైతంగానికి వ్యవసాయం లేకుండా చేయాలి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని పని చేయకుండా చేయాలని, దానిద్వారా తెలంగాణ ప్రజలు మాకు తెలంగాణ రాష్ట్రమే వద్దని అనిపిస్తాననే ఒక అహంకారంతోని చేసిన కుట్రపూరిత ప్రయత్నంలో భాగంగానే తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు ఇబ్బందిలో పడిందనేది సత్యం.

అంతేకాకుండా, అంతకంటే ముందు చాలామంది మిత్రులు ప్రస్తావించారు. ఆనాటికి ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి పెద్దమనిషి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఇస్తుందని ప్రకటన చేయగానే, హడావుడిగా ఒక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మూడు గంటలపాటు ఉపన్యాసం ఇస్తే, తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాము కాబట్టి, అవసరం లేదని చెబుతాడేమో అని చాలామంది ఎదురు చూశారు. గానీ, ఏమాత్రం నేను కొన్ని పదాలు సభలో ఉపయోగించకూడదేమో గానీ, ఏమాత్రం సంకోచం లేకుండా 60ఏండ్లుగా తెలంగాణకు వారు చేసిన అన్యాయాన్ని బయట

పెట్టుకున్న సందర్భం. తెలంగాణ రాష్ట్రం గనుక ఏర్పడితే మీకు చీకటి తప్ప ఏముండదని, మీకు విద్యుచ్ఛక్తి లేదు, రైతాంగం వ్యవసాయం వదిలిపెట్టి పట్టణాలకు రావాలి, పట్టణాల్లో ఉన్న పరిశ్రమలు కూడా మూతపడి కార్మికులు రోడ్లమీదకి వస్తారు, మీకు భవిష్యత్తు లేదు. కాబట్టి మీరు తెలంగాణ రాష్ట్రాన్ని కోరవద్దని అన్నారు.

అంటే 60ఏండ్లుగా తెలంగాణలో మీకు విద్యుత్ ఉత్పత్తి లేకుండా మేమే చేశాము. మా గొప్ప పూర్వీకులే, మిమ్మల్ని పరిపాలించిన వారే చేశారన్న విషయాన్ని బహిరంగంగా చెప్పుకున్నటువంటి సందర్భం. కానీ, ఈరోజున్నటువంటి పరిస్థితి ఏమిటి అధ్యక్షా. కేవలం 6నెలల కాలంలోనే ఎవరు ఊహించనటువంటి పద్ధతుల్లో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకిచ్చిన మాట ప్రకారం అన్ని వర్గాల వారికి ఒక్క నిమిషం కూడా విద్యుత్ కొరత లేకుండా విద్యుత్‌ను అందిస్తున్న విషయాన్ని మనం గమనిస్తున్నాము. అధ్యక్షా, ఇది ఊరికినే సాధ్యం కాలేదు. ఇది దానంతటదే సాధ్యం కాలేదు. మన గౌరవ ముఖ్యమంత్రి గారు ఆనాడే అప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజల్ని బయపెట్టించిన ప్రయత్నాన్ని త్రిప్పికొడుతూ కేవలం 24గంటల వ్యవధిలోనే అన్ని వైపుల నుండి సమాచారం తీసుకొని తెలంగాణ ప్రజలకు ఒక ధైర్యాన్ని, ఊరటనిచ్చే ప్రకటన ఆరోజే చేశారు.

వాస్తవమే ఈరోజు ఉన్నటువంటి పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలకు విద్యుచ్ఛక్తి విషయంలో కొంత ఇబ్బంది అవుతుంది. కానీ, రేపు రాష్ట్రం ఏర్పడిన తరువాత కేవలం ఒక్క సంవత్సర కాలంలోనే నేను తప్పకుండా పరిస్థితిని పునరుద్ధరణ చేస్తా, తెలంగాణ ప్రజలకు, తెలంగాణ రైతాంగానికి, తెలంగాణ గృహ అవసరాలకి చెప్పిన పద్ధతుల్లో తెలంగాణ ప్రజలకు విద్యుచ్ఛక్తిని అందించడానికి ప్రయత్నం చేస్తా, ఎవరు కూడా బయపడాల్సిన అవసరం లేదు అని చెప్పడం జరిగింది. ఆనాటికి ముఖ్యమంత్రి కాకపోవచ్చు, అధికారంలో లేకపోవచ్చు, కానీ ఒక ఉద్యమ నాయకుడిగా ప్రజలకు ఒక భరోసాను, ఒక విశ్వాసాన్ని ఇవ్వడానికి ఆనాడే శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు ఉద్యమ ప్రయత్నం చేయడం జరిగింది.

అంతేకాకుండా ఒక అడుగు ముందుకు వెళ్లి ప్రక్క రాష్ట్రాల్లో ఎక్కడ మిగులు విద్యుచ్ఛక్తి ఉన్నదనే విషయాలను తెలుసుకొని వారందరితో మాట్లాడి తప్పకుండా మేము కొత్త రాష్ట్రంగా ఏర్పడబోతున్నాము, రేపు మా రాష్ట్రం ఏర్పడిన తరువాత మా ప్రజలకి విద్యుచ్ఛక్తి అవసరం ఉంటుందని చెప్పి మీరు మా ప్రజలకు విద్యుచ్ఛక్తిని ఇవ్వాల్సి ఉంటుందని ఆనాడే కోరడం జరిగింది. రాష్ట్రం ఏర్పడగానే మొట్టమొదటి రోజు నుండి గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రత్యేక దృష్టి పెట్టింది విద్యుచ్ఛక్తి విషయంలోనే. అందుకే ఈరోజు పరిస్థితుల్ని ఇంత తొందరగా చక్కదిద్దుకోగలిగాము.

ఎన్నికల సభల్లో కూడా, బహుశా ఈ దేశంలో ఏ రాజకీయ నాయకుడు కూడా ఎన్నికల సమయంలో ప్రతికూల అంశాలు చెప్పిన మాట లేదు. అంత ధైర్యమున్న ఒక ముఖ్యమంత్రి, అంత ధైర్యమున్న ఒక నాయకుడు ఈదేశంలో శ్రీ కె.చంద్రశేఖర్ రావు తప్ప, ఇంకొకరు లేదన్న విషయం నిరూపితమయింది. వారు పాల్గొన్న మొత్తం సభల్లో ప్రతి గ్రామీణ సభల్లో తెలంగాణ రైతాంగం, తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలే గత పాలకులు చేసిపోయిన తప్పిదాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి లేదు, మనకు ఇబ్బందులు ఎదురవుతాయి, ఒక సంవత్సరం పాటు మీరందరు కూడా సహకరించాలని, సంవత్సరం తరువాత నేను పరిస్థితిని చక్కదిద్దుతా అని చెప్పడం జరిగింది. ప్రజలు కూడా దానిని అర్థం చేసుకొని, దానికి ఆమోదం తెలిపి శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు ఆ మాట చెప్పిన తరువాతనే ప్రజలు తెలంగాణ రాష్ట్రసమితికి పార్టీకి ఓట్లు వేశారు, ముఖ్యమంత్రి గారిని అధికారంలోకి తెచ్చారు శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారి మీద ఉన్న విశ్వాసంతోనే. అదేవిధంగా శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు కూడా ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ వారిచ్చిన సంవత్సర సమయాన్ని కూడా తీసుకోకుండా కేవలం ఆరు నెలల కాలంలోనే మొత్తం పరిస్థితిని పునరుద్ధరించి అనుకున్న సమయంలోనే గృహ, పారిశ్రామిక అవసరాలకి 24గంటలు విద్యుచ్ఛక్తి అందిస్తున్నాము. బహుశా ఇది ప్రపంచంలో ఎవరూ కూడా ఊహించని, ఎవరూ కూడా ఆశించని ఒక గొప్ప అభివృద్ధి.

నేను కూడా ఈమధ్య కాలంలో ఒక పొరుగు దేశానికి పోయినప్పుడు అక్కడ ఒక తెలంగాణ మిత్రుడు కలిశాడు. ఆయన చెప్పిన మాట ఏమిటంటే, అన్నా మొన్ననే ఊర్లోనుండి మా అమ్మ ఫోను చేసింది. 30ఏండ్ల తరువాత ఎండకాలం మొత్తం నేను ఊర్లోనే ఉన్నాను, ఎప్పుడు కూడా ఎండకాలం వచ్చిందంటే హైదరాబాదుకు అక్కదగ్గరకు వెళ్లవలసి వచ్చేది, ఎండకాలం వస్తే ఊర్లో కరెంటు, నీళ్లు లేకుండేది. కానీ, మొట్టమొదటిసారిగా ఊర్లో కరెంటు ఉండంగా చూశాను అని చెప్పడం జరిగిందని అన్నాడు. నిజంగా కూడా నాకు సంతోషం అనిపించింది.

చాలామంది సభ్యులు పేర్కొన్నట్లు, ఎండకాలమే కాదు, ఏకాలంలోనైనా వారాల తరబడి గ్రామాలు చీకట్లో ఉన్నటువంటి సందర్భం. గంటల తరబడి పట్టణాలల్లో కరెంటు లేనటువంటి సందర్భం. రోజుల తరబడి పరిశ్రమలు మూసివేసిన సందర్భం. కాని గౌరవ ముఖ్యమంత్రి మా విద్యుచ్ఛక్తి అధికారులకు ఒకే మాట చెప్పడం జరిగింది. 60సంవత్సరాలుగా తెలంగాణ రైతాంగం ఆంధ్ర పరిపాలకుల చేతుల్లో నాశనం అయింది. ఇప్పుడు మనం వచ్చాం, మనమీద ప్రజలు విశ్వాసంతో ఎదురుచూస్తున్నారు, ఈసంవత్సరం

ఒక్క గుంట పొలం కూడా ఎండిపోవడానికి వీలు లేదు. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ఈదేశంలో విద్యుచ్ఛక్తి ఎక్కడ, ఏ ధరకు దొరికినా దొరికినా సరే తీసుకురండి ఎన్ని నిధులైనా వెచ్చించడానికి నేను సిద్ధంగా ఉన్నా, తెలంగాణ రైతంగాన్ని మాత్రం ఎట్టిపరిస్థితుల్లో కాపాడి తీరాలని చెప్పారు. దానికి మన అధికారులు కూడా రాత్రి, పగలు పని చేసి తూ.చా. తప్పకుండా అమలు చేశారు. ఈరోజు గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతి క్షణం సమీక్ష చేస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు తగిన ఆదేశాలిచ్చారు కాబట్టే ఈరోజు ఇది సాధ్యమైంది.

వాస్తవానికి గౌరవ ప్రతిపక్ష నాయకులు, మిగతా కొంతమంది గౌరవ సభ్యులు లేకపోవడం బాధ అనిపిస్తుంది. కానీ, ప్రభుత్వాన్ని ఒకవైపు ప్రక్క రాష్ట్రాలను ఇబ్బంది పెడుతున్నప్పటికీ, ఎన్నో ప్రతికూల అంశాలున్నప్పటికీ, ఈరాష్ట్రరైతాంగం కొరకు, ఈరాష్ట్ర ప్రజల అవసరాలు తీర్చడం కొరకు చేసిన కృషిని అభినందించాల్సింది పోయి రాజకీయాలు ఆలోచన చేయడం జరుగుతుంది. రాజకీయాలు చేస్తే, చేసుకోవచ్చు ఏపార్టీకాపార్టీ రాజకీయాలు చేసుకుంటే తప్పేమి లేదు. కానీ, తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులకు భంగం కలిగే పద్ధతుల్లో, ప్రక్క రాష్ట్రం చేసే కుట్రలకు మద్దతిచ్చే పద్ధతుల్లో మన ప్రతిపక్ష నాయకులు చేరి ఉండడం అనేది నిజంగా బాధాకరమైన విషయం. ప్రభుత్వం పనులు చేయకపోతే విమర్శ చేయవచ్చు, ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతే విమర్శలు చేయవచ్చు, కానీ పొరుగు రాష్ట్రాలు మన రాష్ట్రహక్కుల్ని హరిస్తున్న విషయంలో కూడా కలసి రాకపోవడం అనేది నిజంగా కూడా బహుశా అది ఏ రాష్ట్రంలో కూడా ఉండదు. ఈవిచిత్రమైన పరిస్థితి, కేవలం మన రాష్ట్రంలోనే చూస్తున్నాము.

అధ్యక్షా, ఇదే సందర్భంలో ఇక విద్యుచ్ఛక్తి ఇచ్చేశాము. ఇంక ఏమిలేదని ప్రభుత్వం ఊరికనే కూర్చోవడం లేదు. మనం ప్రజలకిచ్చిన హామీని నెరవేర్చామన్న కొంత సంతోషం ఉన్నప్పటికీ ఈ రాష్ట్ర అవసరాలు తీర్చడానికి, ఈ రాష్ట్రయువకులకు అనుకున్న పద్ధతిలో పని కల్పించడానికి కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కొరకే ఎదురుచూసే సందర్భం కాదు కాబట్టి, పారిశ్రామీకీకరణ పెంచడం ద్వారానే లక్షలాది ఉద్యోగాలు క్రియేట్‌చేసే అవకాశం ఉంది కాబట్టి, రేపటి పారిశ్రామిక అవసరాలు ఎలా ఉంటాయి. లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించడానికి మనం చేసే ప్రయత్నంలో పరిశ్రమల్ని ఎంకరేజ్ చేయడానికి విద్యుచ్ఛక్తి ఏ పద్ధతుల్లో ఉండాలనే విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారేస్వయంగా ఆలోచన చేసి 2018-19వసంవత్సరం ముగిసేనాటికి ఈరాష్ట్రం 24,000మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పాదన చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. వెంటనే దానికి అనుగుణంగా రాష్ట్రంలోని జెన్‌కో గానీ, ట్రాన్స్‌కో గానీ మరియు డిస్కంలు గానీ, అధికారులందరూ కూర్చోని ఈ నాలుగు సంవత్సరాలకి ప్రణాళికలు తయారు చేయడం జరిగింది.

దానికి సంబంధించిన వివిధ రకాల ప్రశ్నలు గౌరవ సభ్యులు లేవనెత్తడం జరిగింది. వాటిని కూడా మీద్వారా సభ దృష్టికి తీసుకురాదలచుకున్నాను. కేవలం డబ్బులు పెట్టి కొనే విషయమే కాకుండా ఉన్న అవకాశాలని ఎలా సద్వినియోగం చేసుకోవాలని, వీలైనంత మేరకు ప్రజాధనాన్ని ఎట్లా కాపాడాలి. ఎంత తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను ఎలా తీసుకురావాలనే విషయంలో కూడా మన విద్యుత్ అధికారులు రాత్రీ, పగలు పని చేయడం ద్వారా కేవలం ఈ సంవత్సర కాలంలోపే టిఎస్‌జెన్‌కో టిపిఎల్‌ఎఫ్‌ను 74శాతం నుండి 80శాతం పెంచడం, టిడి నష్టాల్ని 16.83శాతాన్ని 15.98శాతానికి తగ్గించడం, రోజులో 24గంటల్లో ధపాల వారిగా లోడు ఒక పద్ధతి ప్రకారం అమర్చడం జరిగింది. అంతే కాకుండా, తక్కువ ధరలో వచ్చే పద్ధతుల్లో స్వల్పకాలిక కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం జరిగింది. ప్రతిరోజు, ప్రతినిమిషం ఎక్స్చేంజ్‌లో కొనుగోలు చేయడం ద్వారా ఏక్షణం తక్కువ ధరకు దొరికితే, ఆ క్షణం ఆ విద్యుత్‌ను తీసుకోవడం జరుగుతోంది. ఇటువంటి చర్యలు తీసుకోవడం ద్వారా అనుకున్న పద్ధతిలో ఇప్పటివరకు విద్యుచ్ఛక్తిని అందించగలిగాము.

రేపటి భవిష్యత్ అవసరాలకు కూడా ఇబ్బంది రాకుండా ఈ స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా దాదాపు 3,300మెగావాట్ల విద్యుచ్ఛక్తిని కొనుగోలు చేయడానికి ఇప్పటికే ఆదేశాలివ్వడం జరిగింది. ఏదైతే ఐబిపిల ద్వారా గ్యాస్ వచ్చేదుందో దానికి కూడా దాదాపు 435మెగావాట్ల విద్యుచ్ఛక్తికి ఆదేశాలివ్వడం జరిగింది. అదే పద్ధతుల్లో 2015 అక్టోబరు నుండి 2016 మార్చి వరకు 550మెగావాట్ల కొరకు ఆదేశాలివ్వడం జరిగింది. హర్యానాలోని జర్‌జర్ విద్యుత్ కేంద్రం నుండి కూడా ఈసంవత్సరానికి 2,200మెగావాట్లు, వచ్చే సంవత్సరం నుండి 374మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేసుకోడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకోవడం జరిగింది.

అంతేకాకుండా ఏదైతే మనం 24,000మెగావాట్ల విద్యుత్ తయారు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నామో, దాని విషయం కూడా ఎలా చేస్తున్నారని సభ్యులందరు కూడా వారి, వారి ప్రశ్నల్లో అడగడం జరిగింది. మనుగూరులో 1080మెగావాట్లు వచ్చే డిసెంబరు నాటికి, కొత్తగూడెంలో 800మెగావాట్లు డిసెంబరు 2017 నాటికి, దామర్‌చర్లలో 4000మెగావాట్లు డిసెంబరు 2018నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటికే ఇవన్నీ ప్రాజెక్టులకు గౌరవ ముఖ్యమంత్రి గారిచే శంఖుస్థాపనలు చేయించడం జరిగింది. ఈ ప్రాజెక్టులన్నీ కూడా అనుకున్న సమయానికి పూర్తి చేయడానికి అధికారులందరూ కూడా రాత్రి, పగలు పని చేయడం జరుగుతుంది.

అంతేకాకుండా, మొత్తం భారతదేశంలోనే రికార్డు సమయంలో మన రాష్ట్రంలోని ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు, అటవీశాఖ అనుమతులు తెచ్చింది కూడా మొదటిసారని తెలియజేసుకుంటున్నాను. ఇప్పటివరకు గత చరిత్ర మనం చూసుకున్నప్పుడు కేవలం పర్యావరణ, అటవీ శాఖ అనుమతులు లేవని చెప్పి దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్నటువంటి ప్రాజెక్టులను ఎన్నింటినో చూస్తున్నాము. అది నల్గొండ జిల్లాలో ఎస్ఎల్‌బిసి కావచ్చు, ఇంకొకటి కావచ్చు, ఇంకొకటి కావచ్చు. ఏ అనుమతుల కొరకైనా గతంలో మా అధికారుల అనుభవంలో 2 నుండి 3 సంవత్సరాల లోపు అనుమతులు పొందిన ప్రాజెక్టు ఏదీ కూడా లేదు.

2.00 మ. ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు అందక, సంవత్సరాల తరబడి ఎలాంటి పురోగతి ఉండేది కాదు. ఆ నాటి పరిస్థితులకి విరుద్ధంగా, నేటి మన ముఖ్యమంత్రిగారు చూపిన చొరవ వలన, కేవలం రెండు,మూడు నెలల కాలంలోనే మనం అవసరమైన అనుమతులు కేంద్ర ప్రభుత్వం నుండి పొందగలిగాము. గతంలో ఎక్కడ పవర్ ప్రాజెక్టులు నెలకొల్పాలన్నా, ఋణం కొరకు సంవత్సరాల పాటు ప్రయత్నించవలసి వచ్చేది. కాని మన ముఖ్యమంత్రిగారు అవలంబించిన పారదర్శక విధానం వల్ల, పేరు మోసిన ఆర్థిక సంస్థలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఋణాలు ఇవ్వడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ముఖ్యమంత్రిగారికి చెక్కులు అందచేసిన సందర్భాలు ఇప్పుడు మనం చూడవచ్చు అధ్యక్షా.

గతంలో గ్యాస్ ఆధారిత ప్రాజెక్టుల విషయంలో ఆ నాటి ప్రభుత్వాలు అనుసరించిన వైఖరి వల్ల, విద్యుత్తు ఉత్పత్తి జరగకపోగా, వేల కోట్ల అవినీతి ఏరులై పారింది. అటువంటి తప్పుడు పద్ధతులకు ఏ మాత్రం తావు లేకుండా, ప్రైవేటు సంస్థలు కాకుండా, పేరున్న పెద్ద ప్రభుత్వ రంగ సంస్థలు అయితేనే బాగుంటుందని, బిహెచ్ఇఎల్ వారికి అన్ని విద్యుత్ ప్రాజెక్టులు అప్పగించడం జరిగింది. మన ప్రభుత్వం యొక్క పనితీరుని, పారదర్శకతను చూసి Power Finance Corporation, REC వంటి సంస్థలు దాదాపు రూ30,000కోట్ల మేరకు ఋణాలు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు మనం ప్లాన్ చేసుకున్న పవర్ ప్రాజెక్టులన్నిటికీ ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం జరిగింది. ఆర్థికంగా ఇబ్బందులు లేవు కాబట్టి, ప్రాజెక్టులు సకాలంలో పూర్తిచేస్తామని మనవి చేస్తున్నాము అధ్యక్షా. మన దేశంలో ఇప్పటివరకు ఏ విద్యుత్‌ప్రాజెక్టు కూడా ఐదారు సంవత్సరాల కాలంలో పూర్తైన దాఖలాలు లేవు. కాని మన ముఖ్యమంత్రిగారు మణుగూరు ప్రాజెక్టును రెండు సంవత్సరాల వ్యవధిలో పూర్తిచేయాలని బిహెచ్ఇఎల్ అధికారులను ఆదేశించడము, వారు కూడా అందుకు అంగీకరించి, పనులు ప్రారంభించడం కూడా జరిగింది.

ఇంతకుముందు గౌరవ సభ్యులు కొందరు రైతులకు ఏ విధంగా మనం ధైర్యం కల్పించబోతున్నాం అని అడగడం జరిగింది. ఒక నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తే బాగుంటుంది, ప్రజలకు కూడా ఒక విశ్వాసం ఏర్పడుతుందని వారు సూచించారు. వాస్తవానికి మన ముఖ్యమంత్రిగారికి చేసేదే చెప్పడం అలవాటు. అలాగే వారు ఏదైతే చెప్పారో అది ఖచ్చితంగా అమలు చేసి తీరుతారని మరొకసారి సభకు గుర్తు చేస్తూ, రాబోయే కొద్ది రోజులలో భూపాలపల్లికి సంబంధించిన 600మెగావాట్ల ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాము. అదే విధంగా జైపూర్ ప్రాజెక్టులో 1200మెగావాట్ల మొత్తం 1800మెగావాట్లు వచ్చే మార్చినాటికి మన జెన్‌కో ఉత్పత్తి కేంద్రంలో చేరబోతున్నది.

దీనికి తోడు మరొక 400మెగావాట్ల విద్యుత్తు మనకు కేంద్రం నుండి వచ్చే అవకాశం ఉంది. ఇది కాకుండా, సోలార్ విద్యుత్తు ద్వారా మరొక 500మెగావాట్లు రాబోతున్నది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని, గౌరవ ముఖ్యమంత్రిగారు రైతులకు ఆరుగంటలు, పరిశ్రమలు, గృహావసరాలకు నిరంతరంగా విద్యుత్తును అనుకున్న ప్రకారం ఇవ్వగలిగినందుకు సంతోషపడి, అక్కడితో ఆగిపోకుండా, వెంటనే మరొక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రైతాంగానికి వచ్చే మార్చినాటికి ఎట్టి పరిస్థితుల్లోనైనా తొమ్మిదిగంటల విద్యుత్తును, పగటి పూటనే అందించే విధంగా చర్యలు చేపట్టమని మాకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అందుకు అనుగుణంగా మా శాఖ అధికారులంతా తగు ప్రణాళికను కూడా తయారుచేయడం జరిగింది. ఈ విషయం సభ ద్వారా ప్రజలకు తెలియవలసిన అవసరం ఉంది.

ఈ సందర్భంలో సభకు తెలియచేయవలసిన ఒక దురదృష్టకరమైన విషయం ఏమిటంటే విద్యుత్తును కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికి కూడా, మనకు తగిన ప్రసార, పంపిణీ వ్యవస్థలు లేవు. మనకు అనుకోని సందర్భంలో తక్కువ రేటుకి విద్యుచ్ఛక్తి దొరికి, రైతాంగానికి అందిద్దామంటే కూడా, ఇప్పుడున్న లైన్లు అందుకు అనుగుణంగా లేవు. అందుగురించే కొత్త లైన్ల కొరకు, ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడానికి ట్రాన్స్‌కో ద్వారా ఇప్పటికే రూ.940కోట్లతో కొత్త లైన్లు వేయడానికి, డిస్కమ్‌ల ద్వారా రూ.1150 కోట్ల బడ్జెట్‌ను కేటాయించి ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తిచేయడానికి అన్ని చర్యలు తీసుకున్నాము అధ్యక్షా.

గౌరవ సభ్యులు సబ్‌స్టేషన్ల గురించి సమాచారం అడిగినారు. గత అరవై సంవత్సరాల కాలంలో ఈ రాష్ట్రంలో 2100 సబ్‌స్టేషన్లు

నిర్మాణం జరుపుకోగా, ఈ ఒక్క సంవత్సరమే ఇప్పటివరకు 384 కొత్త 33/11 సబ్‌స్టేషన్లు మంజూరు చేసి, వాటిలో 280 పూర్తిచేయడం జరిగింది. మిగతావి కూడా అతి త్వరలో పూర్తవుతాయి. ఇవే కాకుండా, 2100 సబ్‌స్టేషన్లు ఏవైతే ఉన్నాయో, వాటిలో అవకాశమున్న ప్రతిచోట పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడానికి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. వాటికి సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తి కాబోతున్నాయి. దాదాపు వెయ్యి సబ్‌స్టేషన్ల కెపాసిటీని రెట్టింపు చేయడానికి ఏర్పాట్లు జరిగాయి. వాటితో పాటుగా ట్రాన్స్‌మిషన్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ లైన్లు కూడా అభివృద్ధి చేయడం జరుగుతుంది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం “అందరికీ విద్యుతు” (Power for All) అనే కార్యక్రమం ద్వారా 2018-19 నాటికి ఇరవై నాలుగ్గంటల విద్యుత్తు అనే పథకం క్రింద మనకు రూ.1116 కోట్లను మంజూరు చేయడం జరిగింది. ఇందులో రూ.837కోట్లు గ్రాంట్‌గా, మిగిలిన మొత్తం లోన్‌గా కేంద్రం మనకు అందచేస్తున్నది. ఈ అవకాశాన్ని ప్రభుత్వం పూర్తిగా వినియోగించుకుని, ప్రజలకు మంచి విద్యుత్తును అందించే ప్రయత్నం చేస్తుంది.

అలాగే రాబోయే నాలుగేళ్ల కాలంలో రానున్న అదనపు లోడ్‌ను తీసుకోవడానికి, 400 KV సబ్‌స్టేషన్లు 18, 220 KV సబ్‌స్టేషన్లు 34,132 KV సబ్‌స్టేషన్లు 90, ఇప్పుడున్న వాటికి అదనంగా జత చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. రాబోయే నాలుగేళ్లకాలంలో రూ.91,500కోట్ల వ్యయంతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం, అలాగే ట్రాన్స్‌కో మరియు డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థల సామర్థ్యాన్ని కూడా పెంచుకోవడం కొరకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు ఇరిగేషన్‌శాఖ అధికారులు కృష్ణాగోదావరి జలాల్లో మనవాటాకి చెందిన ప్రతి చుక్కను వినియోగించుకుని, తెలంగాణ రైతాంగానికి నీళ్లు ఇవ్వడానికి ఏ విధంగానైతే ప్రయత్నాలు జరుగుతున్నాయో, దానికి సంబంధించిన ఎత్తిపోతల పథకానికి, తెలంగాణలో ఇంటింటికి మంచినీరు అందించే వాటర్ గ్రిడ్‌పథకానికి 7500మెగావాట్ల విద్యుత్ అవసరముంటుందని ముందుగానే అంచనా వేయడం జరిగింది. ముఖ్యమంత్రిగారు మరొక ఆలోచన కూడా చేసి, గృహావసరాలు, పారిశ్రామిక అవసరాలను విడివిడిగా చూసి ఇబ్బంది పడవద్దు. ఒకే సందర్భంలో మనం 24,000మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని మనం లక్ష్యంగా ఎలాగైతే నిర్ణయించుకున్నామో, ఆ 24,000మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఒకేసారి పంపిణీ అయ్యే పద్ధతుల్లో మీ వ్యవస్థ సామర్థ్యం ఉండాలని వారు నిర్దేశించడం జరిగింది. అందుకు అనుగుణంగా మరొక రూ.14,500కోట్లు ట్రాన్స్‌కో, డిస్కమ్‌లు అప్పు తీసుకునైనా సరే, అన్ని ఏర్పాట్లు చేసి, సంసిద్ధంగా ఉండాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.

ఏకకాలంలో 24,000మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఈ రాష్ట్రంలో ఉండే అన్ని వర్గాల వారి అవసరాలకు అందించే పద్ధతిలో విద్యుత్ వ్యవస్థను రూ.1,05,000కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడం జరుగుతుంది. గత ప్రభుత్వాలు, గత ముఖ్యమంత్రులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారే తప్ప, పవర్(విద్యుత్తు) ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం చెప్పింది చెప్పిన ప్రకారం, అనుకున్నది అనుకున్న ప్రకారం అమలు చేయడానికి కట్టుబడి ఉందని ఈ సభద్వారా మనవి చేస్తున్నాను. 2018-19 నాటికి తెలంగాణ ప్రభుత్వం తన అవసరాలు పూర్తిగా తీర్చుకుని, మిగులు విద్యుత్తు రాష్ట్రంగా నిలబడగలిగే స్థాయికి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రిగారి ఆలోచన. పవర్‌కట్ అనేది ఒకటి ఉంటుందనే విషయం ప్రజలకు తెలియకుండా ఉండే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని తయారుచేయాలని వారి లక్ష్యం. ముఖ్యమంత్రిగారి ఆలోచనల ప్రకారం విద్యుత్ శాఖలో ఉన్న మొత్తం అధికారులు, క్రిందిస్థాయి నుండి పై వరకు, అహర్నిశలు పనిచేస్తూ, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, 2018 చివరి నాటికి ఈ రాష్ట్రం మిగులు ఉత్పత్తి విద్యుత్ రాష్ట్రంగా నిలబడుతుందనే విషయాన్ని మీ ద్వారా సభకు తెలియచేస్తున్నాను.

అలాగే గౌరవ సభ్యులు శ్రీ జాఫ్రిగారు కొన్ని విషయాలు లేవనెత్తారు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో రూ.700కోట్ల వ్యయంతో పూర్తిగా RAPDR ద్వారా పనులు ప్రారంభించాము.

400KV సబ్‌స్టేషన్ 1, 220KV సబ్‌స్టేషన్లు 6, 130KV సబ్‌స్టేషన్లు 20, 33KVసబ్‌స్టేషన్లు 60, వీటిని పూర్తి చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు జరిగాయి. చాలా వరకు అవి ముగింపు దశలో ఉన్నాయి. అదే విధంగా నగరంలో అండర్‌గ్రౌండ్ వైరింగ్ చేయడానికి కూడా పనులు ప్రారంభమైనాయి. భూ సేకరణకు సంబంధించి కొన్ని ఇబ్బందులు తలెత్తినప్పటికీ, వాటిని కూడా అధిగమించి, త్వరలో పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాము. అలాగే హైదరాబాద్ నగరానికి సంబంధించి శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు అందరితో కూడా త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేసి, ఇతర సమస్యలు ఇంకా మరేవైనా ఉన్నట్లైతే, వాటిని కూడా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మనవి చేస్తున్నాను. త్వరలోనే ఒక తేదీని నిర్ణయించి, వారిని సమావేశానికి ఆహ్వానించడం జరుగుతుంది. వారు ఆ సమావేశానికి హాజరై, సమస్యలు మా దృష్టికి తీసుకువచ్చినట్లైతే, వాటిని తప్పకుండా పరిష్కరిస్తాము. అలాగే పెద్దలు శ్రీ యాదవరెడ్డిగారు, మరికొందరు

ఇతర గౌరవ సభ్యులు క్రింది స్థాయిలో ఉండే కొన్ని చిన్న సమస్యల గురించి ప్రస్తావించినారు. ప్రస్తుతం మనకు ఉండవలసిన సిబ్బందిలో సగం మంది మాత్రమే ఉన్నారు. సగం మండలాల్లో ఎ.ఇ. స్థాయి అధికారులు లేరు. ఆ ఖాళీలను భర్తీ చేయడానికి మొన్ననే మనం సర్వీస్ కమీషన్‌కు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. 1422 మంది ఎ.ఇ. లను ఒక నెలన్నర కాలంలో నియమించబోతున్నాము. మిగతా సిబ్బందిని కూడా పూర్తి స్థాయిలో నియమించి, క్షేత్రస్థాయిలో ఉండే సమస్యలను అధిగమించడానికి ప్రయత్నం చేస్తామని మనవి చేస్తున్నాను. ఇంతమంచి చర్చ జరగడానికి అవకాశం కల్పించినందుకు, వారు మంచి సూచనలు చేసినందుకు గౌరవ సభ్యులందరికి మరొకసారి ధన్యవాదాలు తెలియచేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్: 7-10-2015వ తేదీ ఉదయం 10గంటలకు సమావేశం కావడం కొరకు సభను వాయిదా వేయడమైనది.

(Then the House is adjourned at 2.17 PM to meet at 10.00 A.M. on Wednesday 7-10-2015)

* * *

“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.”